సాహితీ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం
: fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
12-4-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 70 పేజీలు: 8+16 వెల: 6.50

**అమెరికాపై చైనా 125 శాతం సుంకాలు**

5లో

**అన్నాడిఎంకెతో బిజెపి పొత్తు అసెంబ్లీ ఎన్నికల్లో కలిసే పోటీ**

# ఫ్యూచర్ సిటీ వరకు 'మెట్రో'

## తుది ప్రతిపాదనలు సిద్ధం చేయాలి : సిఎం రేవంత్ సమీక్ష



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్11:** ఫ్యూచర్ సిటీ వరకు మెట్రోను విస్తరించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నిర్ణయించారు. అందుకు అవసరమైన తుది ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మెట్రో విస్తరణపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సిఎంతో పాటు సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, శ్రీనివాసరాజు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సిఎం ముఖ్యకార్యదర్శి వి.శేషాద్రి, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెట్రో రెండోదశ విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనల పురోగతిని ముఖ్యమంత్రి ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉందని, ఇప్పటికే ఢిల్లీలో అధికారులను కలిసి సంప్రదింపులు జరిపినట్లు అధికారులు వివరించారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించి నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ వరకు (36.8కి.మీ.), రాయదుర్గం-కోకాపేట నియోపొలిస్ (11.6కి.మీ.), ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), మియాపూర్-పటాన్‌చెరు (13.4 కి.మీ.), ఎల్బీ నగర్-హయత్‌నగర్ (7.1 కి.మీ.)మొత్తం 76.4కి.మీ.ల విస్తరణకు రూ.24, 269 కోట్ల అంచనాలతో డిపిఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపించింది. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం చెరిసగం నిధులు భరించేలా జాయింట్ వెంచర్‌గా ఈ ప్రాజెక్టు చేపట్టేలా ప్రతిపాదనలు తయారు చేసింది.

కేంద్రం నుంచి అనుమతులు సాధించేందుకు నిరంతరం ప్రయత్నించాలని, అనుమతులు రాగానే పనులు ప్రారంభించేందుకు సన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్ డెవెలప్‌మెంట్ యూనివర్సిటీ వరకు 40 కిలోమీటర్ల మేరకు మెట్రో విస్తరించేందుకు కొత్త ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దాదాపు 30వేలఎకరాల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చెందుతుందని, భవిష్యత్తు నగర విస్తరణ అవసరాల దృష్ట్యా మెట్రోను మీర్ఖాన్‌పేట వరకు పొడిగించాలని చెప్పారు. అందుకు అవసరమయ్యే అంచనాలతో డిపిఆర్ తయారు చేసి కేంద్రానికి పంపించాలని సూచించారు. హెచ్‌ఎండిఎతో పాటు ఎఫ్ఎస్డీఎను (ఫ్యూచర్ సిటీ డెవెలప్‌మెంట్ అథారిటీ)ని ఈ రూట్ మెట్రో విస్తరణలో భాగస్వామ్యులను చేయాలని చెప్పారు.

**మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు పనులు వేగం పెంచాలి**

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. బాపూ ఘాట్‌లో నిర్మించ తలపెట్టిన గాంధీ సరోవర్‌తో పాటు మీర్ అలం ట్యాంక్‌పై నిర్మించనున్న బ్రిడ్జి నమూనాలను సిఎం పరిశీలించారు. మీర్ అలం ట్యాంక్‌పై బ్రిడ్జి నిర్మాణ పనులకు జూన్‌లో టెండర్లు పిలవాలని ముఖ్యమంత్రి అన్నారు. ఈలోగా అందుకు అవసరమైన సర్వేలు, నివేదికలు, ప్రతిపాదనలు, డిజైన్లతో డిపిఆర్‌ను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. శుక్రవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మూసీ పునరుజ్జీవనంపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. మీర్ అలం ట్యాంక్ పై నిర్మించే బ్రిడ్జికి సంబంధించి కన్సల్టెన్సీలు తయారు చేసిన నమూనా డిజైన్లను అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రదర్శించారు. రెండున్నర కిలోమీటర్ల పొడవైన ఈ బ్రిడ్జిని

>>2



వారణాసి నియోజకవర్గంలో శుక్రవారం పర్యటించిన మోడీకి జ్ఞాపికను అందజేస్తున్న సిఎం యోగి

# సొంత కుటుంబాల వృద్ధికోసమే ఆరాటం

**వారణాసిలో ప్రధానిమోడీ**

**వారణాసి, ఏప్రిల్ 11:** అధికారాన్నికోరుకునేవారు తమ సొంత కుటుంబాల వృద్ధిపైనే దృష్టి పెడతారని, తమ ప్రభుత్వం మాత్రం సమ్మిళిత అభివృద్ధి కోసమే పని చేస్తోందని విపక్షాలను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యలు చేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని సొంత నియోజకవర్గమైన

>>2

# చేనేతల జీవనోపాధికి రూ. 900 కోట్ల ఆర్డర్లు



శుక్రవారం సిరిసిల్లలో అభ్యర్థులకు నియమాక పత్రాలు అందజేస్తున్న మంత్రి తుమ్మల. చిత్రంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం, విప్ ఆది శ్రీనివాస్

**అపెరల్ పార్క్‌లో కొత్త పరిశ్రమ ప్రారంభం**

**సిరిసిల్లలో ముగ్గురు మంత్రుల పర్యటన**

**సిరిసిల్ల బ్యూరో, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :** నేతన్నలు, రైతన్నల సంక్షేమం ప్రాధాన్యతగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తుందని రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని అపెరల్ పార్క్‌లో 7.6 ఎకరాల విస్తీర్ణంలో 62 కోట్లతో లక్షా 73 వేల చదరపు అడుగుల పంక్చుయేట్ వరల్డ్ ప్రైవేట్ లిమిటెడ్(టెక్స్ పోర్ట్)యూనిట్‌ను శుక్రవారం చేనేత జౌళిశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, బిసి రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిశ్రమ శిలా ఫలకాన్నీ ఆవిష్కరించారు. యూనిట్ లోని ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. అనంతరం యూనిట్ లోని ఉద్యోగులతో ముచ్చటించారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ,.. నేతన్నలకు జీవనోపాధి కల్పించే విధంగా సిరిసిల్ల గడ్డ మీద వర్కర్ టూ ఓనర్, అపెరల్ పార్క్ ఏర్పాటు వంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. రైతన్నలు, నేతన్నల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యత అని, వీరిని దృష్టిలో పెట్టుకుని మౌలిక వసతులు కల్పిస్తూ రాష్ట్ర యువతకు అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. 20 వేల 600కోట్ల రూపాయల రైతులకు ఏక కాలంలో రుణ మాఫీ చేసిన ఏకైక

>>2



# రాణాకు తీహార్ జైల్లో ప్రత్యేక సెల్

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** ప్రపంచ వ్యాప్తంగా సంచలనం రేపిన 2008 నాటి ముంబాయి మారణకాండకు సూత్రధారి పాక్... కెనేడియన్ తహవూర్ రాణాకు తీహార్ జైల్లో ప్రత్యేక సెల్ కేటాయించారు. 18 రోజుల పాటు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) కస్టడీలో వున్న రాణా కోసం తీహార్‌జైల్లో 14 అడుగుల పొడవు అంతే వెడల్పు కలిగిన ప్రత్యేక సెల్‌ను కేటాయించారు. గురువారం మధ్యాహ్నం రాణాను అమెరికా నుంచి ప్రత్యేక విమానంలో ఎన్ఐఎ అధికారులు ఢిల్లీకి తరలించిన సంగతి తెలిసిందే. గురువారం రాత్రి ఇతన్ని ఎన్ఐఎ ప్రత్యేక కోర్టులో హాజరు పరిచారు. అనంతరం రాణాను 2008 ముంబాయి మారణకాండపై లోతుగా విచారించేందుకు కస్టడీకి ఇవ్వాలని ఎన్ఐఎ అధికారులు కోర్టునుకోరగా అందుకు న్యాయమూర్తి సమ్మతించి 18 రోజుల కస్టడీకి ఇచ్చారు.

>>2

# రూ. 10వేల కోట్ల కుంభకోణం

## బిజెపి ఎంపి సపోర్ట్‌తో రేవంత్ స్కాం

## కేంద్రం స్పందించకపోతే కోర్టుకు వెళ్తాం: కెటిఆర్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 11:** కంచ గచ్చిబౌలి భూ కుంభకోణం కర్త, కర్మ, క్రియ, సూత్రధారి, పాత్రధారి అంతా రేవంత్ రెడ్డినే అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. హెచ్‌సియూ భూముల వెనుక రూ.10 వేల కోట్ల ఆర్థిక కుంభకోణం ఉందని, రేవంత్ ప్రభుత్వం ఆర్థిక నేరానికి తెరలేపిందని ఆరోపించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో కెటిఆర్ మీడియాతో మాట్లాడారు.

అటవీ భూమిని తాకట్టు పెట్టడం, అమ్మే అధికారం ప్రభుత్వానికి కూడా లేదన్నారు. సిఎం రేవంత్ రెడ్డికి అన్నీ తెలిసే భారీ ఆర్థిక నేరానికి పాల్పడ్డారని మండిపడ్డారు. ఒక బిజెపి ఎంపి సపోర్ట్‌తో రేవంత్ రెడ్డి.. హెచ్‌సియూ భూముల కుంభకోణానికి తెరతీశారని వ్యాఖ్యలు చేశారు. ట్రస్ట్ ఎడ్వైజర్స్ ఇన్వెస్ట్‌మెంట్ అనే కంపెనీ రేవంత్ రెడ్డికి బ్రోకరిజం చేసిందన్నారు. అందుకు గాను .. సదరు కంపెనీకి రూ.170 కోట్లు లంచం ఇచ్చారన్నారు. రేవంత్ రెడ్డి పాలన అంటేనే.. మోసం, విధ్వంసం, దృష్టి మళ్లించడమనే త్రీడీ విధానంతో పేదల బతుకులను కాంగ్రెస్ నాశనం చేస్తోందని మండిపడ్డారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంతో దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందన్నారు.అటవీ భూమిని అమ్మాలని రేవంత్ ప్రభుత్వం చూస్తోందన్నారు. నామమాత్రపు జీవోతో అమ్మకా

>>2

# ఆర్ఆర్ ఆర్ పనులు వేగవంతం చేయాలి

**ఎన్‌హెచ్‌ల భూ సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలి: సిఎం రేవంత్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్11:** రానున్న వందేళ్ల అవసరాలకు అనుగుణంగా డ్రైపోర్ట్‌కు రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఆర్ఆర్ఆర్ సమీపంలో సరైన ప్రాంతంలో డ్రైపోర్ట్ ఉండాలని సిఎం అన్నారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం.. ఆర్ఆర్ఆర్ పనుల పురోగతిపై ఐసిసిసిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఇటీవల రాష్ట్ర పునర్విభజన అంశాలపై ఢిల్లీలో జరిగిన

>>2

# 22 మంది మావోయిస్టుల లొంగుబాటు

**ప్రభాతవార్త, ములుగు జిల్లా క్రైమ్:** ప్రభుత్వ నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీకి చెందిన 22 మంది మావోయిస్టు సభ్యులు శుక్రవారం ములుగు జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఎదుట లొంగిపోయారు. తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ములుగు జిల్లా పోలీసులు మరియు సిఆర్పిఎఫ్ 39 బెటాలియన్ అధికారుల సమక్షంలో అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు ప్రభుత్వం ఎదుట లొంగిపోవడం కోసం నిర్వహిస్తున్నటువంటి 'పోరుకన్నా ఊరు మిన్న, మన ఊరికి తిరిగి రండి' కార్యక్రమం ద్వారా ములుగు జిల్లాలో లొంగిపోయినటువంటి మావోయిస్టు సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలుసుకొని హింసాత్మక నక్సలిజం మార్గాన్ని వదిలిపెట్టి కుటుంబంతో కలిసి ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని నిర్ణయించుకొని వివిధ హోదాలో పనిచేయుచున్న 22 మంది మావోయిస్టులు ములుగు ఎస్పీ ముందు లొంగిపోవడం జరిగిందని జిల్లా ఎస్పీ తెలిపారు.

లొంగిపోయిన వారి వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ములుగు ఎస్పీ అజ్ఞాతంలో పనిచేస్తున్నటువంటి సిపిఐ మావోయిస్టు నాయకులు మరియు సభ్యులు స్వచ్ఛందంగా లొంగిపోయి తమ కుటుంబంతో ప్రశాంతంగా జీవించాలని, లొంగిపోయిన మావోయిస్టులకు జీవన ఉపాధి మరియు పునరావాసం కల్పించడం కోసం ప్రభుత్వం తరపున అందవలసిన అన్ని రకాల సదుపాయాలు అందించడానికి ములుగు పోలీస్ ఎల్లప్పుడు కృషి చేస్తుందని తెలిపారు.

# మెగా జాబ్ మేళాకు భారీ స్పందన

**2 లక్షల ఉద్యోగాల భర్తీకే జాబ్ మేళా : మంత్రులు సురేఖ, సీతక్క**



జాబ్ మేళాలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రులు

**వరంగల్ బ్యూరో, ఏప్రిల్ 11, ప్రభాత వార్త :** ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండ సురేఖ, రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అభిప్రాయపడ్డారు.వరంగల్ (తూర్పు)నియోజక వర్గ పరిధిలో శుక్రవారం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ముందుగా వివిధ కంపెనీలు జాబ్ మేళాలో నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలను మంత్రులు కొండా సురేఖ, సీతక్క, కలెక్టర్‌లు పరిశీలించారు. తొలుత 17 మంది నర్సింగ్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు మంత్రులు, కలెక్టర్ నియామక పత్రాలు అందజేశారు. మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ప్రజలకు మేలు చేయాలనే ఆకాంక్షతో ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కృషి చేస్తుందన్నారు. తమ ప్రభుత్వం ప్రభుత్వ

>>2



జస్టిస్ రాజశేఖర్ రెడ్డి జస్టిస్ షమీమ్ అక్తర్

# లోకాయుక్త హెచ్ఆర్‌సిలకు నియామకాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఏప్రిల్11:** తెలంగాణ లోకాయుక్తగా హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి, ఉప లోకాయుక్తగా బీఎస్ జగ్జీవన్‌కుమార్ (మాజీ జిల్లా జడ్జీ), రాష్ట్ర మానవ హక్కుల సంఘం (హెచ్ఆర్సీ) చైర్మన్‌గా హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్ నియమితులయ్యారు. హెచ్ఆర్సీ సభ్యులుగా శివాది ప్రవీణ (జ్యుడీషియల్, రిటైర్డ్ డిస్ట్రిక్ట్ జడ్జ్), డాక్టర్ బి.కిశోర్(నాన్ జ్యుడిషియల్, ఐఎస్ రిటైర్డ్)లను ప్రభుత్వం

>>2

# రూ.150 కోట్ల నయీం ఆస్తులు జప్తు

**ఇడి విచారణ వేగవంతం**

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** తొమ్మిదేళ్ల క్రితం పోలీసు ఎన్‌కౌంటర్‌లో హతమైన గ్యాంగ్‌స్టర్ నయీంకు సంబంధించిన కేసు విచారణను కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ వేగవంతం చేసింది. నయీం ఎన్‌కౌంటర్ తరువాత అతని కుటుంబీకుల పేరిటవున్న 150 కోట్ల రూపాయల విలువచేసే 35ఆస్తులకు సంబంధించి వివాదాలు నెలకొనడంతో దీనిపై వివరాలు ఇవ్వా

>>2

# అద్భుత చట్టం భూభారతి

## 14న ప్రారంభం: మంత్రి పొంగులేటి

**మణుగూరు, ప్రభాతవార్త, ఏప్రిల్ 11:** ఈనెల 14న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి రోజున సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డి చేతులమీదుగా శిల్పారామంలో సాయంత్రం 5 గంటలకు భూభారతిని ప్రారంభించుకోవడం జరుగుతుందని, అద్భుతమైన చట్టం భూ భారతి అని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం మణుగూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రజాభవన్ నందు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఎంపీ పోరిక బలరాం నాయక్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 2025 భూ భారతి చట్టాన్ని ప్రజలకు అంకితం చేయడం జరుగుతుందని, ఇప్పటికే ఈ చట్టానికి సంబంధించి అన్ని రూల్స్ రూపుదిద్దామన్నారు.

ప్రతి అంశానికి రూల్ పెట్టామని భూములున్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందన్నారు. ఎలాంటి రూల్స్ పెట్టలేకుండా ఆప్పటి ప్రభుత్వం ధరణి తీసుకువచ్చి సుమారు 1.57లక్షల ఎకరాల భూమి తాకట్టుపెట్టిందన్నారు. అందుకే ధరణిని బంగాళఖాతంలో వేసి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 2025 భూ భారతిచట్టాన్నితీసుకు వచ్చిందన్నారు. గతప్రభుత్వపెద్దలు రూ.8.19

>>2

# శ్రీశైలం కుడికాలువ లైనింగ్ పనులు నిలిపివేయాలి

**బనకచర్లను అడ్డుకోవాలి**

**కెఆర్ఎంబికి ఇఎన్‌సి అనిల్‌కుమార్ లేఖ**

**హైదరాబాద్, ఏప్రిల్ 11,ప్రభాతవార్త:** బనకచర్ల ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుకు వెళ్లకుండా గోదావరి నది యాజమాన్య బోర్డు అడ్డకోవాలని అదే విధంగా శ్రీశైలం కుడికాలువ లైనింగ్ పనులు చేయకుండా కృష్ణానది యాజమాన్య బోర్డు చర్యలు చేపట్టాలని తెలంగాణ ఇఎన్‌సి జి.అనీల్‌కుమార్ లేఖలు రాశారు. గోదావరి నది యాజమాన్య బోర్డు సోమవారం నాటి 17వ సమావేశంలో బనకచర్ల డిపిఆర్ సభ్య రాష్ట్రంకు సమర్పించలేదని అదేవిధంగా జలశక్తి మంత్రి, ఆర్థిక మంత్రి లేఖలు సభ్య రాష్ట్రంకు తెలుపకుండా గోప్యంగా పెడుతున్నారని దానిని నిలిపివేయాలని కోరామని జిఆర్ఎంబి ఏచర్యలు చేపట్టకుండా ఉందని ఆయన

>>2




కోల్‌కతాలో శుక్రవారం వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న అలియా వర్సిటీ విద్యార్థులు

# రూ. 10వేల కోట్ల కుంభకోణం

>> నికి పేపర్లు రాసిచ్చారన్నారు. రిజిస్ట్రేషన్ వ్యాల్యూ ప్రకారం ఆ భూమి విలువ రూ.5,239 కోట్లు అని చెప్పుకొచ్చారు. ఆ భూమి విలువ రూ.30 వేల కోట్లు అని ప్రభుత్వం చెబుతోందని.. లేని భూమి ఉన్నట్లు చూపి లోన్ తీసుకోవాలని చూశారని వ్యాఖ్యలు చేశారు. భయంకరమైన ఆర్థిక దోపిడీకి రేవంత్ రెడ్డి పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. పర్యావరణ విధ్వంసం మాత్రమే కాదు.. అతిపెద్ద కుంభకోణం అని వ్యాఖ్యలు చేశారు. తమది కాని భూమిని టీజీఐఐసి ఎలా తాకట్టు పెట్టింది అని కెటిఆర్ ప్రశ్నించారు. స్కామ్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థలు, ఆర్‌బిఐకి ఫిర్యాదు చేస్తామన్నారు. స్కామ్‌లో రేవంత్ రెడ్డికి సహకరిస్తుంది బిజెపినే అని ఆరోపించారు. ప్రధానమంత్రి, కేంద్ర ఆర్థికమంత్రికి తెలియకుండా ఈ వ్యవహారం జరిగిందనుకోవట్లేదని... కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే సిబిఐ, సివిసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కేంద్రం స్పందించకుంటే కాంగ్రెస్, బిజెపి మధ్య ఒప్పందం ఉన్నట్లే అంటూ వ్యాఖ్యలు చేశారు. హెచ్‌సియూ భూముల వెనుక క్విడ్ ప్రో కో ఉందన్నారు. సదరు బిజెపికి రేవంత్ రెడ్డి కొన్ని లాభాలు చేకూర్చుతున్నారన్నారు. ఆర్బీఐ నిబంధనలు పాటించకుండా.. 10వేల కోట్లు తెచ్చారన్నారు. బిటికేషన్ ల్యాండ్‌కు ఐసిఐసిఐ బ్యాంకు ఎలా లోన్ ఇచ్చిందని ప్రశ్నించారు. ఫీల్డ్ విజిట్ చేయకుండానే బ్రోకర్ ఆధారంగా బ్యాంక్ ప్రభుత్వానికి రుణం ఇచ్చిందని కెటిఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ 15 16 నెలల్లో డిసెప్షన్, డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్ అనే 3డీ మంత్రంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదలు, మధ్యతరగతి బతుకుల్ని నాశనం చేస్తోంది అని కెటిఆర్ ధ్వజమెత్తారు. హెచ్‌సియూ పక్కన ఉన్న అటవీ భూములను అడ్డం పెట్టుకుని ఒక అతిపెద్ద ఆర్థిక మోసానికి రేవంత్ ప్రభుత్వం పాల్పడింది. ఇదొక నేరపూరిత కుట్ర. తెలంగాణ ప్రజల పట్ల విశ్వాసఘాతుకం. రాత్రికి రాత్రి బుల్డోజర్లను పెట్టి వందల ఎకరాల్లో చెట్లను కూల్చివేసి మూగ జీవాలకు నిలువ నీడ లేకుండా చేసిన రేవంత్ ప్రభుత్వ ఆరాటం వెనుక పదివేల కోట్ల రూపాయల స్కాం ఉంది.

సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఆ 400 ఎకరాలు ముమ్మాటికి అటవీ భూమే అని కెటిఆర్ స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో తెలంగాణలో ఆర్‌ఆర్ టాక్స్ పనులు చేస్తున్నారని ప్రధాని మోదీ ఆరోపించారు కానీ ఇప్పటిదాకా దానిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అమృత్ స్కాంలో రేవంత్ రెడ్డి బావమరిదికి రూ.1137 కోట్ల రూపాయలు దారి మళ్లించామని ఆధారాలతో సహా కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తే ఇప్పటివరకు ఎలాంటి చర్య తీసుకోలేదు. రెవెన్యూ మినిస్టర్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీద ఐడీ దాడులు జరిగితే ఇప్పటిదాకా అధికార ప్రకటన రాలేదు. ఈ వ్యవహారాన్ని ఈ ఆర్థిక మోసాన్ని కూడా అదే కోవలో కలిపేసి కాంగ్రెస్ బీజేపీ ఒకరినొకరు కాపాడుకుంటారో.. లేదంటే నిజంగానే సమగ్ర విచారణకు ఆదేశించి మేము నిజాయితీగా ఉన్నాం, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ఈ దోపిడీని ఉపేక్షించమని చెప్పి కేంద్రం తన చిత్తశుద్ధిని చాటుకోవాలి. దొంగ చేతికే నేను ఇప్పుడే తాళాలు ఎందుకని ఆ బీజేపీ ఎంపీ పేరు చెప్పడం లేదు అని కెటిఆర్ తెలిపారు. ఈ దేశంలో సామాన్యుడు బ్యాంకు లోన్ తీసుకోవాలంటే 100 డాక్యుమెంట్స్ ని వెరిఫై చేసి 100 కొర్రీలు పెట్టి లోన్ ఇస్తారు. అదే ఒక సంపన్నుడు అధికారపక్షంలో అనుబంధం ఉన్నవారు లోన్ అడిగితే నిమిషాల్లోనే మంజూరు చేస్తారు. కనీసం భూమి ఉందో లేదో కూడా చెక్ చేయరు ఇక్కడ అదే జరిగింది. ఐసిఐసిఐ లాంటి దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకు, భూ యాజమాన్య హక్కును పరిశీలించకుండానే ఆ భూమి ఎవరిదో తెలుసుకోకుండానే పదివేల కోట్లు లోన్ ఇవ్వడం ఆశ్చర్యం అని పేర్కొన్నారు. త్వరలోనే ఆ బిజెపి ఎంపీ పేరును బయట పెడతాను. కేంద్ర ప్రభుత్వం సరిగా స్పందించకపోతే కోర్టుకు పోతాం. మా పార్టీ తరఫున ఆర్బీఐ, సెబీ శాఖ మంత్రిని కలిసి ఈ మొత్తం వ్యవహారంపై ఫిర్యాదు చేస్తాం. మిత్రపక్షాల ద్వారా లోక్ సభ, రాజ్యసభల్లోనూ ఈ అంశాన్ని లేవనెత్తుతాం. నిన్న వచ్చిన అపెక్స్ కమిటి పర్యావరణ విధ్వంసంపై విచారణ జరిపింది. అందుకే ఈ ఆర్థిక మోసంపై ఫిర్యాదు చేయలేదు అని కెటిఆర్ తెలిపారు.

# రూ. 900 కోట్ల ఆర్డర్లు

>> ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అని, నేతన్నలకు కూడా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా 34 కోట్ల రూపాయలతో లక్ష రూపాయల రుణమాఫీ పూర్తి చేశామని మంత్రి తెలిపారు. నేతన్నలకు పెండింగ్‌లో ఉన్న 914 కోట్ల బకాయిలు విడుదల చేయడం జరిగిందని అన్నారు.

ఒకే రోజు వివిధ పథకాల క్రింద 290 కోట్ల నిధులు జమ చేసామని, చేనేత భరోసా, చేనేత బీమా పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో అన్ని శాఖలలో అవసరమైన వస్త్రాలను చేనేత కార్మికుల ద్వారానే కొనుగోలు చేస్తున్నామని, ఇప్పటికే కార్మికులకు 900 కోట్ల రూపాయల ఆర్డర్స్ ప్రభుత్వం అందించిందని అన్నారు. ముఖ్యమంత్రితో చర్చించి త్వరలోనే వర్కర్ టు ఓనర్ కార్యక్రమం పునరుద్ధరిస్తామని తెలిపారు. చేనేత రంగానికి చెందిన పరిశ్రమలను సిరిసిల్ల, వరంగల్ వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నామని, దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో పనిచేస్తున్న చేనేత కార్మికులు తిరిగి వచ్చేలా వసతుల కల్పన కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఏ పని చేసినా తెలంగాణ ప్రజల కష్ట ఫలితం మాత్రమేనని ఎవరి సొమ్ము కాదన్నారు. సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోటో పెట్టాలని స్థానిక బిజెపి నేతలు అంటున్నారని కేంద్రాన్ని పోషించే రాష్ట్రాలలో తెలంగాణ ముందు వరుసలో ఉంటుందని కేంద్రంలో రాష్ట్రాల ఫోటోలు పెడతారా అని ప్రశ్నించారు.

**కాంగ్రెస్ హాయంలో నేతన్నల కోసం అనేక కార్యక్రమాలు: మంత్రి శ్రీధర్ బాబు**

గత కాంగ్రెస్ హాయాంలో నేతన్నలు కాపాడేందుకు వీలుగా అన్ని చర్యలు తీసుకున్నామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీదర్‌బాబు అన్నారు. నేతన్నలకు అంత్యోదయ కార్డులను గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. టెక్స్ పోర్ట్ సంస్థ ప్రతినిధులతో చర్చించి వారికి ఉన్న సమస్యలను పరిష్కరించి నేడు ఈ పరిశ్రమను ప్రారంభించామని అన్నారు. సిరిసిల్ల నేతన్నలకు దేశవ్యాప్తంగా గుర్తింపు సాధించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. వేములవాడ దేవాలయ అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్ లో ప్రత్యేకంగా నిధులు కేటాయించామని అన్నారు. శాతవాహన విశ్వ విద్యాలయాన్ని తమ ప్రభుత్వం స్థాపించిందని, దీనికి సంబంధించి ఇంజనీరింగ్ కళాశాల, లా కళాశాలలను మళ్లీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంజూరు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో నీటి పారుదల సౌకర్యం, రహదారుల సౌకర్యం, విద్యా, వైద్య సౌకర్యాలు కల్పనకు కృషి చేస్తున్నామని, అన్ని రంగాలలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని ముందు వరుసలో ఉంచుతామని అన్నారు. స్థానికులకు వేల సంఖ్యలో ఉపాధి అవకాశాలు కల్పించే ఇటువంటి పరిశ్రమకు భవిష్యత్తులో ఎటువంటి అవసరమున్న ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని అన్నారు.

**పరిశ్రమ విస్తరణకు అవసరమైన సహకారం అందిస్తాం: మంత్రి పొన్నం**

బెంగళూరు నగరానికి చెందిన టెక్స్ పోర్ట్ సంస్థ అప్పెరల్ పార్క్‌లో 62 కోట్లతో యూనిట్ ఏర్పాటు చేయడం చాలా సంతోషమని, భవిష్యత్తులో పరిశ్రమ విస్తరణకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని, టెక్స్ పోర్ట్ సంస్థ ఇక్కడ మరింత విస్తరించాలని, స్థానికులకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రబాకర్ ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖలలో అవసరమైన బట్టలను చేనేత కార్మికుల నుంచి సేకరిస్తున్నామని, మహిళా సంఘాలకు ప్రభుత్వం రెండు చీరలు ఇవ్వాలని నిర్ణయించిందని వీటి ఆర్డర్లను కూడా సిరిసిల్ల నేతన్న లకే ప్రభుత్వం అందించిందని అన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం సన్న బియ్యం పథకం అమలు చేస్తుందని వివరించారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ,.. చేనేత కార్మికులకు లక్ష రూపాయల రుణ మాఫీ పూర్తి చేశామని, మహిళా సంఘాలలో ఉన్న 65లక్షల మంది మహిళలకు ఉచిత 2 చీరలు పంపిణీ చేయాలనే నిర్ణయించి ఆ ఆర్డర్ దారా చేనేత కార్మికులకు ఉపాధి కల్పన దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. ఈ ప్రాంతంలో కాటన్ పరిశ్రమ, పాలిస్టర్ పరిశ్రమ, అనుబంధ రంగ పరిశ్రమలు తీసుకొని రావాలని, ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని ఆయన మంత్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రజల చిరకాల కోరిక నూలు డిపోను కూడా వేములవాడ పట్టణంలో 50 కోట్లతో ఏర్పాటు చేసుకున్నామని, దీని వల్ల 99 సంఘాలకు ఇప్పటివరకు సబ్సిడీపై నూలు అందించామని అన్నారు. అనంతరం పరిశ్రమలో శిక్షణ పొందిన మహిళలకు నియామక పత్రాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు, కంపెనీ సీఈఓ చంద్రశేఖర్ ఎస్పీ మహేష్ బీ గీతే, సెస్ ఛైర్మెన్ చిక్కాల రామారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, సిరిసిల్ల ఆర్డీవో రాధా బాయ్, వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ ఏడీ రాఘవేందర్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కెకె మహేందర్ రెడ్డి, పట్టణ అద్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మ్యాన ప్రసాద్, వైద్యశివప్రసాద్, కటుకం మృత్యుంజయం, సెస్ చైర్మన్ చిక్కాల రామరావు, ప్రజా ప్రతినిధులు ప్రజలు కంపెనీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీ వరకు 'మెట్రో'

>> అద్భుతంగా నిర్మించాలని, అదే సమయంలో సందర్శకులు, ప్రయాణికుల రక్షణకు అత్యంత ప్రాధాన్యముండే డిజైన్లను ఎంచుకోవాలని సిఎం అధికారులను అప్రమత్తం చేశారు. ఈ బ్రిడ్జితో పాటు మీర్‌ఆలం ట్యాంక్‌లో వివిధ చోట్ల ఐలాండ్‌లా ఉన్న మూడు ప్రాంతాలను పర్యాటకులను ఆకట్టుకునేలా అందంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. సింగపూర్‌లోని గార్డెన్స్ బై ది బేను తలపించేలా బర్డ్స్ పారడైజ్, వాటర్ ఫాల్స్ లాంటివి ఉండేలా ఈ మూడు ఐలాండ్లను అత్యంత సుందరంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. వెడ్డింగ్ డెస్టినేషన్‌కు వీలుగా ఉండే కన్వెన్షన్ సెంటర్లతో పాటు అడ్వంచర్ పార్క్, థీమ్ పార్క్, అంఫీ థియేటర్‌ను ఏర్పాటు చేసేందుకు వీలుగా డిజైన్లు ఉండాలన్నారు. బోటింగ్‌తో పాటు పర్యాటకులు విడిది చేసేలా రిసార్ట్స్, హోటల్స్ అందుబాటులో ఉండాలని సూచించారు. ట్యాంక్‌లో నీటిని శుద్ధి చేయటంతో పాటు ఐలాండ్‌ను అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని ప్రతిపాదనలతో డీపీఆర్ సిద్ధం చేయాలని చెప్పారు. పిపిపి మోడల్లో ఈ ఐలాండ్ జోన్ను అభివృద్ధి చేసేలా ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. మీర్ అలం ట్యాంక్‌లో నీటి లభ్యతను, వరద వచ్చినప్పుడు ఉండే నీటి ప్రవాహ తీవ్రతను ముందుగానే అంచనా వేసుకొని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందు చూపుతో డిజైన్లు చేసుకోవాలని సిఎం ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన హైడ్రాలజీతో పాటు పర్యావరణానికి సంబంధించి నిపుణులు, లేదా ఆ రంగంలో పేరొందిన సంస్థలతో సర్వే చేయించాలని, ఆ నివేదికల ఆధారంగా అవసరమైన అన్ని అనుమతులు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. మీర్ అలం బ్రిడ్జితో పాటు ఈ ఐలాండ్ జోన్‌ను పక్కనే ఉన్న జూ పార్కుకు అనుసంధానం చేయాలని సూచించారు. ఇక్కడి డెవెలప్‌మెంట్ ప్లాన్‌ను దృష్టిలో పెట్టుకొని జూ పార్కును అప్ గ్రేడ్ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జూ అధికారులతో సంప్రదింపులు జరిపి, నిబంధనల ప్రకారం అప్‌గ్రేడ్ చేసేందుకు ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించాలని సూచించారు. పర్యాటకులను మరింత ఆకట్టుకునేలా అభివృద్ధి ప్రతిపాదనలు తయారు చేయాలని చెప్పారు. సిఎం వద్ద జరిగిన సమీక్షా సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, శ్రీనివాసరాజు, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్‌తో పాటు మూసీ రివర్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జాబ్ మేళాకు భారీ స్పందన

>> ఉద్యోగ ఖాళీలను గుర్తించి దశల వారీగా 2లక్షల ఉద్యోగాలను కల్పించాలని ఉద్దేశంతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో కేవలం ఏడాది కాలంలోనే తెలంగాణకు దేశ విదేశాల నుంచి అత్యధిక పెట్టుబడులు వచ్చాయని అన్నారు. తెలంగాణ రైజింగ్ ఇక ఆగదని, ఉద్యోగ కల్పనలో నెంబర్ వన్‌గా మనం నిలిచామని మంత్రి తెలిపారు. నిరుద్యోగుల బాధలను గుర్తించే.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 59 వేల వివిధ శాఖలలో ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టడం జరిగింది. ఈ జాబ్ మేళా యువత కెరీర్ కు ఎంతో దోహదపడుతుందని అన్నారు. 65 కి పైగా వివిధ మల్టీ నేషనల్ కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొని నైపుణ్యాలను బట్టి ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. జాబ్ మేళా ద్వారా ఉద్యోగ అవకాశాలను నిరుద్యోగ యువత అందిపుచ్చుకోవాలన్నారు. ఇలాంటి జాబ్ మేళాలు ఎంతగానో ఉపయోగపడతాయని, వరంగల్ జిల్లాలో ప్రాధాన్య క్రమంలో నియోజక వర్గాల వారిగా జాబ్ మేళాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఇప్పటికే పరకాల భూపాలపల్లి నియోజక వర్గాల్లో జాబ్ మేళాలు ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి కొండ సురేఖ తెలిపారు. మరో మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ ఇంత పెద్ద ఎత్తున జాబ్ మేళా నిర్వహించడం చరిత్రాత్మకం అని మంత్రి సురేఖ ను అభినందించిన మంత్రి తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నది ఉద్యోగాల కోసమని రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉద్యోగాల కోసం యువకులు పోరాడి సాధించుకున్నారని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గడచిన సంవత్సర కాలంలో 59 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన ఘనత ప్రజా ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఏ ఉద్యోగం చేసిన ఉన్నత చదువులు చదువుకోవాలని అలా ఎంతోమంది కలెక్టర్లుగా ఉన్నత ఉద్యోగాలు సాధించారని, తల్లిదండ్రులకు నిరాశ కలిగించవద్దని, రాబోయే కాలం వరంగల్ జిల్లాకు స్వర్ణ యుగం అని హైదరాబాద్ తర్వాత రెండవ పెద్ద నగరంగా వరంగల్ ఉండాలనేదే ముఖ్యమంత్రి ఆకాంక్ష అని అన్నారు.

## సీనియర్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడుగా శ్రీనాథ్

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** తెలంగాణ సీనియర్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టిఎస్ ఆర్‌డిఏ) నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతన రాష్ట్ర అధ్యక్షులుగా డాక్టర్ శ్రీనాథ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ కరిష్మి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు అసోసియేషన్ నేతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని సీనియర్ రెసిడెంట్ డాక్టర్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ సీనియర్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టిఎస్‌ఆర్‌డిఏ)కి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్రంలోని సీనియర్ రెసిడెంట్లు అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ మెడికల్ కాలేజీల్లో నియామకాలు పూర్తి కావడంతో.. అసోసియేషన్‌కి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ ఎన్నిక ఈ నెల 9న జరిగినట్టు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా డాక్టర్ శ్రీనాథ్ (జిఎంసీ భూపాలపల్లి), జనరల్ సెక్రటరీగా డాక్టర్ కరిష్మి (గాంధీ మెడికల్ కాలేజ్) ఎన్నిక కావడంతో వారు త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు. అసోసియేషన్‌లో ఉపాధ్యక్షులుగా డాక్టర్ అఖిల్ (గాంధీ మెడికల్ కాలేజ్), డాక్టర్ మోతే ప్రణయ్ (ఆర్ఐఎంఎస్ ఆదిలాబాద్), డాక్టర్ అరుణ్ కుమార్ (జిఎంసీ ఖమ్మం), డాక్టర్ పవన్ కల్యాణ్ (జిఎంసీ నిజామాబాద్) బాధ్యతలు చేపట్టనున్నారు.

# ప్రత్యేక సెల్

>> రాణా కోసం ఈ సెల్‌లో ఎసి సౌకర్యం కల్పించారు. ఇందులో ఒక మంచం, అటాచ్ టాయ్‌లెట్ వుంది. కాగా రాణా వున్న సెల్‌లో వెళ్లేందుకు ఎన్ఐఎకు చెందిన సీనియర్ అధికారులు 12 మందికి మాత్రమే అనుమతిని చ్చారు. రాణా తరపున వాదిస్తున్న న్యాయవాదికి కోర్టు నిబంధనల మేరకు అతన్ని కలిసేందుకు అనుమతి ఇచ్చారు. రాణాను వుంచిన సెల్‌పై 24 గంటలు సిసిటివిలతో నిఘా వుంచారు.

# నియామకాలు

>> నియమించింది. దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్, లోకాయుక్త, ఉపలోకాయుక్త పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సచివాలయంలో సిఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశ మైన సెలక్షన్ కమిటీ అభ్యర్థుల జాబితాను వడపోసి వీరి పేర్లను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదానికి పంపారు. గవర్నర్ నుంచి ఆమోదం లభించడంతో వారి నియామకాలకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి 1960 మే4న నల్లగొండలో జన్మించారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి ఎల్‌ఎల్‌బి పూర్తి చేశారు. 1985 ఏప్రిల్‌లో ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. 2004లో కేంద్ర ప్రభుత్వానికి సీనియర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులయ్యారు. 2005 నుంచి 2009 వరకు అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్‌గా కొనసాగారు. 2013లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2014 సెప్టెంబర్‌లో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులై 2022 మేలో పదవీ విరమణ పొందారు. 2024 జూన్‌లో రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) చైర్మన్‌గా నియమితులై కొనసాగారు.

జస్టిస్ షమీమ్ అక్తర్ 1961 జనవరి 1న నల్లగొండలో జన్మించారు. నాగపూర్ యూనివర్సిటీ నుంచి లా డిగ్రీ పొందారు. బషీర్‌బాగ్ పిజీ లా కాలేజీలో ఎల్‌ఎల్‌ఎం పూర్తి చేశారు. 2006లో ఉస్మానియా లాకాలేజీలో పిహెచ్‌డి చేశారు. 1986నుంచి 2002 వరకు న్యాయవాదిగా ప్రాక్టీస్‌చేశారు. 2002లో జ్యుడిషియల్ సర్వీసులోకి ప్రవేశించారు. 2017 జనవరి17న ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2019 జనవరి 2న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించి 2022 డిసెంబర్‌లో పదవీ విరమణ పొందారు. గత నవంబర్ 11న ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ చైర్మన్‌గా నియమితులై కొనసాగారు.

## వారం - వర్జ్యం

తేది : 12-04-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్లపక్షం,
పౌర్ణమి పూర్తి
హస్త సా.6.08
వర్జ్యం రా.3.09 - తె.4.58
దు.తె.5.55 - ఉ.7.33
శుభసమయం : ఉ.6.16-6.55
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి. వస్తులాభం.

**వృషభం:** సంఘంలో మీ మాటకు విలువ పెలుగుతుంది. వస్తు వస్త్రాలు కొణాలగోలు చేస్తారు. దైవదర్శనాలు.

**మిథునం:** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

**కర్కాటకం :** జీవిత భాగస్వామితో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. శుభకార్యలలో పాల్గొంటారు.

**సింహం:** ఋణ యత్నాలు ముమ్మరం చేస్తారు. ఆకస్మిక ప్రయాణాలలో తొందరపాటు వద్దు. స్వల్ప ధనలాభం.

**కన్య :** దూర ప్రాంతాల నుండి వచ్చిన వార్త కొంత ఊరట చెందుతారు. ఖర్చులు పెరుగుతాయి. ప్రయాణాలు.

**తుల :** ఋణ బాధలు ఎదురై చికాకులు పెడతాయి. ఆరోగ్యం పట్ల చాలా జాగ్రత్త అవసరం. సోదరుల కలయిక.

**వృశ్చికం:** విలువైన పత్రాలు, వస్తువులు జాగ్రత్త అవసరం. ప్రయాణాలలో తొందరపాటు వద్దు. శ్రమాధికం.

**ధనుస్సు:** ఉద్యోగాలలో మార్పులు వుంటాయి. అనుకోని అవకాశాలు లభిస్తాయి. వీటిని సద్వినియోగం చేసుకోండి.

**మకరం:** పూర్వపు మిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు. వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

**కుంభం:** కుటుంబసభ్యుల నుండి సహాయ సహకారాలు అందిస్తారు. ప్రయోగాలలో ఆటంకాలు ఎదురువుతాయి.

**మీనం :** ఆర్థిక ఇబ్బందులు ఎదురై చికాకులు పెడతాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం. వాహన యోగం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



కర్ణాటకలోని చిక్‌మగళూరులో శుక్రవారం గ్యాస్‌ధరల పెంపుపై నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ క్యాడర్

# అద్భుత చట్టం భూభారతి

>> లక్షల కోట్లు అప్పుచేసి ఫాంహౌజ్‌లో రెస్ట్ తీసుకుంటున్నారని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగులేకున్నా నిరుపేదలకు ఇందిరమ్మ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమం పథకాలు అందజేస్తుందన్నారు. అన్ని వర్గాల పేదలకు 200 యూనిట్స్‌ఫ్రీ కరెంట్, ఉచిత బస్, రూ.500లకే గ్యాస్, సన్నబియ్యం ఇవ్వడంతో పాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. 10 రోజుల్లో కొత్త రేషన్ కార్డులు ఇస్తామన్నారు. ఇప్పటికే ప్రతి మండలానికి ఇందిరమ్మ ఇళ్లు మోడల్‌గా ఒక గ్రామానికి ఇచ్చామని, ఐదు రోజుల్లో ప్రతి నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. అత్యధికంగా రాష్ట్రంలో రైతులు ధాన్యం పండిస్తున్నారని, ఇచ్చిన మాట ప్రకారం రైతులకు మద్దతు ధరతో పాటు రూ. 500లు బోనస్ యాసంగిలో కూడి ఇస్తున్నామన్నారు. ప్రతి నియోజకవర్గానికి సుమారు 4వేల మంది యువతకు రాజీవ్ యువ వికాస పథకం ద్వారా రూ.50వేల నుంచి రూ.4లక్షల వరకు ఇవ్వడం జరుగుతుందన్నారు. అన్ని హామీలను చిత్తశుద్ధితో అమలు చేస్తామన్నారు. ఏజెన్సీలో ప్రాంతంలో గిరిజనలు, గిరిజనేతరులు రెండు కళ్లు ఎవ్వరిని నొప్పించకుండా అందరికి న్యాయం జరిగేలా భూ భారతి చట్టం ఉండబోతుందన్నారు. పినపాక నియోజకవర్గంలో పులుసు బొంత ప్రాజెక్టుకు సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా త్వరలోనే శంకుస్థాపన చేయన్నుట్లు తెలిపారు.

# ఆర్ఆర్ ఆర్ పనులు వేగవంతం చేయాలి

>> తెలంగాణ, ఎపి అధికారుల సమావేశంలో హైదరాబాద్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి అవసరమైన డిపిఆర్ తయారీకి సూత్రప్రాయ ఆమోదం తెలపాలని కేంద్ర హోం శాఖ కార్యదర్శి ఆదేశించిన నేపథ్యంలో ఆ పనులపై దృష్టిసారించాలని సిఎం సూచించారు. రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) ఉత్తర భాగానికి సంబంధించిన భూ సేకరణ పూర్తి చేయాలని, దక్షిణ భాగం డిపిఆర్ కన్సల్టెన్సీ నివేదికను త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరాన్ని ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌తో అనుసంధానించేలా జాతీయ రహదారికి ప్రతిపాదనలు తయారు చేసి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థకు (ఎన్‌హెచ్‌ఎఐ) పంపించాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు కొత్త జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని సిఎం ఆదేశించారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి భూ సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులపై సిఎం ఆరాతీశారు. పలు చోట్ల పంటలు ఉన్నాయని, పంట నష్టపరిహారం చెల్లించేందుకు ఎన్‌హెచ్ఎఐ అంగీకరించడం లేదని అధికారులు సిఎంకు వివరించారు. పంట కాలం దాదాపు పూర్తవుతున్నందున ఆవెంటనే రైతులతోమాట్లాడి భూసేకరణ పూర్తి చేయాలని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

# వృద్ధికోసమే ఆరాటం

>>వారణాసిలో పర్యటించిన ప్రధాని, అక్కడ రూ.3,880కోట్ల విలువైన 44 గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించిన ప్రధాని మోడీ ప్రతిపక్ష పార్టీలపై ఈ మేరకు విమర్శలు చేశారు. దేశానికి సేవ చేయడంలో మా ప్రభుత్వం సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ మంత్రంతో ముందుకు సాగుతోంది. కానీ అధికారం దాహం కోసం ఆరాటపడే వారు రాత్రి, పగలు రాజకీయ ఆటలు ఆడుతున్నారు. జాతీ ప్రయోజనాలకు కాకుండా కుటుంబాల అభివృద్ధిపైనే దృష్టి పెడుతున్నారు. ప్రతిపక్షాలు పరివార్ కా సాథ్ పరివార్ కా వికాస్ అనే మంత్రంతోనే వ్యవహరిస్తున్నారు. ఈ రోజున భారత్ అభివృద్ధి, వారసత్వం అనే రెండింటితో కలిసి ముందుకు సాగుతోంది. అందుకు కాశీనే ఒక ఉదాహరణగా మారుతోంది. ఇక ఆయుష్మాన్ భారత్‌తో పేదలు అప్పులు చేయకుండా మెరుగైన వైద్యం లభిస్తోంది. మరోవైపు యువతకు క్రీడా రంగంలో వృద్ధి అవకాశాలను అందించడానికి మా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది. 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వడానికి మేము మా శాయశక్తులా ప్రయత్నిస్తున్నాము. కానీ ఒలింపిక్స్‌లో మెరవాలంటే, యువత ఈరోజే నుంచే శిక్షణ ప్రారంభించాలని ప్రధాని మోడీ అన్నారు. ప్రధాని మోడీ ప్రారంభించిన ప్రాజెక్టుల్లో 130 తాగునీరు, 100 అంగన్వాడీ కేంద్రాలు, 356 లైబ్రరీలు, పాలిటెక్నిక్ కాలేజీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రోడ్లు, హాస్టళ్ల ఉన్నట్లు వారణాసి డివిజనల్ కమిషనల్ కౌశల్ రాజ్ శర్మ తెలిపారు.

# లైనింగ్ పనులు నిలిపివేయాలి

>> లేఖలో ఆవేదన వ్యక్తంచేశారు. బనకచర్ల ప్రతిపాదనలు మాత్రమే అంటూ కొట్టిపడేసిన జీఆర్ఎంబి సమావేశంలో కొట్టిపడేసిన ఆంధ్రప్రదేశ్ మరోవైపు జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని ఇఎన్‌సి అనిల్‌కుమార్ తెలిపారు. రూ.80112 కోట్లతో నిర్మించే పోలవరం బనకచర్ల ప్రాజెక్టు కారణంగా తెలంగాణ ప్రయోజనాలకు ఇబ్బంది కలుగుతోందని పెన్నా బేసిన్ వరకు తరలించడం వల్ల గోదావరి బేసిన్ అవసరాలు తీరడం కష్టమని ఆయన లేఖలో పేర్కొన్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఉత్తర్వులను ఉల్లఘించి శ్రీశైలం కుడి ప్రధాన కాలువకు లైనింగ్ పనులతో ముందుకు పోతుందని పలు పర్యాయాలు కెఆర్ఎంబికి లేఖలు రాసినా అడ్డుకోవడంలేదని కెఆర్ఎంబికి లేఖలో వివరించారు.

2020 అక్టోబర్ 2న అపెక్స్‌కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లామని 1973 కెడబ్ల్యుడిటి-1 అవార్డు ప్రకారం బేసిన్‌లో భవిష్యత్‌లో నిర్మించబోయే ప్రాజెక్టులకు ముందు ప్రాధాన్యతతో నీటి కేటాయింపులు జరిపాకనే బేసిన్ బయటకు నీటిని తరలించాలని ఇతర బేసిన్‌కు వెళ్లేందుకు నీటిని కేటాయించకూడదని తెలిపారని పేర్కొన్నారు. శ్రీశైలం కేవలం జలవిద్యుత్ కేంద్రమని 1976-77 చెన్నైకి 15వందల క్యూసెక్కుల నీటి సామర్థ్యంతో కాలువను ఏర్పాటు చేశారని వివరించారు. కెడబ్ల్యుడిటి -1 అవార్డుకు భిన్నంగా సెంట్రల్ వాటర్ కమీషన్ అనుమతితో శ్రీశైలం కుడికాలువ నుంచి నీటిని తరలిస్తున్నదని ఆరోపించారు. తెలంగాణలోని కృష్ణా బేసిన్‌లోని అనేక గ్రామాలు, జనవాసాలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నాయని సిడబ్ల్యుసి, ట్రిబ్యునల్‌లో వాజ్యం కూడా ఉందని పేర్కొన్నారు. సిడబ్ల్యుఎస్ఎస్, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యూలేటర్, శ్రీశైలనం కుడికాలువ, బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ వంటివి నిర్మించి 1980 నుంచి నీటిని అక్రమంగా తరలించడం మొదలు పెట్టిందని ఆరోపణలతో లేఖను రాశారు. పోతిరెడ్డిపాడు 44,600క్యూసెక్కులు, శ్రీశైలం కుడికాలువ 19150క్యూసెక్కులు, బనచకర్ల 48525 క్యూసెకులు తరలిస్తున్నారని ఇక లైనింగ్ చేస్తే 1,56,100 క్యూసెక్కుల నీటిని తరలించుకొని పోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎస్ఆర్ఎంసి శ్రీశైలం రైట్‌మెన్ కెనాల్ 81975క్యూసెక్కుల సామర్థ్యం కుపెరుగుతుందని పేర్కొన్నారు. శ్రీశైలం లైనింగ్‌పై ఏ చర్య తీసుకోవడంలేదని అనిల్ పేర్కొన్నారు. బనకచర్లను అడ్డుకోవాలని పోలవరం నిర్మాణం పూర్తైన వెంటనే తాడిపూడి ప్రాజెక్టు వదిలిపెట్టాలని ట్విన్‌టన్నెల్ పరిమాణం పెంచకుండాచూడాలని ఆయన లేఖలో పేర్కొన్నారు.

# నయీం ఆస్తులు జప్తు

>> లని ఇడి అధికారులు సంబంధిత వ్యక్తులను పలుమార్లు కోరినా స్పందించక పోవడంతో వీటిని జప్తు చేసేందుకు నిర్ణయించింది. గ్యాంగ్‌స్టర్‌గా వున్న కాలంలో నయీం వందల కోట్ల రూపాయల ఆస్తులను కూడా బెట్టడం తెలిసిందే. ఇందులో అనేక ఆస్తులను తన కుటుంబీకుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించడం విదితమే. 2016 ఆగస్టులో షాద్‌నగర్ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో నయీం చనిపోయిన తరువాత అతని అనుచరులు, కుటుంబీకుల్లో చాలా మంది పోలీసులకు లొంగిపోయి సాధారణ జీవితం గడుపుతుండగా కొందరు మాత్రం నేర జీవితం వైపు మళ్లీ జైలు పాలయ్యారు. కాగా నయీం సంపాదించిన వందల కోట్ల రూపాయల ఆస్తుల్లో చాలా వరకు ప్రభుత్వం అప్పట్లోనే జప్తు చేసింది. ఇందులో కొన్ని తమ నుంచి బలవంతంగా లాక్కున్నట్లు ఆయా ప్రాం తాల రైతులు పోలీసులకు ఫిర్యాదు చేయగా దీనిపై విచారణ సాగుతోంది.

మరోవైపు నయీం బినామీ ఆస్తులపై వివరాలు సేకరించేందుకు 2022 మార్చి నెలలో ఇడి అధికారులు రంగంలో దిగి మనీలాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేశారు. నయీం వందల కోట్ల రూపాయల ఆస్తులను ఎలా సంపాదించాడు..? ఐటి ఎందుకు చెల్లించలేదు..? అనే కోణంలో ఇడి అధికారులు విచారించారు. ఇడి నమోదు చేసిన కేసులో నయీం భార్య హసీనా బేగం పేరును చేర్చారు. నయీం బినామీ ఆస్తుల్లో అతని కుటుంబ సభ్యులు తహీరా బేగం, సలీమా బేగం, అబ్దుల్ సలీం, అహేలా బేగం, సయ్యద్ నిలోఫర్, ఫిర్దోస్ అంజుం, మహమ్మద్ ఆరిఫ్, హసీనా కౌసర్‌ల పేరిట ఎక్కువగా వున్నట్లు ఇడి గుర్తించింది. దీనిపై వివరణ ఇవ్వాలని ఇడి అధికారులు పలుమార్లు వీరికి నోటీసులు ఇచ్చినా సమాధానం లభించలేదు. దీంతో వీరి పేరిట వున్న 35 ఆస్తులను జప్తు చేయాలని ఇడి నిర్ణయించినట్లు తెలిసింది. కాగా నయీం ఎన్‌కౌంటర్ తరువాత అతని అక్రమాలపై విచారించేందుకు సిట్‌ను ఏర్పాటు చేయగా 250కి పైగా కేసులు నమోదయ్యాయి. నయీం 27కు పైగా హత్యలు, పదుల సంఖ్యలో కిడ్నాపులు, అత్యాచారాలు, దాడులకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలినా ఈ కేసుల విచారణ నేటికీ పూర్తి కాలేదు.



మహాత్మా జ్యోతిరావుఫూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, చిత్రంలో పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మాజీ ఎంపి వి.హనుమంతరావు తదితరులు

## ఘనంగా మహాత్మా జ్యోతిరావుఫూలే జయంతి వేడుకలు

### నివాళులర్పించిన సిఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి, సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిరావుఫూలే జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తాలోని జ్యోతిరావు ఫూలే విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఫూలే విగ్రహం వద్ద నుంచి ప్రజలకు, పెద్దఎత్తున వచ్చిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు సిఎం అభివాదం చేశారు. ఫూలేకు నివాళులర్పించిన వారిలో పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మాజీ ఎంపి వి.హనుమంతరావు, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ ఎంపి అంజన్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు బల్మూర్ వెంకట్, అద్దంకి దయాకర్, ఎంబిసి కార్పొ రేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, అంబర్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రోహిన్‌రెడ్డి, పిసిసి ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, పిసిసి కార్యదర్శులు లక్‌పతి యాదగిరిగౌడ్, శంభుల శ్రీకాంత్‌గౌడ్, మాజీ కార్పొ రేటర్లు దిడ్డి రాంబాబు, పి.నారాయణస్వామి, పులి జగన్, సీనియర్ నాయకులు గరిగంటి రమేష్, సత్తిబాబు తదితరులు ఉన్నారు. కాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యక్రమం పూర్తయ్యాక వివిధ పార్టీలకు చెందిన నేతలు జ్యోతిరావుఫూలే విగ్రహం వద్ద నివాళులర్పించారు. బిజెపి రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీమంత్రి కృష్ణాయాదవ్, బిసి కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ తదితరులు ఫూలేకు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

## ఫూలే ఆశయ సాధన కోసం కృషి చేద్దాం

### సిపిఐ జాతీయ కార్యవర్గసభ్యుడు: చాడ



ఫూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న చాడ వెంకటరెడ్డి

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** భారతదేశంలో సామాజిక సంస్కరణలు, విద్యా,స్త్రీ సమానత్వం కోసం అవిశ్రాంతంగా కృషిచేసిన ఒక గొప్ప సంస్కర్త, గొప్ప ఉద్యమకారుడు మహాత్మాజ్యోతిరావు ఫూలే అని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. మహాత్మాజ్యోతిరావు ఫూలే 198వ జయంతి సందర్భంగా శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పాత బస్టాండు ఆవరణలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫూలే 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్రలోని సతారాలో తోటమాలి కుటుంబంలో జన్మించారని తెలిపారు. 1873లో సత్యశోధన సమాజాన్ని ఏర్పాటు చేసి సత్యం, సమానత్వం ఆధారంగా సామాజిక సంస్కరణ చేపట్టారని తెలిపారు. కుల వివక్ష మతాచారాలు,అస్పృశ్యతను వ్యతిరేకించారని తెలిపారు. కుల వ్యవస్థపై పోరాటం చేస్తూనే దళితుల హక్కుల కోసం అంటరాని వారి కోసం నిరంతరం ఉద్యమించారని తెలిపారు. ఫూలే ఆశయ సాధన కోసం కృషి చేద్దామన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ మాట్లాడుతూ ఫూలే నవభారత నిర్మాణానికి నాంది పలికిన సామాజిక దర్శనికుడని పేర్కొన్నారు. ఫూలే దంపతుల ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని వారిని స్ఫూర్తిగా తీసుకొని సమాజంలో అసమానతలు లేకుండా విద్యాభివృద్ధికి అందరం కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మణ్, శంకర్, బన్సీలాల్, మల్లేశం, జేరిపోతుల జనార్ధన్, ప్రసన్నకుమార్, అనిరుథ్ తదితరులు పాల్గొన్నారు.

# వడగండ్లు, అకాలవర్షంతో నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వనున్న ప్రభుత్వం

### 24 వేల ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం

### సిద్ధిపేట జిల్లాలో

### వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**చిన్నకోడూరు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :** వడగండ్ల, అకాల వర్షాలతో రాష్ట్ర వ్యాప్తంగా 24 వేల ఎక రాలలో వరి, మిర్చి,కూరగాయ, మామిడి తోటలకు నష్టం వాటిల్లిందని రాష్ట్ర వ్యవ సాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్‌లో శుక్రవారం మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌గౌడ్‌లు పర్యటించి అకాల, వడగండ్ల వానతో నష్టపోయిన వరి, మిర్చి తదితర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పంటలు నష్టపోయిన రైతులు తమను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని గోడువెల్లబోసుకున్నారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నష్టపోయిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలిం చడం జరుగు తుందన్నారు. వడగండ్ల వానతో పంటలు నష్టపోయిన పూర్తి వివరాలను సేక రించి ప్రభుత్వానికి అం దించాలని అధికా రులను ఆదేశించినట్లు తెలిపారు. వడగండ్ల వానతో సిద్ధిపేటలో ఎక్కువ నష్టం జరగిందన్నారు. పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుం టుందన్నారు. రైతులను ఆదుకోవడానికి సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం చెల్లి స్తామన్నారు. వడగండ్ల, అకాల వర్షాలు పంటలక తీవ్ర నష్టం కలిగించావాపోయారు. జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి మాట్లా డుతూ జిల్లాలో 9300 ఎకరాలలో పంట నష్టం జరిగిందని వివరించారు. 6400 ఎకరాలలో వరి, 1200 ఎకరాలలో మామిడి, 1600 ఎకరాలలో కూరగాయల తోటలకు నష్టం జరిగిందని తెలి పారు. పూర్తి వివరాలను సేకరించి ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. మంత్రుల వెంట కాంగ్రెస్ నాయకులు, రైతులు తదితరులు ఉన్నారు.



నష్టపోయిన వరి పంటలను పరిశీలిస్తున్న మంత్రుల బృందం

# యూనియన్ల పేరుతో ఆర్టీసీపై అసత్య ఆరోపణలు

### దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన యాజమాన్యం

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** కొందరు వ్యక్తులు యూనియన్ల పేరుతో సంస్థపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని .. వారు చేస్తున్న దుష్ప్ర చారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు టిజిఎస్‌ఆర్‌టిసి ప్రకటించింది. కొంతకాలంగా తమ మనుగడ కోసం కొందరు వ్యక్తులు తమ ఇష్టారీతిన మాట్లా డుతూ, ప్రకటనలు జారీ చేస్తూ ఆర్‌టిసి ఉద్యో గులను గందరగోళానికి గురిచేస్తున్నారని సంస్థ శుక్రవారం జారీ చేసిన ప్రకటనలో మండిపడింది. తాజాగా ఎస్ఆర్ బీఎస్‌ను ఆర్‌టిసి సంస్థ రద్దు చేస్తోందంటూ ఉద్యోగులను తప్పుదారి పట్టించి రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని.. సంస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా ఉద్దేశ పూర్వకంగా చేస్తోన్న ఈ దుష్ప్రచారాన్ని యాజ మాన్యం తీవ్రంగా ఖండించింది. యూనియన్ లీడర్లమంటూ కొందరు చేస్తోన్న తప్పుడు ప్రచా రాన్ని, పుకార్లని నమ్మి ఆందోళనకు గురికావొద్దని ఉద్యోగులకు యాజ మాన్యం విజ్ఞప్తి చేసింది. ఆర్‌టిసికి ఉద్యోగులే వెన్నుముకని.. వారంతా క్షేత్రస్థాయిలో సమర్థ వంతంగా విధులు నిర్వహించడం వల్లే సంస్థ మన గలుగుతోందని ప్రకటనలో పేర్కొంది. సిబ్బంది నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణతో పనిచేయడంతోనే మంచి ఫలితాలు కూడా వస్తున్నాయని.. ఆర్‌టిసిని అన్ని తామై ముందుకు నడిపిస్తున్న ఉద్యోగుల సంక్షేమం విషయంలో యాజమాన్యం ఏమాత్రం రాజీపడటం లేదని సంస్థ ప్రకటనలో స్పష్టం చేసింది. ఎన్నో ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న 2017 సిఆర్‌సిని 21 శాతం ఫిట్ మెంట్‌తో 2024 మే నెలలో అందించిందని గుర్తు చేసింది. పెండింగ్‌లో ఉన్న 11 డీఏలను 2019 నుంచి దశలవారీగా ఉద్యోగులకు విడుదల చేసిందని తెలిపింది. ఆర్‌పిఎస్ 2013 బాండ్లకు సంబంధించిన రూ.280 కోట్లను ఆర్టీసీ ఉద్యోగుల ఖాతాల్లో సంస్థ జమచేసిందని.. ప్రమాదవశాత్తు అకాల మరణం చెందిన, శాశ్వతంగా దివ్యాంగులైన సిబ్బందికి రూ.1.20 కోట్ల ప్రమాద బీమాను సంస్థ అందిస్తోందని తెలిపింది. గత మూడున్నరేళ్లలో పీఎఫ్‌కు రూ.2,348.35 కోట్లను, సీసీఎస్ కు రూ. 1300.73 కోట్లను యాజమాన్యం చెల్లించిందని.. 2021-22 నాటికి పీఎఫ్ బకాయిలు రూ. 1,352.82 కోట్లు ఉండగా.. వాటితో పాటు రికవరీ మొత్తాలను ప్రతి నెల క్రమతప్పకుండా చెల్లిస్తూ ప్రస్తుతం రూ.580.37 కోట్లకు తగ్గించిందని ప్రకటించింది. అలాగే సీసీఎస్ బకాయిలు 2021- 22 నాటికి రూ. 887.48 కోట్లు ఉండగా.. రికవరీ మొత్తాలను ప్రతి నెల క్రమతప్పకుండా చెల్లిస్తూ రూ.451.09 కోట్లకు సంస్థ తగ్గించిందని తెలిపింది. సంస్థలో పీఎఫ్, సీసీఎస్ బకాయిలు 2012 నుంచే ఉన్నాయని.. ఇప్పుడే ఆ నిధులను వినియోగించుకున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. ఇది పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేసింది. పర్యా వరణ హితమైన ఎలక్ట్రిక్ బస్సుల విషయంలో కొందరు ఉద్దేశపూర్వకంగానే డిపోల ప్రైవేటీకరణ అంటూ లేనిపోని అపోహాలను ఉద్యోగుల్లో సృష్టిస్తున్నారని మండిపడింది. ఎలక్ట్రిక్ బస్సులతో ఒక్క ఉద్యోగిని కూడా తొలగించే పరిస్థితి ఉండదని యాజమాన్యం స్పష్టం చేసింది మరణించిన, మెడికల్ అన్‌ఫిట్ అయిన 2511 మంది ఉద్యోగుల పిల్లలు, జీవిత భాగస్వాములకు కారుణ్య నియమాకాల ద్వారా ఉద్యోగాలను సంస్థ కల్పించిందని తెలిపింది. గతంలో రోడ్డు ప్రమాద కేసుల్లో కారణాలతో నిమిత్తం లేకుండా డ్రైవర్లు ఉద్యోగాలు కొల్పోయేవారని కానీ గత మూడేళ్లుగా అలాంటి పరిస్థితి లేదని తెలిపింది. ఎంతో కాలం సంస్థపై ఆధారపడి జీవించి.. పదవీవిరమణ చేసిన తర్వాత బయటకు వెళ్లి సంస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించే నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదని.. ఇప్పటికైనా సంస్థపై దుష్ప్రచారాన్ని మానుకో వాలని యాజమాన్యం హితవు పలుకింది. తమ మనుగడ కోసం కొందరు ఉద్దేశపూర్వకంగా చేస్తోన్న ఆరోపణలను నమ్మి ఆందోళనకు గురికావొద్దని ఉద్యోగులకు విజ్ఞప్తి చేసింది.

# మద్యం మత్తులో ద్విచక్ర వాహనాన్ని కారుతో ఢీ

### యువతి మృతి.. మరొకరికి గాయాలు

### కారు డ్రైవర్‌ను పట్టుకున్న పోలీసులు

**హైదరాబాద్ (అబ్దుల్లాపూర్‌మెట్), ఏప్రిల్ 11, ప్రభాతవార్త :** స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి మద్యం మత్తులో ఉన్న ఓ కారు డ్రైవర్ అతి వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువతి అక్కడికక్కడే మృతి చెందగా, యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. మద్యం మత్తులో కారు నడుపుతున్న వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి పరారవుతుండగా పోలీసులు పట్టుకున్న సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి జిల్లా నారా యణపూర్ మండలం చిల్లాపూర్ గ్రామానికి చెందిన కొప్పు శంకరయ్య కూతురు కొప్పు స్పం దన (19) మేడ్చేల్ మల్కాజ్‌గిరి జిల్లా ఘట్కే సర్‌లోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ సం స్మృతి ఇంజినీరింగ్ కాలేజీలో బీ ఫార్మసీ మొదటి సంవత్సరం చదు వు తోంది. ఈ క్రమంలో సైదాబాద్ సిం గరేణి కాలనీలో నివాసముండే ఆమె స్నేహితుడు సాయి కుమార్‌తో కలిసి స్పందన గురువారం రాత్రి అబ్దుమ ల్లాపూర్‌మెట్ మండలం కోహెడ సమీపంలో ఔటర్ సర్వీస్ రోడ్డుపై ఘట్‌కేసర్ వైపుకు వెళ్తుండగా అదే సమయంలో వారి వెనుక నుంచి వస్తున్న ఓ కారు డ్రైవర్ మద్యం మత్తులో వాహనాన్ని అతి వేగంగా తీసుకువచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టాడు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై నుంచి స్పందన, సాయి కుమార్‌లు ఎగిరి కారు అద్దంపై పడి. అక్కడి నుంచి కిందపడ్డారు. దీంతో తీవ్ర గాయాలతో స్పందన మృతి చెందగా, సాయికుమార్‌కు తీవ్రగాయాల య్యాయి. స్థానికుల సమాచారం మేరకు సం ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సాయి కుమార్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి, పోస్ట్‌మార్టం నిమిత్తం స్పందన మృతదేహాన్ని ఉస్మానియా మార్చురికీ తరలించారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



చికిత్స పొందుతున్న యువకుడు

## మీనాక్షి నటరాజన్‌పై ఏలేటి విమర్శలు తగదు

### రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ తెలంగాణ చైర్మన్ సిద్దేశ్వర్

**హైదరాబాద్,ఏప్రిల్11,ప్రభాతవార్త:** సచివాలయం నిషిద్ద స్థలం కాదని రాష్ట్ర ఇంచార్జిగా ఆమె సంక్షేమపథకాలు అభివృద్ధి వంటి అంశాల హెచ్‌సియుపై మంత్రుల కమిటితో ఆయా అంశాలపై చర్చలు చేయడాన్ని బిజెపి ఎల్‌పి లీడర్ మహేశ్వర్‌రెడ్డి విమర్శలు చేయడం తగదని రాజీవ్‌గాంధీ సంఘటన్ తెలంగాణ చైర్మన్ రాచమల్ల సిద్దేశ్వర్ అన్నారు.శుక్రవారం గాంధీభవన్‌లో మాట్లాడుతూ బీజేపీ నేతలు వ్యక్తిగత దూషణలు చేయడం మానుకోవాలన్నారు.


తెలంగాణ ప్రభుత్వం

పురపాలక సంఘ కార్యాలయము :: భువనగిరి

ఫైలు నెం. ఇ1/1/2025-26, టెండరు మరియు కొటేషన్ నోటీసు ప్రకటన తేది: 11.04.2025

పనుల సంఖ్య : 7, అంచనా వ్యయం: రూ.66.70 లక్షలు, బిడ్ దాఖలు ప్రారంభ తేది: 12.04.2025, ఉ.11.00 గం.లు, బిడ్ దాఖలు ముగింపు తేది: 15.04.2025 మ.3.00గం.లకు. మరియు వివిధ అభివృద్ధి పనులు మరియు ఇతర నిర్వహణ పనులకు అవసరమగు Non-SSR Item లకు ధరలు ఏజెన్సీలు/కాంట్రాక్టర్ల నుండి సీల్డ్ కొటేషన్లు కోరనైనది. పూర్తి వివరముల కొరకు మున్సిపల్ ఇంజనీర్: 9581853956ను సంప్రదించగలరు.

సం/-. కమిషనర్, భువనగిరి మున్సిపాలిటీ.

DIPR.NO. 341-PP/CL/ADVT/1/2025-26 తేది: 11.04.2025


# కుల గణనతో బిఆర్‌ఎస్ పార్టీలో వణుకు పుట్టింది..

### అందుకే నిందలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తోంది

### పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :** కులగణతో వణుకు పుట్టిన బిఆర్‌ఎస్ నిందలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని పిసిసి చీఫ్ మహేష్‌కుమార్ విమర్శించారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ పదేండ్లలో భూ దోపిడి చర్చకు సిద్ధమా? దమ్ము ధైర్యం ఉంటే చర్చకు రండి.. అని కేటీఆర్ కి పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సవాల్ చేశారు. కరెప్షన్ కి కేరాఫ్ అడ్రస్ కేసీఆర్ కుటుంబం అని ఆయన నిర్వ చించారు. లిక్కర్ స్కాం చేసింది కేసీఆర్ కుటుంబం, అడ్డమైన వాళ్లు వచ్చి మాట్లాడుతున్నారని, తెలంగాణ ప్రజలారా నమ్మకండి అని ఆయన పిలుపునిచ్చారు. కేటీఆర్ ఇంత దిగజారుతాడా? కేసీఆర్ కుటుంబంపై సీబీఐ విచారణ జరపాలని అన్నారు. అత్యంత తక్కువ సమయంలో అత్యంత ఎక్కువ ధనం దోపిడీ చేసింది కేసీఆర్ కుటుంబం అని మహేష్‌కుమార్ ఆరోపించారు. బిల్లీ రావుతో కేటీఆర్ ఒప్పందం చేసుకున్నాడని అన్నారు. కేటీఆర్ గుంటూరులో ఏం చదువు నేర్చు కున్నాడో సగంసగం తెలుసుకొని రాజకీయ లబ్ది కోసం కేటీఆర్ మాట్లాడుతారని ఆయన అన్నారు. బిసి కుల గణన వల్ల బిఆర్‌ఎస్ పార్టీకి వణుకు పుట్టింది.. బిఆర్‌ఎస్ పదేళ్లలో ఎన్ని వేల ఎకరాలను కొల్లగొట్టారో తెలి యదా?రైతులు బాగుపడుతుంటే కెటిఆర్‌కి కడుపు నొప్పి వస్తోంది. ప్రభుత్వం టెండర్లను పిలిచింది ట్రస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ మొత్తం వైట్‌మనీ ఇచ్చింది. టెక్నాలజీతో వీడియోలు చేయించి తప్పుడు సంకేతాలు ప్రజల్లోకి పంపారు. తెలంగాణకి ఉద్యోగాలు రాకూడదా?బిఆర్‌ఎస్ దోపిడీని భరించలేకనే కాంగ్రెస్ పార్టీని గెలిపించారని అన్నారు. డ్రామరావు పేరును కేటీఆర్ సార్థకం చేసుకుంటున్నాడని ఆయన ఎద్దేవా చేశారు. హెచ్ సి యు భూములపై పూటకో డ్రామా ఆడుతూ కేటీఆర్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.జిహెచ్‌ఎంసి పరిధిలో పదివేల ఎకరాలకు పైగా భూములు అమ్మిన చరిత్ర బిఆర్‌ఎస్ పార్టీది అని అన్నారు. హైదరాబాద్ చుట్టూ పక్కల అత్యంత విలువైన ప్రభుత్వ భూములను మీ అస్మదీయులకు కట్టబెట్టింది వాస్తవమా కాదా కేటీఆర్ ? అని ప్రశ్నించారు.పదేళ్లలో యదేచ్ఛగా భూములు దోపిడీ చేసిన చరిత్ర బిఆర్‌ఎస్ పార్టీదే అన్నారు.హెచ్ సియు భూములకి సంబంధించి కేటీఆర్ ఐఎంజీ సంస్థ బిల్లి రావుతో 30 శాతం ముడుపులు మాట్లాడుకొని కుదుర్చుకున్న ఒప్పందం చెప్పారు.ముడుపుల ఒప్పందం బెడిసి కొట్టడంతో కేటీఆర్ నానాయాగి చేస్తున్నారుహెచ్ సి యు భూములు ప్రైవేట్ పరంగా కాకుండా కాపాడిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అన్నారు. ఆ భూములు ప్రభుత్వానివే. గైడ్ లైన్స్ పరంగా టిజిఐఐసి తో కంపెనీ తో 10 వేల కోట్లు ఒప్పందం అన్నారు.భూముల ఒప్పందం ద్వారా వచ్చిన 10 వేల కోట్ల రూపాయలను రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం ఉపయోగించిది అన్నారు. అఫిషియల్ గా ట్రస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ అనే కంపెనీకి రూ.170 కోట్లు రూపాయలు బదిలీ జరిగిందని తెలిపారు. హెచ్‌సియు భూములను అప్పటి ఎన్డీయే ప్రధాని అటల్ బిహారీ వాజపేయిసీఎం చంద్రబాబు కలిసి ఐఎంజీ భారత్ కంపెనీకి అప్పగిస్తే కోర్టులో కొట్లాడి వైఎస్ఆర్ రద్దు చేయించారని గుర్తుచేశారు. హెచ్ సియుభూములపై కుట్ర పూరితంగానే ఏఐ టెక్నాలజీ తో నెమళ్ళు, జింకలు రోదిస్తున్నాయని అంటూ అవాస్తవాలు ప్రచారం చేశారని అన్నారు. అసత్యాలు అవాస్తవాలు ప్రచారం చేసిన వాళ్లను వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. తెలంగాణ అభివృద్ధికి అడుగడుగునా ప్రతిపక్షాలు అడ్డు పడుతున్నాయి కేటీఆర్ అరెస్టును అడ్డుకుంటుంది ఎవరో అందరికీ తెలుసు అని అన్నారు. కేటీఆర్ జైలుకు పోవడం ఖాయం అని చెప్పారు. ఫార్ములా ఈ కార్ రేస్ లో అరెస్టు అవుతానని కేటీఆర్ కి తెలుసు మంత్రి వర్గంలో భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ చర్చించుకొని ముందుకు వెళ్లే వెసులుబాటు కాంగ్రెస్ పార్టీలో ఉందని ఆయన వివరించారు కాంగ్రెస్ పార్టీలో స్వేచ్ఛకి కొదవ లేదు, పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ యూని వర్సిటీల భూముల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఇప్పుడు విమర్శలు చేయడం విడ్డూరమని అన్నారు.హెచ్‌సీయూకి చెందిన 134 ఎకరాలను కేసీఆర్ టీఎన్జీఓలకు ఇచ్చినప్పుడు కేటీఆర్‌కు యూనివర్సిటీల భూమి అని తెలిసిరాలేదా..? అని ప్రశ్నించారు. అప్పుడు యూనివర్సిటీ భూమి పరిరక్షణపై ఎందుకు నోరు మెదపలేదు..? అని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ప్రయోజనం కలిగించేలా వర్సిటీ భూముల్లో రోడ్డు వేసింది మీ బిఆర్ఎస్ సర్కార్ కాదా కేటీఆర్ బిఆర్ఎస్ పాలనలో రియల్ ఎస్టేట్ కంపెనీల యాడ్స్ కంటే సర్కారీ భూముల అమ్మకాల ప్రకటనలే పేపర్లలో పెద్దఎత్తున కనిపించిన సంగతి మర్చి పోయావా అని నిలదీశారు. కేటీఆర్ యూనివర్సిటీలకు అన్ని ఎకరాల భూమి ఎందుకంటూ కేసీఆర్ పాలనలోనే యూనివర్సిటీలపై వివక్ష చూపిస్తూ భూముల కబ్జాపై కేటీఆర్ కన్నేశారు హెచ్‌సీయూలో వివాదాస్పద భూమిని మినహాయించి మిగతా భూమి పరిరక్షణకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు ఎందుకు తీసుకోలేదో కేటీఆర్ సమాధానం చెప్పాలని ఆయన అన్నారు.బీజేపీతో బిఆర్ ఎస్ అనైతిక బంధం కొనసాగిస్తూ కేటీఆర్ కాంగ్రెస్‌పై నిరాధార ఆరోపణలు చేస్తున్నారు.


తెలంగాణ ప్రభుత్వం

ఫారం-VII

(Declaration) రూఢీ ప్రకటన

జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము (భూసేకరణ), నాగర్‌కర్నూల్ జిల్లా

భూసేకరణ, పునరావాస, పునస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 19(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 25 ప్రకారము

G2/354/2024 తేది: 13.03.2025

Gaz. No. 19/2025

నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని చెదురుపల్లి గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన ఎ.16.19 గుంటలు భూమి మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం క్రింద ప్రజా ప్రయోజనార్థం అనగా డిస్ట్రిబ్యూటరి కెనాల్-82 (MJR-35/MIR-2) నిమిత్తం సేకరించవలసిన అవసరం ఉన్నదని జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్‌గారు భావిస్తున్నారు. కావున ఎ.16.19గుం॥ భూమి డిస్ట్రిబ్యూటరీ కెనాల్-82 (MJR-35/MIR-2) నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకుగాను రూఢీ ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

షెడ్యూల్

గ్రామము : చెదురుపల్లి మండలం : వెల్దండ జిల్లా : నాగర్‌కర్నూల్

| క్ర. సం. | సర్వే నెం./ ఎస్.డి. నెం. | పట్టా/ ఇనాం etc. | భూవర్గీకరణ మెట్ట /తరితడి /తరి | భూసేకరణ ప్రతిపాదించిన విస్తీర్ణము ఎ.గుంటలు | పట్టాదారు పేరు అనుభవదారు పేరు మరియు ఏదైనా హక్కులు గల ఇతర వ్యక్తులు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు చెట్ల పేర్లు | చెట్ల సంఖ్య | నిర్మాణములు వర్గము | విస్తీర్ణము |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 199 | పట్టా | మెట్ట | 2.04 | వి.సొజ్యా భర్త: కీమా (0.20), వి.కీమ్యా తండ్రి:సూర్య(0.20), కొమ్ము బాలమ్మ భర్త: (0.12), సూర్యా తండ్రి: తావుర్య (0.16), శివలాల్ తండ్రి: తావుర్య (0.16), వి.నరేష్ తండ్రి: కీమ్యా, కె.గుండయ్య తండ్రి: శివయ్య, వి.నిఖిల్ కుమార్ తండ్రి: భీమ | 118 | 121 | 120 | 36 | లేవు | లేవు | లేవు | లేవు |
| 2 | 200 | లావుణీ పట్టా | మెట్ట | 0.27 | ప్రభుత్వ భూమి (0.27), [illegible] | 213 | 201 | 209 | 199 | లేవు | లేవు | లేవు | లేవు |
| 3 | 209 | పట్టా | మెట్ట | 3.00 | వెంకటయ్య తండ్రి: [illegible] (0.30), [illegible] (0.25), తావుర్య తండ్రి: [illegible] (0.15), [illegible] (0.05), [illegible] (0.15), నరేష్ తండ్రి: [illegible] (0.25), రమేష్ తండ్రి: [illegible] (0.05), [illegible] | 210 | 202 | 206 | 200 | లేవు | లేవు | లేవు | లేవు |
| 4 | 208 | పట్టా | మెట్ట | 2.09 | [illegible] (0.26), [illegible] (0.09), [illegible] (0.09), [illegible] (0.09), [illegible] (0.09), [illegible] (0.09), [illegible] (0.09), [illegible] (0.09), [illegible] | 211 | 206 | 243 | 209 | లేవు | లేవు | లేవు | లేవు |
| 5 | 207 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.04 | [illegible] (0.02), [illegible] (0.02) | | | | | లేవు | లేవు | లేవు | లేవు |
| 6 | 243 | పట్టా | మెట్ట | 0.37 | [illegible] (0.14), [illegible] (0.23), [illegible] | 229 | 249 | 244 | 208 | లేవు | లేవు | లేవు | లేవు |
| 7 | 244 | పట్టా | మెట్ట | 1.29 | [illegible] (0.10), [illegible] (0.10), [illegible] (0.18), [illegible] (0.10), [illegible] (0.08), [illegible] (0.13), [illegible] | 242 | 245 | 239 | 243 | లేవు | లేవు | లేవు | లేవు |
| 8 | 240 | పట్టా | మెట్ట | 1.15 | [illegible] (0.05), [illegible] (0.05), [illegible] (0.07½), [illegible] (0.07½), [illegible] (0.07½), [illegible] (0.07½), [illegible] (0.07½), [illegible] (0.07½), [illegible] | 237 | 239 | 238 | 241 | లేవు | లేవు | లేవు | లేవు |
| 9 | 237 | పట్టా | మెట్ట | 2.07 | [illegible] (0.06), [illegible] (0.06), [illegible] (0.05), [illegible] (0.04), [illegible] (0.04), [illegible] (0.07), [illegible] (0.28), [illegible] (0.06), [illegible] (0.07), [illegible] (0.10), [illegible] (0.02), [illegible] (0.02), [illegible] | 236 | 240 | 238 | 241 | లేవు | లేవు | లేవు | లేవు |
| 10 | 234 | పట్టా | మెట్ట | 0.37 | [illegible] (0.12½), [illegible] (0.12½), [illegible] (0.12), [illegible] | 232 | 237 | 233 | 235 | లేవు | లేవు | లేవు | లేవు |
| 11 | 232 | పట్టా | మెట్ట | 0.30 | [illegible] (0.30), [illegible] | V8 | 234 | 233 | 231 | లేవు | లేవు | లేవు | లేవు |
| 12 | 231 | పట్టా | మెట్ట | 0.15 | [illegible] (0.15), [illegible] | 262 | 235 | 232 | 230 | లేవు | లేవు | లేవు | లేవు |
| 13 | 245 | పట్టా | మెట్ట | 0.05 | [illegible] (0.05), [illegible] | 244 | 249 | 246 | 243 | లేవు | లేవు | లేవు | లేవు |
| | | | మొత్తం | ఎ.16.19గుం | | | | | | | | | |

భూసేకరణ చట్టం 30/2013లోని సెక్షన్ 15 అనుసరించి పైన కనబరిచిన భూములకు సంబంధించినటువంటి రైతుల నుండి ఎటువంటి అభ్యంతరములు/ ఆక్షేపణలు లేనందున ఇట్టి రూఢీ ప్రకటన చేయడమైనది.

భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్‌కర్నూల్ నందు పరిశీలించుటకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

సామాజిక ఆర్థిక సర్వే నివేదిక ప్రకారము పైన చూపిన భూసేకరణ పిమ్మట ఏ ఒక్కరునూ వారి జీవనోపాధి కోల్పోవడం గానీ, భూమి లేని వారిగా గాని జరగడము లేనందున ఇట్టి భూసేకరణ ప్రక్రియనందు పునరుపాధి మరియు పునరావాస కల్పన ప్రతిపాదనలు ఏమియును లేవు.

సం/-. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), యూనిట్-I, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్ | సం/- అదనపు కలెక్టర్, నాగర్‌కర్నూల్ | సం/-. జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్

DIPR RO.NO: 20/LA/PP/Advt/Pub/2025-26

వార్త

కోపం ఒక ఘనత అనుకొని, లాభం అనుకుని దానికి లొంగిపోయిన వారికి అందువల్ల కలిగే కీడు అనుభవించక తప్పదు.

-తిరుక్కురళ్

# పౌష్టికాహార లేమి!

ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా, మరెన్ని లక్షల కోట్ల రూపాయలు వెచ్చించినా, వెచ్చిస్తున్నా ప్రజలను పౌష్టికాహార లోపం నుండి గట్టెక్కించ లేకపోతున్నారు. ఇప్పటికీ దేశంలో కోట్లాది మంది పౌష్టికాహార లోపంతో రకరకాల సమస్యలతో సతమత మవుతున్నారు. ప్రపంచ జనాభాలో పౌష్టికాహారలోపంతో బాధపడుతున్న బాలల్లో ఇరవైశాతంపైగా భారతావనిలోనే ఉన్నారని ఐక్యరాజ్యసమితి నివేదికలు ఏనాటి నుంచో చెబుతున్నాయి. ఐదు సంవత్సరాలలోపు పిల్లల్లోదాదాపు నలభైశాతం మంది తక్కువ బరువుతో పుడుతున్నారని, వారిలో దాదాపు ఆరేడు శాతం మంది పిల్లలు పుట్టినా ఐదేళ్లలోపే మరణిస్తున్నారని ఎన్నో నివేదికలు వెల్లడించా యి. ఈభూమ్మీద పుట్టినవారికి ఎవరికైనా జీవించేహక్కు రాజ్యాంగం కల్పించింది. అలాంటిది కన్నులైనా సరిగ్గా తెరవని పసిగుడ్డులకు సరైన ఆహారం అందక చనిపోతే దానికి బాధ్యత వహించాల్సింది పాలకపెద్దలే. తల్లీబిడ్డకు పోషకాహారం అందివ్వకపోవడం కూడా పాలకుల బాధ్య తారాహిత్యం కిందకే వస్తుంది. అందుకోసం కొత్తగా పథ కాలు ప్రవేశపెట్టకపోతేపోయారు ఉన్నపథకాలను ఏ మేర కు అమలు చేస్తున్నారో, అర్హులైన వారిలో ఎంత మందికి అందిస్తున్నారో పరిశీలిస్తే ఆశ్చర్యకరమైన విషయాలువెలు గులోకి వస్తాయి. పర్యవేక్షణాలోపం కారణంగా తల్లీబిడ్డల కు అందాల్సిన పౌష్టికాహారం పక్కదారిపడుతున్న విష యం ఎన్నో సార్లు వెలుగు చూసినా పటిష్టమైన చర్యలు లేకపోవడంతో నిరాటంకంగా కొనసాగుతున్నది. భారత్‌లో నే కాదు ప్రపంచవ్యాప్తంగా కూడా పోషకాహార లోపం పెచ్చరిల్లిపోతుందనే చెప్పొచ్చు. భారత్‌లో పౌష్టికాహారం ప్రధానంగా సూక్ష్మపోషక ఆహార సమస్య అధికంగాఉంది. ప్రపంచవ్యాప్తంగా పోషకాహార లోపంతో బాధపడుతున్న వారిలో మూడోవంతుభారత్‌లో ఉన్నారనే విషయం అనేక సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఈలోపాన్ని అధిగమించేందుకు పాలకులు ఏమీచేయడంలేదని చెప్పడంలేదు. ఎన్నో పథ కాలు ప్రవేశపెట్టారు. దేశవ్యాప్తంగా కోట్లాదిమంది ఉద్యో గులు, స్వచ్ఛంద సేవాసంస్థలు నిరంతరం కృషి చేస్తున్నా యి. 1975లోనే ఆరేళ్లలోపు పిల్లలకు,తల్లులకు పౌష్టికా హారాన్ని అందించేందుకు ఆనాటి కేంద్ర ప్రభుత్వం సమీ కృత శిశు అభివృద్ధిపథకాన్ని ప్రవేశపెట్టింది.ప్రధానమంత్రి మాతృవందన యోజన, పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారాఎన్నో కార్యక్రమాలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. పోషకాహార లక్ష్యంగా పని చేయాలని అంగన్‌వాడీ కేంద్రాలు పూర్తిస్థాయిలోఆ దిశగా అడుగులు వేయాలని తెలంగాణ పంచాయతీరాజ్,మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క గురువారం జరిగిన ఉన్న తాధికారుల సమీక్షాసమావేశంలో ఆదేశాలిచ్చారు.రాబోయే రోజుల్లో అంగన్‌వాడీ సెంటర్లకు గ్రేడింగ్ ఇస్తామని మంచి ఫలితాలు సాధించిన సెంటర్లకు సిబ్బందికి,అధికారులకు అవార్డులు ఇస్తామని కూడా ప్రకటించారు.అలాగే అంగన్ వాడీ కేంద్రాల్లో సరఫరఅయ్యే సరుకుల్లో నాణ్యతలోపిస్తే కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని మంత్రి హెచ్చరిం చారు. ఒక్క తెలంగాణనే కాదు అటు ఆంధ్రప్రదేశ్‌లోనూ, ఆమాటకొస్తే అనేక రాష్ట్రాల్లో పౌష్టికాహార లోపాన్ని అధిగ మించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అయినా భారత్ లో ఈసమస్య ఎందరినో పట్టిపీడిస్తున్నది.2022ప్రపంచ ఆకలి సూచీలో 121 దేశాల్లో భారత్ 107వస్థానంలో ఉంది. ఈ పౌష్టికాహార లోపంకారణంగానే ఆరోగ్యపరంగా ముఖ్యంగా మహిళలు,చిన్నారుల్లో అనేక సమస్యలు తలె త్తుతున్నాయి. ఐదేళ్లలోపు పిల్లల్లో దాదాపుముప్పైశాతానికి పైగా వయసుకు తగినఎత్తుకు పెరగడంలేదు.మరో పంతొ మ్మిదిశాతం ఎత్తుకు తగినబరువు ఉండడంలేదు. ముప్పై రెండుశాతం పిల్లల ఎదుగుదల లోపాలను ఎదుర్కొంటు న్నారు. జార్ఖండ్, అసొం, మహారాష్ట్ర, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో ఈపౌష్టికాహార సమస్యలు అధికంగా ఉన్నాయి. ఇంకోవైపు పదిహేనేళ్ల బాలికలనుండి యాభైఏళ్లలోపుఉన్న మహి ళలల్లో దాదాపు యాభైఏడుశాతం రక్తహీనతతో బాధపడు తున్నారు. ఎనభైశాతానికి పైగా సూక్ష్మపోషకాల కొరతను ఎదుర్కొంటున్నట్లు అంతర్జాతీయ అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. పౌష్టికాహార లోపాన్ని అధిగమించేం దుకు ప్రజాపంపిణీ వ్యవస్థద్వారా పోషకాలుకలిగినబియ్యా న్ని అందించే కార్యక్రమం కొనసాగిస్తామని ప్రధాని ప్రక టించారు.2030నాటికే పిల్లల్లో తీవ్రమైన పౌష్టికాహారాన్ని నియంత్రించేందుకు మూడువేల కోట్ల రూపాయలకుపైగా వ్యయంతో ప్రత్యేక పథకాన్ని ఒడిశా ప్రభుత్వం తీసుకు వచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. మరికొన్ని రాష్ట్రాలు కూడా ఆ కోణంలో ఆలోచించి పథకాలు ప్రవేశపెడుతు న్నాయి. తెలంగాణ ప్రభుత్వం మొన్న ఉగాది నుంచి సామాన్యుల నుంచి నిరుపేదలు ఇష్టపడే సన్నబియ్యాన్ని అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకం పట్ల సన్నజనం ఎంతోసంతోషం వ్యక్తంచేస్తున్నది. గతం లో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారావస్తున్న దొడ్డుబియ్యాన్ని తినలేక ఐదు, పదిరూ పాయలకు కిలో అమ్ముకునేవారు. దళారులకు ఇది ఒకవరంగా మారిపోయి కోట్లాది రూపా యలు కొల్లగొట్టారు. పథకాలు,ఉద్దేశాలు అన్నిసక్రమంగా ఉన్నా సంతృప్తి కల్పించేవిధంగా కన్పిస్తున్నా ఆచరణకు వచ్చేసరికి చాలావరకు కాగితాలకే పరిమితమవుతున్నా యి. వాస్తవంగా చూసినా గతదశాబ్దకాలంగా భారత్‌లో ఆహారధాన్యాల ఉత్పత్తులకు కొరతలేదు. రికార్డుస్థాయిలో దిగుబడులు వస్తున్నాయి. ఈపరిస్థితుల్లో కొత్త పథకాల గురించి ఆలోచించకపోయినా ప్రస్తుతం ఉన్న పథకాలను సవరించి పర్యవేక్షణను మరింత పటిష్టం చేస్తే కొంతవరకైనా లక్ష్యాన్ని చేరుకుంటాం.

ఏమీ చేయకుండానే ఎంతో కొంత పొందాలని ఎదురుచూసే వ్యక్తులు తప్పనిసరిగా నిరాశకు గురవుతారు.



ఎలైట్

ఏ పని అయినా తరచూ చేస్తూంటేనే ఒక అలవాటుగా మారుతుంది. ఆ అలవాటును కొనసాగిస్తే మనసులో పాతుకుపోతుంది.



ఎడ్వర్డ్స్

## ప్రజావాక్కు



### సమాఖ్య స్ఫూర్తికి పట్టం కట్టిన సుప్రీంతీర్పు

**తమిళనాడు** గవర్నర్ ఆ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాల్ని చట్టవ్యతిరేకమంటూ సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పు చారిత్రాత్మకం.ఆయన తొక్కిపెట్టిన పదిబిల్లులను ఆమోదించినట్టుగానే భావిస్తూ తీర్పునివ్వ డం సరైనచర్య. ముందు ముందు అలా తొక్కిపెట్టే అవ కాశాల్ని తగ్గిస్తూ గవర్నర్ విధులకు అవసరమైన పరిమి తుల్ని విధించడం కూడామంచిదే.గవర్నర్ స్థానానికి పెద్ద రికం కట్టబెడుతూ,రాజ్యాంగం అస్పష్టంగా వదిలివేసిన లక్ష్మణ రేఖల్ని నేడు న్యాయస్థానం దిద్ది బాగా కనబడేట్టు చేయాల్సిరావడం రాజకీయాల పుణ్యమే.మన దేశం పార్ల మెంటరీ ప్రజాస్వామ్యవ్యవస్థ.ప్రజలెన్నుకున్న ప్రతినిధుల ద్వారా సాగే ప్రజాపాలన. వారి అభీష్టం మేరకు, వారు చేసే చట్టాలు అమల్లోకిరావాలి.ఇక్కడ రాష్ట్రపతి, గవర్న ర్లది కేవలం నామమాత్రపుపాత్ర. అయితే దానికి రాజకీ యవాసనల్నిఅంటగట్టేప్రయత్నాలతోనేచిక్కులొస్తున్నాయి.

-డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### మామిడి రైతులను ఆదుకోవాలి

**తెలంగాణ** రాష్ట్ర ప్రభుత్వం ఆకాలంలో పడుతున్న వర్షాలు, గాలి వానకు మామిడి కాయలు రాలుతున్నాయి. దీంతో మామిడి రైతులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. పండిం చిన మామిడి కాయలు నేలపాలు కావడంతో పెట్టిన పెట్టు బడులు రాకా అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారు. వీట న్నింటిని దృష్టిలో పెట్టుకుని మామిడి రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలి.

-మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

### అనాథ విద్యార్థులు

**తెలంగాణ** రాష్ట్రంలో వివిధ కారణాల చేత తల్లిదండ్రుల ను కోల్పోయిన అనాథ విద్యార్థుల విద్యాభివృద్ధికిగాను ప్రభుత్వం సంక్షేమ హాస్టల్లో ఉచిత వసతి కల్పించాలి. ఫీజులను ప్రభుత్వం మినహాయించాలి. మరికొన్ని అనాథ సంక్షేమ హాస్టళ్లనుప్రారంభించాలి.18సంవత్సరాలు లోపు ఉన్న విద్యార్థులకు ప్రత్యేకమైన అనాథ ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి.తల్లిగాని తండ్రిగాని ఇద్దరిలో ఒకరు సంరక్షకులు గా ఉన్నవారిని కూడా గుర్తించి వచ్చే విద్యా సంవత్సరం ప్రత్యేక బోధన వసతి ఏర్పాటు చేయాలి. విద్యతోపాటు గా బట్టలు పుస్తకాలు నోట్స్ సరఫరా చేయాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### కేంద్రం చర్యలు తీసుకోవాలి

**తమిళనాడు** ప్రభుత్వం ఆమోదించిన పది ముఖ్యమైన బిల్లు లను ఆరాష్ట్ర గవర్నరు ఆర్.ఎన్.రవి గారు తన దగ్గర కొంత కాలం ఉంచుకొని వాటిని సుప్రీం కోర్టుకు పంపడం బహుశ మన ప్రజాస్వామ్య చరిత్రలో ఇదే మొదటిసారికావచ్చు. ఒక పక్క ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం.మరోపక్క రాజ్యాంగ విధు లను కాపాడే గవర్నరు ఇలాఏవో కారణాలతో పరస్పర విరుద్ధం గా ప్రవర్తించడం వలన పరిపాలన కుంటుబడడం, ప్రజలు ఇబ్బంది పడడం జరుగుతుంది. గతంలో కూడా ఈ గవర్నరు ఉభయ సభలను ఉద్దేశించి ప్రభుత్వం రాసిన పత్రాలను వక్రీ కరించి చదవడం, సభ నుండి వాకౌట్ చేయడం కూడా జరిగిం ది.రాష్ట్రప్రభుత్వం రెండవసారి పరిశీలించి పంపిన బిల్లులమీద గవర్నరం ఆమోదముద్ర వేయాలని రాజ్యాంగం చెబుతోంది. సుప్రీంకోర్టు తీర్పుగవర్నరు పదవికిచెంప పెట్టులాంటిది. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా పనిచేయకూడదు. రాజ్యాంగ పరిరక్షణే గవర్నర్ల విధి అని పదేపదే చెప్పనక్కరలేదు.

-ఎన్. రామలక్ష్మి,సికింద్రాబాద్

### వయోపరిమితి పెంచాలి

**ఏడు** సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక్క డిఎస్సి నోటిఫికేషన్ కూడా విడుదల చేయకపోవడంతో ఎంతో మంది అభ్యర్థులు నిర్ణీత వయసుమీరి డిఎస్సి రాసేందుకు దూరమవు తున్నారు. కొత్త ప్రభుత్వం ప్రకటించనున్న డిఎస్సిలో అభ్య ర్థులందరికీ న్యాయం జరిగేలా జనరల్ అభ్యర్థులకు గరిష్ట వయోపరిమితిని యాభై యేళ్లకు, మిగతా వెనుకబడిన కులాల వారికి యాభై ఐదేళ్ల వరకు పొడిగించాలి. వయో పరిమితి పెంచితే నిరుద్యోగ సమస్యనుకూడా కొంతవరకు తగ్గించవ చ్చు.రాష్ట్రంలో నిరుద్యోగులసంఖ్య పెరుగుతున్నది. నిరు ద్యోగ సమస్యకు అడ్డుకట్ట వేయాలంటే కొంత వరకు వయోపరిమితిని సడలించాలి. వయో పరిమితి సడలింపు విషయంలో ప్రభు త్వం సానుకూలంగా స్పందించాలి.

-టి. రమణారావు, అక్కరాపల్లి

### యువ నేతకు అవకాశం ఇవ్వాలి

నిత్యం పని వత్తిడిలో ఉండే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డివిద్యా శాఖా మంత్రిగా ఉండడం సమంజసం కాదు. విద్యా శాఖ మీదే రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉంది. విద్యా శాఖను ఉన్నత విద్యావంతుడైన యువనేతకు అప్పగించాలి.

-పుట్లూరి రాంనర్సింహా రెడ్డి, నల్లగొండ జిల్లా

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రజాచైతన్యమే పరిష్కారం

**సినిమా యాక్టర్‌లు రాజకీయాల్లోకి రాకూడదని, రారాదని చెప్పడం లేదు. స్వతంత్ర భారతావనిలో భారత పౌరులు ఎవరైనా రాజకీయ రంగంలో ప్రవేశించవచ్చు. అందులోనూ కళామతల్లికి వారు చేస్తున్న సేవలను, ప్రజలకు వారు అందిస్తున్న వినోద విజ్ఞానాన్ని విస్మరించలేం. ఇందులో మరో అభిప్రాయానికి తావులేదు. తాము చేస్తున్న కళాసేవను ఆరాధించే తమ అనుచరుల అభిమానాన్ని ఓట్లుగా మలచి పలనా పార్టీకి ఓటువేయమని చెప్పడం ఎంతవరకు సమంజసమో వారే విజ్ఞతతో ఆలోచించాలి. రాజకీయరంగం రానురాను కలుషితమైపోతున్నది.ప్రజాసేవ,నీతి నిజాయితీ నిస్వార్థం,నిష్పక్షికత లాంటివి దూరంమైపోతున్నాయి. ప్రజల్లో చైతన్యం వస్తే తప్ప ఈ పరిస్థితుల్లో మార్పు వచ్చే అవకాశాలు కన్పించడంలేదు..**

దామెర్ల సాయిబాబ

పాలకులు వ్యాపారులైతే ప్రజలు బికారులు అవుతారనే చాణక్యనీతిని విస్మరించారు. ప్రజాసంక్షేమంపై తీవ్ర దుష్ప్రభావాలు చూపుతాయని ఆనాడే చాణక్యుడు హెచ్చరిం చారు. అప్పట్లో రాజులు కూడా వ్యాపారంగంలో ప్రవేశిస్తే ప్రజలకు మేలు జరుగుతుందనే ప్రతిపాదనను చాణక్యుడు పూర్తిగా వ్యతిరేకిస్తూ అదే జరిగితే అందులో అక్రమాలకు, అవకతవకలకు ఎవరు అడ్డువచ్చేవారు?ఎవరు నియంత్రిస్తా రు? అయినా అభ్యంతరం వ్యక్తంచేశారు. అదే జరిగితే ప్రజ లు బికారులు అవుతారని చాణక్యుడు స్పష్టంచేశారు. అది అప్పటికీ,ఇప్పటికీ అక్షరసత్యం. రాజులు పోయారు. రాజరి కాలు అంతరించాయి. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులే ప్రభువులు అయ్యారు. ప్రజాక్షేమంతోపాటు సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాలు ఎన్నో ప్రవేశపెట్టి ప్రజా అవసరాల ను తీర్చేందుకు, పర్యవేక్షించేందుకు నిబంధనలు, చట్టా లను రూపొందించుకున్నారు. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత చాలా కాలం పాటు రాజకీయ నేతలు వ్యాపారాల్లో భాగ స్వాములు అయ్యేవారు కాదు. కాంట్రాక్టులు ముఖ్యంగా మద్యం వంటి వ్యాపారాలకు దూరంగా ఉండేవారు. వ్యాపా రాల్లో కల్తీ, అవినీతి, అవకతవకలు జరిగితే అవి మట్టు ముట్టి తమ రాజకీయ జీవితానికి పరిసమాప్తం పలుకు తాయనే భయం ఉండేది. చట్టపరంగా కూడా రాజ్యాంగం లో కొన్ని నిబంధనలను మన రాజ్యాంగ నిర్మాతలు విధిం చారు. కానీ పరిస్థితులు మారిపోయాయి. లాభసాటిగా ఉన్న వ్యాపారాల్లో పరోక్షంగానో, ప్రత్యక్షంగానో కొందరు రాజకీయ నాయకులు భాగస్వామ్యులౌతున్నారు. అసలు రాజకీయమే వ్యాపకంగా జీవనం సాగించే రాజకీయ నాయ కులు కనుమరుగైపోయారు. ఎన్నికల వ్యయం కూడా అంచనాలకు అందకుండా పెరిగిపోయింది. పెట్టుబడి, తిరిగి సంపాదన, మళ్లీపెట్టుబడి సంపాదన అన్నట్టుగా రాజకీ యాలు ఒక విషవలయంగా మారిపోయాయి. తెలుగురాష్ట్రా ల్లో కానీ, దేశంలోకానీ పెరుగుతున్న అవినీతికి ప్రధానంగా కారణాల్లో ఇదికూడా ఒకటి. ఏ కుంభకోణాన్ని అయినా తీసుకోండి పరోక్షంగానో, ప్రత్యక్షంగానో ఏదో ఒక రాజకీయ నాయకుడికి సంబంధం ఉంటున్నది. అందులో కొన్ని మాత్రమే బయటకు వస్తున్నాయి. వెలుగు చూసిన ఆ కుంభకోణాల్లో కోట్లాది రూపాయలు ప్రజాధనం కొల్లగొట్టి నట్లు బయటపడినా బాధ్యులైన నేతలను జైళ్లకు పంపినా దోచుకున్న డబ్బులు తిరిగి రాబట్టు కోలేకపోతున్నారు. ప్రజారోగ్యంపై దాడి చేస్తున్న కల్తీ భూతం గురించి అందరికి తెలిసిందే. పెట్రోల్‌నే తీసుకుందాం. ఎంత పెద్దఎత్తున కల్తీ జరుగుతున్నదో జగమెరిగిన సత్యం. పెట్రోలులో కల్తీ వల్ల వినియోగదారుడికి జరుగుతున్న నష్టం గురించి అటుంచితే కాలుష్యం ఎంతగా వెదజల్లుతున్నదో, ఎన్నో కోట్ల మంది ప్రజల ఆరోగ్యాన్ని బలితీసుకుంటున్నదో అంచనాలకే అంద దనే విషయం వైద్యనిపుణులే అంగీకరిస్తున్నారు. ఆ పెట్రోల్ బంక్‌లు ఎవరివి? ఎవరు పేరుమీద నడుస్తున్నా యి? వెనుక ఉన్న పెద్దలు ఎవరు? ఆయా ప్రాంతాల ప్రజలకు తెలియని విషయాలు ఏమీ కావు. అంతా బహిరంగ రహస్యమే. ఇక కాంట్రాక్టర్లు కోట్లాది రూపాయల వ్యయంతో చేపడుతున్న పథకాల పనుల్లో కాంట్రాక్టర్లు ఎవరు? ఏ రాజకీయ నాయకుడికి ఏయే కాంట్రాక్టులు ఉన్నాయో తెలియని విషయాలు ఏమీ కావు. లాభసాటిగా ఉన్న గోదాముల కేటాయింపులనే తీసుకోండి ఎవరి పేరు మీద ఉన్నాయో జగమెరిగిన సత్యమే. ఢిల్లీ లిక్కర్ స్కామ్ భాగోతంలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. కోట్లాది రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలతో కాదు కేసులు కూడా నమోదయ్యాయి. కేసులు న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్నాయి. మరోపక్క కల్తీభూతం ప్రజారోగ్యా న్ని కబళిస్తున్నది. దేశవ్యాప్తంగా కోట్లాదిమంది అనారోగ్యా

## ఒక్క మాట

నికి గురై మంచానికే పరిమితమై కృంగికృశించి అసువులు బాస్తున్నారు. ఇక అన్నింటికంటే ముఖ్యంగా ఈ ప్రభావం విద్యారంగంపై పడడం కూడా ఆందోళనకరం. ఇది ఇప్పటికి ప్పుడు మొదలైందని చెప్పడం లేదు.ఏనాడో మొదలై రాను రాను విస్తరిస్తుండడం ఆందోళనకరం. తమ వ్యాపారాల కోసం కొందరు నేతలు నైతిక విలువలకు తిలోదకాలిస్తూ రాత్రికిరాత్రే పార్టీలు మారుస్తున్నారు. నిబంధనలు గాలికి వదిలి కప్పదాట్లకు పాల్పడుతున్నారు. వారికి కావల్సింది వారి వ్యాపారాభివృద్ధి, ఆస్తుల పరిరక్షణే ధ్యేయం. అందుకు అనుగుణంగా అడుగులు వేస్తున్నారు. పేర్లు రాసి వారిని ఇబ్బంది పెట్టడం ఎందుకు కానీ పార్టీ అధికారం కోల్పోగానే క్షణం ఆలోచించకుండా అధికారంలో ఉన్న పార్టీలోకి దూకే పెద్దలెందరినో చూస్తున్నాం. ఇలాంటి ఫిరాయింపుదారుల ను, నియోరిచ్ కుబేరులను వ్యాపారులను పార్టీలు కూడా రెడ్‌కార్పెట్ పరిచి ఆహ్వానించి అందలమెక్కిస్తున్నాయి. ఆ పార్టీ ఈపార్టీ అని కాదు దాదాపు అన్ని పార్టీలదీ ఇదే పరి స్థితి. వారి కుటుంబ సభ్యులను కూడా తమ వారసులుగా రాజకీయ అరంగేట్రం చేయిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఆ పార్టీలోనే ఉండి ఏళ్లతరబడి పార్టీ జెండామోస్తున్న కార్య కర్తల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతున్నది. కూడు, గుడ్డ అడక్కపోతే బిడ్డను సాకినట్లు సాకుతామని అన్నట్లుగా ఉంది కార్యకర్తల పట్ల కొన్ని రాజకీయ పార్టీల నేతలవైఖరి. శిక్షణా తరగతులు అంటారు. రాస్తారోకోలు అంటారు. ఛలో కార్యక్రమాలు అంటారు. సమావేశాలకు, సభలకు జనాన్ని తరలించుకురావాలంటారు. తీరా ఎన్నికల్లో లేక ఏదైనా పద వుల ఎంపిక సమయంలో ఈ ఫిరాయింపుదారులు నియో రిచ్ కుబేరులు ప్రత్యక్షమై తన్నుకుపోతున్నారు. పైకి ఏమన లేకపోయినా జీతభత్యం లేని సేవలు ఎన్నాళ్లనే వారిసంఖ్య పెరిగిపోతున్నది. అందుకే కొన్ని పార్టీల్లో దిగువస్థాయి కార్య కర్తలు, రెండూ, మూడు స్థాయి నాయకులు తగ్గిపోతున్నా రు. అయితే ఏనాటికైనా తమ సేవలు గుర్తించకపోతారా? ఏదో ఒక పదవి రాకుండాపోతుందా? అనే ఆశతో కొందరు ఈ రాజకీయ యజ్ఞంలో పోరాటం చేస్తూ ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. దీనికితోడు ఇటీవల కాలంలో సినిమా గ్లామర్ కూడా తోడవుతున్నది. గతంలో లేదనికాదు, రాను రాను పెరిగిపోతుండడం కొందరు నాయకులుసైతం ఆమో దయంలో పడుతున్నారు. పొరుగునున్న తమిళనాడులో చూస్తున్నాం. తమిళ రాజకీయాలన్నీ సినిమా రంగం చుట్టే తిరుగుతున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కూడా విస్తరిస్తు న్నాయి. కేంద్ర పెద్దలు కూడా వారిని ఎలా ఆకట్టుకోవాలనే ప్రయత్నంలో మునిగితేలుతున్నారు. తెలుగురాష్ట్రాలకు సం బంధించి తెలుగుదేశం పార్టీని స్థాపించి ఆనాడు అధికారం లో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఉన్న వ్యతిరేకతతో తన సినీ గ్లామర్‌ను కలగలిపి ప్రజాభిమానం సంపాదించి అధి కారాన్ని దక్కించుకున్నారు ఎన్టీరామారావు. అంతకుముందు కానీ, ఆతర్వాత కానీ ఎంతోమంది సినిమా రంగానికి సం బంధించిన వారు రాజకీయాల్లోకి వచ్చినా తమ పరిధిలో వ్యవహరించేవారు. తమ వారసుల భారం ప్రజలపై మోప లేదు. ఒంగోలు పార్లమెంటు స్థానానికి సినీనటుడు కొంగర జగ్గయ్య 1967లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొం దారు. అయితే జగ్గయ్య సినీ గ్లామర్‌ను ఉపయోగించుకొని రాజకీయాల్లోకి రాలేదు. సాహిత్యాన్ని ఒక తపస్సుగా ఆరా ధించి రవీంద్రనాథ్ ఠాగూర్ 'గీతాంజలి'ని ఆయన పద్య రూపంలో అనువదించారు.సాహితీ రంగంలో ఆయన ప్రావీ ణ్యతను, విజ్ఞానాన్ని గుర్తించిన ఆనాటి కాంగ్రెస్ నేత కొత్త రఘురామయ్య అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు పరిచయం చేయడంతో ఆయన జోక్యం చేసుకొని టిక్కెట్టు కేటాయించారు. జగ్గయ్య రాజకీయరంగ ప్రవేశం ఆనాడు ఎలాంటి హంగామా జరగలేదు. అలాగే పదవీకాలం అనం తరం నిశ్శబ్దంగా రాజకీయాల నుంచి నిష్క్రమించారు. తమ వారసులుగా తమ కుటుంబ సభ్యులను ఎవరినీ ఆ ప్రాంత ప్రజల నెత్తిపై పెట్టేందుకు ప్రయత్నించలేదు. తన ఎన్నికల ప్రచారం కోసం ఏ సినిమా యాక్టర్‌ను రమ్మని కోరలేదు. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. అగ్రనటులు అటుంచి ప్రజ ల్లో కొద్దోగొప్పో పేరున్న చిన్నాచితక నటులను కూడా ప్రజ లను ఆకర్షించడంలో ఎలా ఉపయోగించుకోవాలనే ఆరా టంలో రాజకీయ పార్టీలు పోటీపడుతుండడం దురదృష్ట కరం. సినిమా యాక్టర్‌లు రాజకీయాల్లోకి రాకూడదని, రారాదని చెప్పడం లేదు. స్వతంత్ర భారతావనిలో భారత పౌరులు ఎవరైనా రాజకీయ రంగంలో ప్రవేశించవచ్చు. అం దులోనూ కళామతల్లికి వారు చేస్తున్న సేవలను, ప్రజలకు వారు అందిస్తున్న వినోద విజ్ఞానాన్ని విస్మరించలేం. ఇందు లో మరో అభిప్రాయానికి తావులేదు. తాము చేస్తున్న కళా సేవను ఆరాధించే తమ అనుచరుల అభిమానాన్ని ఓట్లుగా మలచి పలనా పార్టీకి ఓటువేయమని చెప్పడం ఎంతవరకు సమంజసమో వారే విజ్ఞతతో ఆలోచించాలి. రాజకీయరం గం రానురాను కలుషితమైపోతున్నది. ప్రజాసేవ, నీతి, నిజాయితీ, నిస్వార్థం, నిష్పక్షికత లాంటివి దూరంమైపో తున్నాయి. ప్రజల్లో చైతన్యం వస్తే తప్ప ఈ పరిస్థితుల్లో మార్పు వచ్చే అవకాశాలు కన్పించడంలేదు. ●

# పెరుగుతున్న ధరలను నియంత్రించలేరా?

బుగ్గన మధుసూదనరెడ్డి,

అసలే ఈ మధ్యకాలంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటడంతో తీవ్ర ఇక్కట్ల పాలు అవుతున్న పేద, సామాన్య, మధ్యతరగతి వర్గాలపై గ్యాస్ సిలిండర్ ధర మోత, వడ్డన రూపంలో మరో గుది బండను మోపారు కేంద్ర ప్రభుత్వం వారు. గ్యాస్ సిలిండర్ ధరను తప్పనిసరి పరిస్థితుల్లో ఏ 5 రూపాయలో, 10 రూపాయలో పెంచితే పర్వాలేదు. కానీ ఏకంగా 50 రూపాయలు పెంచడంతో 860 రూపాయలు వున్న గ్యాస్‌సిలిండర్ ధర 910 రూపా యలు చేరుకోవడమే కాదు డోర్ డెలివరీతో 960 రూపాయ లకు చేరుకోవడంతో ఒక్కసారిగా పేద, సామాన్య, మధ్య తరగతి వర్గాల ప్రజల గుండెల్లో గుణపాలు దిగినట్లయింది. దీంతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది గ్యాస్ కనెక్షన్ వున్న వారి తలపై పెనుభారం పడనుంది. ఇదివరకు సైతం కేంద్రప్రభుత్వం వారు ఇలాగే గ్యాస్ సిలిండర్ ధరను పెంచి పేద, సామాన్య, మధ్యతరగతి వర్గాల జీవితాలతో ఆటలా డుకున్న వైనం మనందరికీ తెలిసిన విషయమే. అయితే ఏ మాత్రం జాలి, దయ, కరుణ చూపించకుండా మరో మారు 50 రూపాయల మేర కేంద్రప్రభుత్వం వారు గ్యాస్ సిలిం డర్ ధరను పెంచి పేద, సామాన్య, మధ్యతరగతి వర్గాల వారిని కొంత మేర దెబ్బతీశారు అనే మాట సత్యదూరం కాదు. దీనికి తోడు కేంద్రప్రభుత్వం వారు సిలిండర్ పై కేవలం రూ.44.62 మాత్రమే సబ్సిడీ ఇస్తుండటం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. ఎందుకంటే కూలి పను లకు వెళ్లే కుటుంబాలు సైతం గ్యాస్‌ను వినియోగిస్తూ వంటలు తయారు చేసుకుంటున్న నేపథ్యంలో ఈ గ్యాస్ సిలిండర్ ధర బాదుడుతో వారిపై మరింతగా పెనుభారం




పడనుంది అనడంలో ఎలాంటి సందేహానికి తావు లేదు. ఏదిఏమైనా కేంద్రప్రభుత్వం వారు కంకణం కట్టుకొని మరీ ఇలా గ్యాస్ సిలిండర్ ధరను దశల వారీగా పెంచుకుంటూ పోతే అల్ప ఆదాయం మాత్రమే గల పేద,సామాన్య, మధ్య తరగతి వర్గాలు ఒక్కసారిగా కూదేలు అయ్యే ప్రమాదం పొంచి వుంది. అసలే నిత్యావసర వస్తువుల ధరలు అడ్డు, అదుపు లేకుండా పెరగడం మూలాన పేద, సామాన్య, మధ్యతరగతి వర్గాల వారు అయితే మూడు పూటలా తిండి తినాలంటేనే బెంబేలు పడిపోయే దయనీయ స్థితి ఉత్పన్న మవుతున్నది అనే మాట సత్య దూరం కాదు. ఏమైనా ఇప్పటికయినా కేంద్రప్రభుత్వం వారు నిద్రాణావస్థ నుండి మేల్కొని మానవతా దృక్పథంతో ఆలోచించి పెరిగిన గ్యాస్ సిలిండర్ ధరను తక్షణమే యుద్ధప్రాతిపదికన తగ్గించి పేద, సామాన్య, మధ్యతరగతి వర్గాల వారికి కాస్తంతా వెసులు బాటు కల్పించాల్సిన గురుతర బాధ్యత ముమ్మాటికీ కేంద్ర ప్రభుత్వం వారిదే. ఎందుకంటే గరీబ్ హటావో దేశ్ బచావో అనే నీతి సూత్రానికి కేంద్రప్రభుత్వం వారు కట్టుబడి,ఒక మెట్టు క్రిందకు దిగి వచ్చి పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను తగ్గించకపోతే మాత్రం పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజ ల ఆర్థిక స్థితిగతులను అత్యంత బలవంతంగా, అజమా యిషితో నామ రూపాల్లేకుండా చేసిన ఘనతను కేంద్రప్రభు త్వం వారు తమ సొంతంచేసుకోవడం తథ్యం.పెంచినగ్యాస్ సిలిండర్ ధరను తక్షణమే కేంద్రప్రభుత్వం వారు తగ్గించి పేద, సామాన్య, మధ్యతరగతి వర్గాల ప్రజలనుఆదుకోవాలి. లేకపోతే వారి విలువైన జీవితాలు అధోగతి పాలే. ఒక వైపుఏమో నిత్యావసర వస్తువుల ధరలు అదుపు తప్పడం మరోవైపు గ్యాస్ సిలిండర్ ధర తన విశ్వరూపం చూపడం వెరసివారి ఎంతో అమూల్యమైన జీవితాలు ఇక నరకప్రాయ మే అనడంలో ఎలాంటి సందేహానికి తావులేదు. ●

# గ్రూప్1 పోరాటం రావణ కాష్టం

సంపతి రమేష్

రాష్ట్రంలో ఉన్నతమైన పరిపాలన ఉద్యోగంగా గ్రూప్ 1ను భావిస్తారు. మెజార్టీ నిరుద్యోగులు ఆ సర్వీస్ సాధించాలని కృషి చేస్తుంటారు. ఈ క్రమంలో మూడేళ్ల కింద వేసిన గ్రూప్ 1 నోటిఫికేషన్ అనేక అవాంతరాలను ఎదుర్కొంటూ గత ఏడాది మెయిన్స్ పరీక్ష నిర్వహించడం జరిగింది. ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్ సెలక్షన్‌లో సామాజిక న్యాయానికి విరుద్ధంగా జీవో 29ను తీసుకురావడం జరి గింది. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమం జరి గింది. కోర్టులో కేసులు కూడా వేయడం జరిగింది. అయిన ప్పటికీ ప్రభుత్వం మొండి వైఖరితో ముందుకెళ్లి మెయిన్స్ పరీక్ష నిర్వహించింది. ఇప్పుడు మెయిన్స్ పరీక్ష అనంతరం తుది ఫలితాలు విడుదల చేసింది. ఇక్కడ కూడా గందరగోళ పరిస్థితులను నెలకొన్నాయి. పరీక్ష ఫలితాల్లో దాదాపు 80 నుంచి 90 శాతం వరకు ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు అధిక మార్కులు రావడం జరిగింది. వారికే సర్వీస్ వచ్చే అవకాశాలు ఎక్కువ ఉన్నాయి. తెలుగు మీడియం విద్యా ర్థులలో కేవలం 10 నుంచి 20 శాతం వరకే సర్వీస్ వచ్చే విధంగా మార్కులు వచ్చాయి. అంటే గ్రూప్ 1 మెయిన్స్ పరీక్ష మూల్యాంకనంలో భారీ లోటుపాట్లు జరిగాయని పలువురు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. మరోవైపు హైకోర్టు లో కేసులు కూడావేశారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీస్తుంది. అంతేకాకుండా భారీ స్కాం కూడా జరిగిందని ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. మరి దీనంతటినిచూస్తే అసలు గ్రూప్ 1 నియామకంలో పారదర్శకత ఏ మేరకుంద నేది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పుడు గ్రూప్ 1మెయిన్స్ రాసిన వేలాది మంది విద్యార్థులు నైరాశ్యంలోకి వెళ్లారు. దీని ప్రభావం తెలుగు మీడియం విద్యార్థులపై చాలాఉంది. ప్రతిష్టాత్మకంగా భావించిన గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలో విద్యార్థులకు పెద్ద ఎదురు దెబ్బతగిలింది. ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్ సెలక్షన్లో జీవో 29 తీసుకురావడమే దీనికి కార ణం. ముఖ్యంగా జీవో 29తీసుకువచ్చి సామాజిక రిజర్వే షన్లకు తూట్లు పొడిచారు. దీని ద్వారా ముఖ్యంగా ఎస్సీ ఎస్టీలకు అన్యాయం జరిగింది. వీరికి అదనంగా ఎలాంటి లాభం జరగలేదు. జీవో 29 ప్రభావం చివరకు మెయిన్స్ నుంచి తుది ఫలితాలపై కూడా పడింది. ఇక్కడ సామాజిక వర్గాల వారీగా సెలక్షన్స్ తగ్గిపోయాయి.ఓపెన్ అభ్యర్థులకు ఎక్కువ అవకాశాలు ఏర్పడ్డాయి. టాప్ 100లో ఎస్సీ ఎస్టీ సెలక్షన్స్ వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు. బీసీలలో కూడా అంత గా లేరు. నాన్‌లోకల్ వారికి అవకాశాలు పెరిగాయి. ఇంత ప్రభావాన్ని చూపిన జీవో 29పై అటు ప్రభుత్వం, ఇటు కోర్టులలో చర్చకురాకపోవడం విస్మయంకలిగిస్తుంది. చట్టా లు, శాసనాల రాజ్యాంగ బద్ధతను ప్రశ్నించే కోర్టులు జీవో



29పై చర్చించకపోవడం అభ్యర్థుల్లో కోర్టులపై నమ్మకం సన్నగిల్లుతుంది. ఇప్పటికే జీవో 29రద్దు చేయాలని ఢిల్లీలో గత కొన్నిరోజులుగా విద్యార్థులు ధర్నా చేస్తున్నారు. కావున ఎన్నో రోజులుగా పోరాటం చేస్తున్న జీవో 29ను రద్దుచేసి పాత జీవో అయిన జీవో55 ప్రకారం మెయిన్ సెలక్షన్ లిస్ట్ తీయాలని డిమాండ్ చేస్తున్నారు.అప్పుడే సామాజికన్యాయం చేకూరుతుంది. తెలంగాణప్రాంతంలో తెలుగు అధికారికభాష గా ఉంది. దాదాపు 40శాతంమంది విద్యార్థులు గ్రూప్1 మెయిన్స్ పరీక్షలు తెలుగులో రాశారు. కానీ చివరికి ఫైనల్ సెలక్షన్ వచ్చేసరికి కేవలం 10నుంచి 20శాతం మాత్రమే తెలుగు మీడియం విద్యార్థులు ఎంపికయ్యే అవకాశం ఉండ డం ఆందోళన కలిగిస్తుంది. మెజార్టీ ఇంగ్లీష్‌మీడియం విద్యా ర్థులు ఎంపిక కావడం పలు అనుమానాలకు దారితీస్తుంది. ముఖ్యంగా ఇక్కడ మూల్యాంకనం సరిగ్గాజరిగిందా? జరగ లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. కేవలం మూడు నెలల సమయంలోనే 21వేలమంది విద్యార్థుల పేపర్లు ఎలా దిద్దా రు అనేది కూడా ప్రశ్నార్థకంగా మారింది.మరోవైపు కొందరు పక్కపక్కన ఉన్న విద్యార్థులకు ఒకేరకమైన మార్కులు రావ డం, కొన్ని ఎగ్జామ్స్ సెంటర్లోనే అత్యధిక మార్కులు రావడం వంటి సంఘటన పలు అనుమానాలకు దారితీయడం జరు గుతుంది. వాస్తవ ఫలితాలను చూస్తే అదే కనబడుతుంది. నామమాత్రం రాసిన సగటు ఇంగ్లీష్ మీడియం అభ్యర్థికి వచ్చిన మార్కుల కన్నా ఎంతో విశ్లేషణాత్మకంగా రాసిన తెలుగుమీడియం అభ్యర్థులకు రాకపోవడం విస్మయం కలిగి స్తుంది. అంతేకాకుండా ఉర్దూమీడియంలో రాసిన 13మంది విద్యార్థుల్లో దాదాపు 6 నుంచి 7గురు విద్యార్థులకు సర్వీస్ వచ్చే అవకాశాలు కనబడుతున్నాయి. అసలు కొన్ని సబ్జెక్టుల లో తెలుగు మీడియంలో మెటీరియల్ లభించడమేగగనంగా మారింది. ముఖ్యంగా సైన్స్ అండ్ టెక్నాలజీ, గవర్నెన్స్, పర్యావరణంలో సరైన మెటీరియల్ తెలుగులో ఇప్పటికీ లేదు. అలాంటిది ఉర్దూమీడియం వాళ్లకు ఎలాలభించింది? యూపిఎస్‌సి సివిల్ సర్వీస్ మెయిన్స్‌లో 50శాతం మార్కు లు దాటడమే కష్టం. అలాంటిది టీజీపీఎస్సీ మూల్యాంక నంలో 60శాతం మార్కులు దాటడం లోపభూయిష్టమైన మూల్యాంకనానికి నిదర్శనం. మెయిన్స్ పరీక్ష అనేది అభ్య ర్థుల జీవితాలను తీర్చిదిద్దే. అలాంటిది ఇష్టారీతిన జరిగిన మూల్యాంకనం వల్ల మెజార్టీ అభ్యర్థులు నష్టపోయారు. ముఖ్యంగా తెలుగు మీడియం వాళ్లకు తీవ్రనష్టం జరిగింది. భవిష్యత్తులో తెలుగులో గ్రూప్1 రాయాలంటే భయపడుతు న్నారు. కావున ప్రస్తుతం విద్యార్థులకు న్యాయం చేయాల్సి న అవసరం ఎంతైనాఉంది. ఎందుకంటే ఒక 12 సంవత్స రాల తర్వాత గ్రూప్ 1 నోటిఫికేషన్ పడింది. మంచి పోస్టు లతో వేసిన ఈ నోటిఫికేషన్‌లో ఉదారమైన మార్కులతో నాణ్యత లేని విద్యార్థులకు సర్వీసు అప్పచెపితే తీవ్ర నష్టం జరుగుతుంది. గ్రూప్ 1వంటి పరీక్షకు విలువ తగ్గిపోతుంది. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి నిరుద్యోగుల పక్షాన నిల బడాలి. మంచి ప్రమాణాలతో మూల్యాంకన వ్యవస్థలో మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. ●

# అమెరికాపై చైనా 125%సుంకాలు



**బీజింగ్, ఏప్రిల్ 11:** యూఎస్ చైనా మధ్య వాణిజ్యయుద్ధం మరింత ముదురుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనా ఎగుమతులపై 145 శాతం విధించినందుకు ప్రతీకారంగా, చైనా శుక్రవారం అమెరికా దిగుమతులపై సుంకాలను ఏకంగా 125శాతానికి పెంచింది. ఇంతకు ముందు అమెరికన్ దిగుమతులపై చైనా 84 శాతం వరకు సుంకాలు విధించింది. దీనితో యూఎస్ దిగుమతులపై చైనా కొన్ని ఆంక్షలు విధించింది. తరువాత ఈ సమస్య పరిష్కారానికి డొనాల్డ్ ట్రంప్‌తో చర్చలు జరపడానికి కూడా సిద్ధమైంది. అయితే ట్రంప్ మొండి వైఖరితో చైనా తీరులో మార్పు వచ్చింది. తాము ఎక్కడా తగ్గబోమని స్పష్టం చేసింది. తాజాగా అమెరికా దిగుమతులపై సుంకాలను 125 శాతానికి పెంచినట్లు చైనా వాణిజ్య మంత్రిత్వశాఖ తెలిపింది. అమెరికా సుంకాలు పెంచడంపై తాము కూడా డబ్ల్యూటీఓలో దావా వేసినట్లు చైనా వాణిజ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది. తాజా అమెరికా టారిఫ్ నోటిఫికేషన్ ప్రకారం, చైనాపై మొత్తం వాణిజ్య సుంకాలు 145 శాతంగా ఉన్నాయి. వాస్తవానికి ట్రంప్ చైనా, భారత్‌తో సహా చాలా దేశాలపై ప్రతీకార సుంకాలు విధించారు. కానీ ఏ దేశం కూడా యూఎస్‌పై ప్రతీకార సుంకాలు విధించేందుకు సిద్ధపడలేదు. కానీ ఒక్క చైనా మాత్రం అమెరికాను ఢీకొంటూ పోటాపోటీగా ప్రతీకార సుంకాలు విధిస్తోంది. రెండు దేశాలూ పోటాపోటీగా ఒకరిపై ఒకరు సుంకాలు విధించుకుంటున్నాయి. డ్రాగన్‌పై అమెరికా 145 శాతం ప్రతీకార సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ఇక ట్రంప్ బెదిరింపులకు చైనా సైతం ఏమాత్రం వెనకడుగు వేయట్లేదు. అగ్రరాజ్యంపై ప్రతీకార సుంకాలతో దాడి చేస్తోంది. గతంలో అమెరికా దిగుమతులపై సుంకాలు 84 శాతానికి పెంచిన డ్రాగన్.. ఇప్పుడు మరింత పెంచింది. అమెరికాపై 125 శాతం సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించింది. గత మార్చి వరకు చైనా వస్తువులపై అమెరికా 10 శాతం సుంకాన్ని విధించింది. ఇటీవల పెంచిన పన్నుతో ఇది 54 శాతానికి చేరుకున్నది. దీనిపై డ్రాగన్ దీటుగా స్పందించింది. ఆ దేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 34 శాతం అదనపు సుంకం విధించాలని నిర్ణయించింది దీనిపై ఆగ్రహించిన ట్రంప్ టారిఫ్‌ల విషయంలో వెనక్కి తగ్గాలంటూ డ్రాగన్‌కు వార్నింగ్ ఇచ్చారు. మరో 50 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో టారిఫ్‌లు 104 శాతానికి చేరాయి. అయినా చైనా వెనక్కి తగ్గలేదు. అమెరికాపై 84 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు ప్రకటించింది. ట్రంప్ హెచ్చరికలను చైనా పెడచెవిన పెట్టడంతో మళ్లీ అదనపు సుంకాల పోటు తప్పలేదు. చైనా నిర్ణయంతో ట్రంప్ బుధవారం మరో 21 శాతం బాదారు. దీంతో చైనాపై ప్రతీకార సుంకాలు 125శాతానికి చేరింది. ఇక ఫెంటానిల్ అక్రమ రవాణాలో చైనా పాత్ర ఉందన్న ఆరోపణలకుగాను ప్రత్యేకంగా 20 శాతం సుంకాలు విధించడంతో మొత్తం టారిఫ్‌లు 145 శాతానికి చేరింది. మొత్తానికి ఈ పరస్పర సుంకాలతో ఇరుదేశాల మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధం మరింత పెరిగినట్లయింది. మరోవైపు అమెరికాసుంకాల యుద్ధమే చేయాలనుకుంటే తుదివరకూ తామూ పోరాడతామని చైనా స్పష్టంచేసిన విషయం తెలిసిందే. అమెరికా చర్చలకు రావాలంటే తమ తలుపులు తెరిచే ఉంటాయని వెల్లడించింది. తాము ఘర్షణకు ప్రయత్నించబోమని, ఎలాంటి ఒత్తిడిని ఎదుర్కోవడానికైనా వెనుకాడబోమని స్పష్టం చేసింది. 'చైనా వైఖరిస్పష్టంగా, స్థిరంగా ఉంది. కవ్వింపు చర్యలకు భయపడం. అమెరికా మాట్లాడాలనుకుంటే మా తలుపులు తెరిచే ఉంటాయి. కానీ పరస్పర గౌర వం, సమానత్వం ఆధారంగా సంభాషణ జరగాలి. చైనాతో డీల్ చేయాలంటే ఒత్తిడి, బెదిరింపులు, బ్లాక్‌మెయిల్ వంటివి పనిచేయవు' అని చైనా వాణిజ్య మంత్రిత్వశాఖ ప్రతినిధి హి యోంగ్కియాన్ అన్నారు.



## ఇడికి ప్రాథమిక హక్కుంటే..
# జనం గురించి ఆలోచించాలి: సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)కు ప్రాథమిక హక్కులుంటే.. ప్రజల ప్రాథమిక హక్కుల గురించి కూడా ఆలోచించాలని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. నాగరిక్ అపుర్తి నిగమ్ (ఎన్ఎఎన్) స్కామ్ దర్యాప్తును ఛత్తీస్‌గఢ్ నుంచి ఢిల్లీకి బదలీ చేయాలని ఇడి దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 అనేది వ్యక్తుల ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లిన సమయంలో కోర్టులను ఆశ్రయించి వాటిని పునరుద్ధరించుకోవడానికి అవకాశం కల్పిస్తుందని బెంచ్ పేర్కొంది. రాజ్యాంగం ద్వారా పరిష్కారాలు పొందే హక్కును కల్పిస్తుందని గుర్తు చేసింది. బెంచ్ ఈ వ్యాఖ్యలు చేసిన తర్వాత సోలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు స్పందిస్తూ పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతి కోరారు. అదే సమయంలో మాట్లాడుతూ 'ఇడికి కూడా ప్రాథమిక హక్కులు ఉంటాయి' అని వ్యాఖ్యానించారు. దీనికి బెంచ్ స్పందిస్తూ 'ఇడికి ప్రాథమిక హక్కులు ఉంటే.. అది ప్రజల ప్రాథమిక హక్కుల గురించి కూడా ఆలోచించాలి.' అని చురకలు అంటించి.. పిటిషన్ ఉపసంహరణకు అనుమతించింది. ఈ కేసులో నిందితుడైన మాజీ ఐఎఎస్ అధికారికి గతేడాది మంజూరైన ముందస్తు బెయిల్ దుర్వినియోగమైందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆరోపించింది. దీనికి తోడు ఆ రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన కొన్ని ఏజెన్సీలు ఓ హైకోర్టు జడ్జితో టచ్‌లో ఉంటున్నాయని పేర్కొంది. దీంతో మనీలాండరింగ్ కేసులోని కొందరు నిందితులకు న్యాయపరంగా ఉపశమనం కల్పిస్తున్నాయని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. అప్పట్లో ఈ ఆరోపణలు సంచలనం సృష్టించాయి. ఈ కేసులో అత్యున్నత స్థాయి వ్యక్తులకు కేటాయించిన ముందస్తు బెయిళ్లను కూడా రద్దు చేయాలని ఇడి కోరుతోంది. దీంతోపాటు కేసును ఢిల్లీకి బదలీ చేయాలని పిటిషన్ దాఖలు చేసింది. ఛత్తీస్‌గఢ్‌లో ప్రజా పంపిణీ వ్యవస్థ కార్యక్రమాలను పర్యవేక్షించే నాగరిక్ అపుర్తి నిగమ్ కార్యాలయాలపై 2015లో రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ దాడులు చేసి, రూ. 3.6కోట్ల నగదు స్వాధీనం చేసుకొంది. బియ్యం నమూనాలు చాలా నాసిరకంగా ఉన్నట్లు గుర్తించింది. అవి అసలు మనుషులు తినేలా లేవని తేల్చింది. నాడు ఈ సంస్థకు అనిల్ తుతేజా ఛైర్‌పర్సన్‌గా ఉన్నారు.




## ప్రపంచదేశాలపై టెక్నాలజీ, టారిఫ్‌ల ప్రభావం:జైశంకర్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:** ప్రపంచ భౌగోళిక రాజకీయాల్లో రెండు టీలు కీలకంగా పనిచేస్తున్నాయని విదేశాంగమంత్రి జైశంకర్ అన్నారు. టెక్నాలజీ, ట్యారిఫ్‌లపై ఆయన వ్యంగ్యోక్తులు విసిరారు. మారుతున్న పరిస్థితుల క్రమంలో టిపదం చర్చించేందుకు సమావేశం అయ్యామన్నారు. ప్రపంచంతో అనుసంధానమయ్యే విధానాన్ని యుఎస్ ప్రాథమికంగా మార్చేసింది. దాంతోప్రపంచంపై దానిపరిణామాలుకూడా ఉంటాయి. ముఖ్యంగా టెక్నాలజీరంగంలో అవి మరింత తీవ్రంగా ఉంటాయి. అమెరికా అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండటం ఒకటే అందుకు కారణంకాదు. దాంతోపాటు ఆదేశ సాంకేతిక పురోగతి అత్యంతకీలకం. అమెరికాను మళ్లీ గొప్పగా మార్చడంలో టెక్నాలజీ కీలకంగా పనిచేస్తోందన్నారు. అందుకే మేక్ అమెరికా గ్రేట్ అగైన్(మాగా)కు టెక్‌కు మధ్య సంబంధంఉంది. 2016 నుంచి 2020 వరకూ ఇది అంత స్పష్టంగా లేదని అన్నారు. చైనా స్థిరమైన ఎదుగుదలను ప్రస్తావిస్తూ ఐరోపాలో నెలకొన్న ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు కూడా ప్రస్తావించారు. టారిఫ్=పరంగా ట్రంప్ కఠినవైఖరి ప్రపంచ మార్కెట్లపై ప్రభావం చూపిస్తోందని అన్నిచోట్ల టారిఫ్ పదమే ఘోషిస్తోందన్నారు. అలాగే ఇపుడు సాంకేతికరంగంలో కృత్రిమమేధ ఎక్కువ వినిపిస్తోందని అమెరికా, చైనా పోటాపోటీగా ముందుకు వెళుతున్నాయని, దేశ ఎదుగుదలలో టెక్నాలజీ పాత్ర అత్యంత కీలకమనే ఉద్దేశంలో తాజాగా మంత్రి మాట్లాడారు.

# అత్యాచారఘటనపై ప్రధాని సీరియస్
## కఠిన చర్యలు తీసుకోవాలని వారణాసి కలెక్టర్, ఎస్పీలకు ఆదేశాలు



**వారణాసి, ఏప్రిల్ 11:** ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో చోటుచేసుకున్న దారుణ సామూహిక అత్యాచారఘటన దిగ్భ్రాంతికి గురిచేసిందని ప్రధాని మోడీ అన్నారు. ఆరు రోజులపాటు 23 మంది వ్యక్తులు 19ఏళ్ల యువతిపై అత్యాచారం చేయడం అమానవీయ ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని శుక్రవారం వారణాసి కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసారు. వారణాసికి వచ్చిన వెంటనే ఈఘటనపై మోడీ ఆరా తీసారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదని ఆదేశించారు. గతనెల 29వ తేదీ బాధిత యువతి కొంత మంది స్నేహితులతో కలిసి బయటకు వెళ్లింది. ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. దాంతో సామూహిక అత్యాచారం గురించి వెలుగులోకి వచ్చింది. పోలీసులకు ఆ యువతి వెల్లడించిన వివరాలప్రకారం కొందరు యువకులు తనను పలు హోటళ్లు, హుక్కాబార్లకు తిప్పుతూ అత్యాచారానికి పాల్పడ్డారని చెప్పింది. దర్యాప్తులో పోలీసులు తొమ్మిదిమందిని అరెస్టు చేసారు. కోర్టు వారిని జ్యుడిషియల్ కస్టడీకి పంపించింది. ఇదిలా ఉండగా వారణాసి పర్యటనలో భాగంగా బహిరంగసభలోమోడీ పాల్గొన్నారు. 70 ఏళ్ల దాటిన ముగ్గురులబ్ధిదారులకు ఆయుష్మాన్ కార్డులను అందచేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాశీనాది. నేను కాశీకి చెందినవాడిని అని కార్యకర్తలనుద్దేశించి అన్నారు. వారణాసి మోడీ సొంత నియోజకవర్గం. 2014 నుంచి ఇప్పటివరకూ మూడుసార్లు అక్కడి నుంచి విజయం సాధించారు.



## ఇజ్రాయెల్ దాడులు..
# హమాస్ స్నైపర్ ఫోర్స్ కమాండర్ హాతం

**టెల్అవీవ్, ఏప్రిల్ 11:** గాజాపై ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో పశ్చిమాసియా మళ్లీ అట్టుడుకుతోంది. హమాస్ కీలక ఆయుధ స్థావరాలు, నేతలే లక్ష్యంగా ఇజ్రాయెల్ దళాలు విరుచుకుపడుతున్నాయి. గురువారం ఐడిఎఫ్‌కు చెందిన విమానాలు, డ్రోన్లు, హెలికాప్టర్లు హమాస్‌కు చెందిన 40 స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇందులో హమాస్ స్నైపర్ ఫోర్స్ టెల్ సుల్తాన్ బెటాలియన్ కమాండర్ అహ్మద్ ఐయాద్ మహమ్మద్ ఫర్హాత్ హాతమయినట్లు వెల్లడించారు. మహ్మద్ ఫర్హాత్ హమాస్ ఇజ్రాయెల్‌పై అనేక దాడులకు పథక రచన చేసినట్లు, సైన్యాన్ని ముందుండి నడిపినట్లు తెలుస్తోంది. అతడిని హతమార్చడంలో ఇజ్రాయెల్ మరో విజయం సాధించిందని ఐడిఎఫ్ పేర్కొంది.

రఫా, ఖాన్ యూనిస్, మొరాగ్ కారిడార్ ప్రాంతాల్లో తమ దళాలు దాడులు చేయగా పలువురు హమాస్ కార్యకర్తలు మృతి చెందినట్లు వెల్లడించింది. పెద్ద మొత్తంలో భూగర్భ మౌలిక సదుపాయాలు ధ్వం సమయ్యాయని తెలిపింది. బుధవారం వైమానిక దాడిలో కూడా దాదాపు 40 హమాస్ లక్ష్యాలను నాశనం చేసినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇప్పటికే గాజాలో 50 శాతం భూభాగాన్ని ఆధీనంలోకి తెచ్చు కున్నట్లు పేర్కొంది.

గత 18 నెలలుగా సాగుతున్న గాజా యుద్ధంలో 50వేల మంది పాలస్తీనియన్లు మృతి చెందారు. వీరిలో ఎక్కువ మంది మహిళలు, పిల్లలు. హమాస్ వద్ద ఉన్న ఇజ్రాయెలీ బందీలను విడుదల చేసేంత వరకూ దాడుల తీవ్రత పెంచుతూనే ఉంటామని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది. కాగా పాలస్తీనియన్లకు నిలువ నీడ లేకుండా చేయడమే ధ్యేయంగా మౌలిక సదు పాయాలు మళ్లీ వాడుకోలేని విధంగా తాము ధ్వంసం చేస్తున్నామని అసోసియేటెడ్ ప్రెస్ (ఎపి)కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఐదుగురు ఇజ్రా యెల్ సైనికులు పేర్కొన్న విషయం తెలిసిందే.

# హిందువులపై తమిళమంత్రి అవమానకర వ్యాఖ్యలు

**చెన్నై,ఏప్రిల్ 11:** హిందువులు నుదుట పెట్టుకునే తిలకం ఆచారంపై మంత్రి అసభ్యకర వ్యాఖ్యలు చేశారు. వేశ్యతో ముడిపెట్టి ఒక జోక్ వేశారు. దీంతో ఆ మంత్రిపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో పార్టీ పదవి నుంచి ఆయనను తొలగించారు. తమిళనాడు అటవీ శాఖ మంత్రి, సీనియర్ డీఎంకే నేత కే పొన్ముడి ఇటీవల ఒక బహిరంగ కార్యక్రమంలో మాట్లాడారు. హిందూ మతపరమైన బొట్టును శృంగారంతో ముడిపెట్టారు. 'మహిళలు, దయచేసి అపార్థం చేసుకోకండి. ఒక వ్యక్తి ఒక వేశ్య వద్దకు వెళ్తాడు. అతడు శైవుడా లేదా వైష్ణవుడా అని ఆమె అడిగింది. అతడికి అర్థం కాకపోవడంతో ఆమె స్పష్టత ఇచ్చింది. అడ్డ బొట్టు లేదా నామం వైష్ణవానికి సంబంధించిన నిలువు తిలకం అతడు ధరిస్తాడా అని అడిగింది. ఆ వ్యక్తి శైవుడైతే 'పడుకునే' పొజిషన్, వైష్ణవుడు అయితే 'లేచి నిలబడే' పొజిషన్ ఉంటుందని ఆమె వివరించింది' అని జోక్ వేశారు. కాగా, డీఎంకే మంత్రి పొన్ముడి వివాదస్పద వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తాయి. డీఎంకే ఎంపీ కనిమొళి కూడా ఆయన వ్యాఖ్యలను ఖండించారు. 'మంత్రి పొన్ముడి సంగం ఆమోదయోగ్యం కాదు. ప్రసంగానికి కారణం ఏమైనప్పటికీ, అలాంటి అసభ్యకరమైన వ్యాఖ్యలు ఖండించదగినవి' అని ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. బీజేపీ నాయకురాలు ఖుష్బు సుందర్, సింగర్ చిన్మయి శ్రీపాద తదితరులు ఘాటుగా విమర్శించారు. మరోవైపు డీఎంకే కూడా వేగంగా స్పందించింది. పార్టీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ పదవి నుంచి పొన్ముడిని తొలగించింది. ఆయన స్థానంలో ఎన్ శివను నియమించింది. కాగా, 2011 నాటి ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో పొన్ముడికి విధించిన శిక్షను సుప్రీం కోర్టు గత ఏడాది నిలిపివేసింది. దీంతో సీఎం స్టాలిన్ ఆయనను తిరిగి మంత్రివర్గంలోకి తీసుకున్నారు. అయితే పొన్ముడి వ్యాఖ్యల నేపథ్యంలో పార్టీ పదవి నుంచి ఆయనను తప్పించినప్పటికీ మంత్రి పదవి నుంచి తొలగించలేదు.




## హెలికాప్టర్ ప్రమాదానికి మూలం పెంగ్విన్
### జనవరిలో జరిగిన ప్రమాదంపై దక్షిణాఫ్రికా సిఎఎ నివేదిక

**ఈస్టర్న్‌కేఫ్(సౌతాఫ్రికా), ఏప్రిల్ 11:** హెలికాప్టర్ సుడులు తిరిగుతూ కూలిపోయిన సంఘటనకు ప్రధాన కారణం ఒక పెంగ్విన్ అని దర్యాప్తులో తేలింది. ఈ ఏడాది జనవరి 19న ఈస్టర్న్ కేప్ ప్రాంతంలోని బర్డ్స్ ద్వీపంనుంచి రాబిన్సన్ ఆర్44 రావెన్2 అనే హెలికాప్టర్ పైకి ఎగిరింది. 50 అడుగుల ఎత్తుకు లేవగానే ఒక్కసారిగా అదుపుతప్పి నేలను ఢీకొంది. ఈ ప్రమాదం నుంచి అందులోని ప్రయాణీకులు ప్రాణాలతో బయటపడ్డారు. దక్షిణాఫ్రియా సివిల్ ఏవియేషన్ అథారిటీ దీనిపై దర్యాప్తుచేపట్టింది. ఈ నాలుగు సీట్ల హెలికాప్టర్‌లో పెట్టెలో ఉంచిన పెంగ్విన్ ప్రమాదానికి కారణమని దర్యాప్తు బృందం తేల్చింది. సురక్షితపద్ధతుల్లో ఉంచకపోవడంతోనే ఇదంతా జరిగిందని తేల్చింది. విమానంలో పైలట్ ముగ్గురు ప్రయాణీకులున్నారు. వీరిలో ఒక నిపుణుడు పంగ్విన్‌ను పోర్టు ఎలిజబెత్‌కు తరలించాలని కోరడంతో పైలట్ కూడా రిస్క్‌ను అంచనా వేయకుండా అంగీకరించి తీసుకున్నాడు. ఆ పెంగ్విన్‌ను ఒక కార్డు బోర్డు బాక్స్‌లో ఉంచి హెలికాప్టర్‌లో పైలట్ పక్కనే ఉన్న వ్యక్తి ఒడిలో ఉంచారు. ఆ లోహ విహంగం 50 అడుగుల ఎత్తు ఎగరగానే ఆ బాక్స్ ఒక్కసారిగా పైలట్ సైక్లిక్‌పిచ్ కంట్రోల్ లివర్‌పై పడింది. దీనితో హెలికాప్టర్ అదుపు తప్పి దాని రెక్కలు నేలను తాకడంతో అది కూలిపోయింది. తగిన ఏర్పాట్లు లేకుండా పెంగ్విన్‌ను హెలికాప్టర్లలో తరలించడం సరైన చర్యకాదని దక్షిణాఫ్రికా సిఎఎ తన నివేదికలో వెల్లడించింది. పైలట్ కూడా దానిని కార్డుబోర్డు బాక్స్‌లో తరలించి ముప్పును అంచనా వేయడాన్ని విస్మరించాడని విశ్లేషించింది.

# హాంతకుడిని పట్టించిన ముక్కుపుడక!



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:** దేశరాజధాని నగరంలో నెల రోజులక్రితం జరిగిన ఒక హత్యకేసును పోలీసులు ఛేదించారు. మృతురాలు శరీరంపై ఉన్న ముక్కుపుడకనే ఈకేసు ఛేదనకు కీలకంగా ఉపయోగపడింది. ముక్కుపుడక ఆధారంగా కేసును ఛేదించిన పోలీసులు నిందితుడిని అరెస్టుచేసి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఢిల్లీలోని అనిల్‌కుమార్ అనే వ్యాపారి భార్య సీమాసింగ్‌ను నెలరోజులక్రితం గొంతునులిమి హత్యచేసాడు. ఆ తర్వాత మృతదేహాన్ని బెడ్ షీట్‌లో చుట్టి దానికి రాళ్లు, ఇటుక కట్టి కారులో తీసుకెళ్లి దక్షిణ ఢిల్లీలోని మురుగుకాల్వలో పడేశాడు. గతనెల 15న కాల్వలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాంతో ఘటనాస్థలానికి చేరుకన్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టానికి తరలించారు. పోస్టుమార్టంలో ఆమెను గొంతునులిమి చంపినట్లు తేలింది. కానీ మృతురాలు ఎవరనేది గుర్తించడం కష్టం అయింది ఈ క్రమంలోపోలీసులు ఆమె ఒంటిపై లభించిన ముక్కుపుడకపై పడింది. దక్షిణ ఢిల్లీలోని ఒక జ్యూయెలరీ దుకాణంలో ఆముక్కుపుడకను చూపిస్తే అది తామే అమ్మినట్లు జ్యుయలరీ యజమాని గుర్తించారు. బిల్లును తీస్తే అది అనిల్‌కుమార్‌పేరిట ఉంది. అనిల్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు ఇంటరాగేషన్‌చేస్తే నేరం అంగీకరించాడు. సీమాసింగ్‌పుట్టింటివివరాలు తెలుసుకున్న పోలీసులు ఈనెల 1న వారిని పిలిపించి మృతదేహాన్ని గుర్తించాలనికోరారు. దాంతో సీమాసింగ్ సోదరి, కుమారుడు ఆమె మృతదేహాన్ని గుర్తించారు. ఆ తర్వాత వారికి సీమాసింగ్ భౌతికకాయం అప్పగించారు. సోదరి బబితాసింగ్ మాట్లాడుతూ పోలీసులు చెప్పే వరకూ తమ సోదరి హత్య జరిగిందన్న విషయం దాచి పెట్టారన్నారు. గతనెల 11న చివరిసారి సీమాకు ఫోన్ చేసానని కానీ అనిల్ మాట్లాడాడని బబిత చెప్పింది. ప్రస్తుతం సీమా మనసు బాగోలేదని మాట్లాడే మూడ్‌లో లేదని ఆమె మంచి మూడ్‌లోకి వచ్చినపుడు తానే మాట్లాడిస్తానని అనిల్‌కుమార్ చెప్పినట్లు ఆమె వెల్లడించింది. కానీ పోలీసులు హత్యవార్త చెప్పే వరకూ అనిల్‌కుమార్ ఫోన్ చేయించలేదని తెలిపింది.



## ఆనాటి ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నాం: అసోం సిఎం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:** ముంబయి ఉగ్రదాడి ప్రధాన కుట్రదారుడు తహవ్వుర్‌హుస్సేన్ రాణాను ఎన్ఐఎ ఢిల్లీ తీసుకువచ్చిన క్రమంలో అస్సాం సీఎం ఆనాటి భయంకర సంఘటనలు గుర్తుచేసుకున్నారు. ఉగ్రదాడులు జరిగిన రోజున తాను ముంబయి తాజ్ హోటల్‌లో బస చేయాల్సి ఉండగా షెడ్యూలు మారడంతో మరో హోటల్‌లో దిగానని తెలిపారు. దాంతో ఆ దాడు లనుంచి తృటిలో తప్పించుకోగలిగానని అన్నారు. ఎన్ఎస్జీ ఆపరేషన్ ఇంకా తన కళ్ల ముందే మెదులుతోందని కర్మ సిద్ధాంతం ప్రకారం ఉగ్రదాడుల వెనక ఉన్న సూత్రధారులకు ఏదోఒకరోజు శిక్షపడుతుందని తాను భావించినట్లు తెలిపారు. పదహారేళ్ల తర్వాత తహవ్వుర్ రాణాను దేశంలో చూస్తుంటే న్యాయవ్యవస్థపై మరింత విశ్వాసం పెరుగుతోందన్నారు. కేంద్రంలో ఉన్న బలమైన నాయకత్వం ఇటువంటి చర్యలు తీసుకోవడంద్వారా భారత్‌పై దాడులుచేయాలంటే ముష్కరులు రెండోసారి ఆలోచిస్తారని హిమంత బిశ్వశర్మ తన సోషల్ మీడియాలో పోస్టుచేసారు. ప్రపంచాన్ని వణికించిన ముంబయి ఉగ్రదాడి ప్రధాన కుట్రదారుల్లో ఒకడైన తహవ్వుర్‌రాణా పాకిస్థాన్ మూలాలున్న కెనడా జాతీయుడు. ముంబయి దాడుల కుట్రదారుగా భారత్ ఆధారాలు ఇవ్వడంతో రాణాను 2009 అక్టోబరులో ఎఫ్‌బిఐ అరెస్టుచేసింది. చికాగాలో ఆతడిని పట్టుకుంది. అయితే తనకు ఇందులోభాగస్వామ్యంలేదని కేసునుంచి తప్పించుకున్నాడు. 2011లో మరో కేసులో ఆతడు అరెస్టుకావడంతో 14 ఏళ్ల జైలు శిక్షపడింది. అప్పటినుంచి భారత్ ఆతడికోసం ప్రయత్నిస్తోంది. రాణాను భారత్‌కు అప్పగించడానికి ట్రంప్ అంగీకరించిన క్రమంలో అక్కడి అధికారులు ఆతడిని ఎన్ఐఎకు అప్పగించారు.

# అన్నాడిఎంకెతో బిజెపి పొత్తు: అసెంబ్లీ ఎన్నికల్లో కలిసే పోటీ

## తమిళనాడు బిజెపి చీఫ్‌గా నయినార్ నాగేంద్రన్

**చెన్నై, ఏప్రిల్ 11:** తమిళనాడు ప్రతిపక్షపార్టీ అన్నాడిఎంకె, భారతీయ జనతాపార్టీల మధ్య పొత్తులు కుదిరాయి. వచ్చే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో రెండుపార్టీలు కలిసి పోటీచేస్తాయని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించారు. మాజీ సీఎం ఎడప్పాడి పళనిసామి నేతృత్వంలో రాష్ట్రంలో ఎన్నికల్లోపోటీచేస్తామని ఆయన స్పష్టంచేసారు. చర్చల అనంతరం జరిగిన మీడియాతోమాట్లాడిన అమిత్‌షా పొత్తులపై స్పష్టత ఇచ్చారు. మాజీసీఎం పళనిసామి మాట్లాడుతూ రెండుపార్టీలు గతంలో పొత్తులు పెట్టుకున్నాయన్నారు. రెండుపార్టీలు కలిసే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి వెళతాయన్నారు. అవసరమైన రెండుపార్టీలు కనీస ఉమ్మడి ప్రణాళికను రూపొందించుకుంటాయని అమిత్‌షా చెప్పారు. అన్నాడిఎంకెకి ఎలాంటి షరతులు, డిమాండ్లు లేవని, ఆపార్టీ అంతర్గత విషయాల్లో తాము జోక్యంచేసుకోమని ఈకూటమి ఎన్డీయేకి అన్నా డిఎంకెకి రెండింటికి ప్రయోజనకరంగా ఉంటుందని అమిత్‌షా చెప్పారు. 1988లో దివంగతమాజీ సీఎం జయలలిత నేతృత్వంలో బిజెపి అన్నాడిఎంకె పార్టీలు పొత్తులు పెట్టుకున్నపుడు లోక్‌సభలో భారీ విజయం నమోదుచేసాయని అమిత్‌షా అన్నారు. ఒక దశలో ఈక ఊటమి తమిళనాడులోని 39 లోక్‌సభ స్థానాలకు 30 స్థానాలు గెలుచుకుందన్నారు. తమిళనాడు ఎన్నికల్లో ఎన్డీయే సులువుగా గెలుస్తుందని షా ధీమా వ్యక్తంచేసారు. ఇక సీట్లపంపిణీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రిత్వశాఖల పంపిణీ రెండూ కూడా తర్వాత నిర్ణఇస్తామని అమిత్‌షా అన్నారు. తమిళనాడులో నిజమైన సమస్యల నుంచి దృష్టిమళ్లించడానికి డిఎంకె సనాతన ధర్మ, త్రిభాషా విదానం వంటి వాటిని లేవనెత్తుతోందని ఆయన విమర్శించారు. రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డిఎంకె అవినీతి, శాంతిభద్రతల సమస్యలు, దళితులు మహిళలపై దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రజలుఓటేస్తారని చెప్పారు. రూ.39వేలు కోట్లమధ్యం కుంభకోణం, ఇసుక తవ్వకాల కుంభకోణం, ఎస్సీటీఓ స్కామ్, రవాణా కుంభకోణాలను డిఎంకె పార్టీచేసిందని అమిత్‌షా దుయ్యబట్టారు. తమిళనాడుప్రజలకు డిఎంకెపార్టీ, సీఎం స్టాలిన్ ఆతడి కొడుకు ఉదయనిధి స్టాలిన్ సమాధానాలు చెప్పాలని డిమాండ్‌చేసారు.

**తమిళనాడు బిజెపి చీఫ్‌గా నాగేంద్రన్:** కాగా తమిళనాడు బిజెపి అధ్యక్ష ఎన్నికల బరిలో తాను లేనని ఇటీవల ప్రస్తుత చీఫ్ అన్నామలై ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈపదవికి తిరునల్వేలి బిజెపి ఎమ్మెల్యే నయినార్ నాగేంద్రన్ నామినేషన్‌పత్రాలు సమర్పించారు. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా కొనసాగుతున్నారు. టినగర్‌లోని రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి వచ్చిన ఆయన ఒక్కరే నామినేసన్ దాఖలుచేయడంతో ఆయన ఎన్నిక లాంఛనమేనని వార్తలు వస్తున్నాయి. రాష్ట్ర అధ్యక్షపదవికి నాగేంద్రన్ పేరును అన్నామలై, కేంద్ర మంత్రి ఎల్‌మురుగన్, కేంద్రమాజీ మంత్రిపోన్ రాధాకృష్ణన్‌తోపాటు మహిళా మోర్చా అధ్యక్షురాలు వనతి శ్రీనివాసన్‌లు ప్రతిపాదించారు. ఇదిలా ఉండగా బిజెపి అధ్యక్షుడు అన్నామలై సేవలను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రశంసించారు. ఆయన పనితీరుప్రశం సనీయమని, ప్రధానిమోడీ విధానాలనుప్రజలకు చేరవేయడంలోనైనా, పార్టీ కార్యక్రమాలను గ్రామగ్రామానికి తీసుకెళ్లడం లోనైనా ఆయన పనితీరు కృషి అపూర్వమని కొనియాడారు. అన్నామలై సంస్థాగత నైపుణ్యాలను పార్టీ జాతీయ స్థాయిలో వినియోగిం చుకుంటుందని ఆయన అన్నారు.






# విషు పర్వదినం నుంచి అయ్యప్ప బంగారు లాకెట్లు

**తిరువనంతపురం, ఏప్రిల్ 11:** అయ్యప్ప భక్తులకు ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు (టీడీబీ) కొత్తపథకం అమలుకు తెచ్చింది. అయ్యప్ప విగ్రహంతో కూడిన ప్రత్యేక బంగారు లాకెట్‌ను మలయాళ కొత్త సంవత్సరం విషు పర్వదినం (ఏప్రిల్ 14) సందర్భంగా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించిందివిషు సందర్భంగా ఈ లాకెట్ అందుబాటులోకి వస్తుందని పేర్కొంది. 1, 2, 4, 8 గ్రాముల్లో లాకెట్లు అందుబాటులో ఉండనున్నాయి. అయ్యప్ప భక్తులు లాకెట్లను రెండు విధాలుగా కొనుగోలు చేయవచ్చని దేవస్థానం బోర్డు తెలిపింది. ఆన్ లైన్ లేదా ఆలయ ప్రధాన ప్రాంతమైన సన్నిధానంలోని దేవస్వం పరిపాలనా కార్యాలయంలో నగదు చెల్లించడం ద్వారా పొందవచ్చని వెల్లడించింది. బంగారు లాకెట్‌ను ఆలయ పవిత్ర గర్భగుడి లోపల పూజలు నిర్వహించి అందజేస్తారు. ఇలా చేయడం వల్ల భక్తులకు అదనపు ప్రత్యేకతను ఇస్తుందని దేవస్థానం పేర్కొంది. జీఆర్‌టీ, కల్యాణ్‌కు బంగారు లాకెట్ల టెండర్లు అయ్యప్ప స్వామి ఫొటోతో బంగారు లాకెట్లను తయారు చేసి సప్లై చేసే టెండర్లను తమిళనాడుకు చెందిన జీఆర్‌టీ జ్యువెల్లర్స్, కేరళకు చెందిన కల్యాణ్ జ్యువెల్లర్స్ దక్కించుకున్నాయి. 1 గ్రాము, 2 గ్రాములు, 4 గ్రాములు, 8 గ్రాముల సైజుల్లో ఈ లాకెట్లు లభిస్తాయి. విషు పర్వదిన వేడుకల్లో ఈ బంగారు లాకెట్లు ముఖ్యమైన భాగం. ఇది శబరిమల సందర్శించే వేలాది మంది భక్తులకు ఆధ్యాత్మిక అనుభవాన్ని మరింత సుసంపన్నం చేస్తుందనే భావన ఉంది. ఇదిలా ఉండగా, మలయాళ నెల మీనం మొదటి రోజు (శుక్రవారం) పవిత్రమైన ఆరాట్టు ఊరేగింపు ప్రారంభమైంది. ఉదయం 8:30 గంటలకు సన్నిధానం నుంచి పంప వరకు ఉత్సవ ప్రయాణంతో ఊరేగింపు ప్రారంభమయింది. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా వెలినల్లూర్ మణికందన్ పాల్గొన్నారు. పంపాలో ఆరాట్టు ఆచారం ఉదయం 11:00 గంటలకు జరగింది. ఆరాట్టు ఊరేగింపు తర్వాత, అయ్యప్పను పంప గణపతి ఆలయంలోని మండపానికి తీసుకెళ్తారు. అక్కడ భక్తులు ప్రార్థనలు చేసుకునే అవకాశం ఉంటుంది. పూజా కార్యక్రమాలు, ప్రార్థనల తర్వాత ఆరాట్టు ఊరేగింపు సన్నిధానంకు తిరిగి వెళుతుంది.

# తెలంగాణ పంచాయతీలకు దేశంలోనే రెండో స్థానం

### పంచాయతీ పురోగతి నివేదికను విడుదల చేసిన కేంద్ర పంచాయతీరాజ్ శాఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** దేశంలోని గ్రామ పంచాయతీల 2022-223 నాటికి సాధించిన పురోగతి ఆధారంగా కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ పంచాయతీ పురోగతి సూచిన విడుదల చేసింది. దాంట్లో తెలంగాణ దేశంలోనే రెండో స్థానంలో నిలించింది. పేదరిక నిర్మూలన, పంచాయతీలలో జీవనోపాధుల పెంపు, ఆరోగ్యం, చిన్నారులకు అనుకూలమైన సౌకర్యాల కల్పన, తాగునీరు, పారిశుద్ధం, పచ్చదనం, మౌలిక వసతుల్లో స్వావలంబన, సామాజిక భద్రత, సుపరిపాలన, మహిళలకు అనుకూలమైన విధానాలు అనే తొమ్మిది కొలమానాల ఆధారంగా పంచాయతీల పనితీరును మదింపు చేశారు.

ఆ ప్రకారం ఉత్తమ పనితీరు కనపరచిన పంచాయతీలను అచీవర్స్ (90-100 మార్కులు), ఫ్రంట్‌రన్నర్ (75-90), పెర్ఫార్మర్ (60-75), యాస్పిరెంట్ (40-50), బిగినర్ (40 మార్కులలోపు)గా విభజించారు.

ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం పంచాయత్ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ పేరుతో ఆన్‌లైన్ పోర్టల్ ఏర్పాటుచేసి దరఖాస్తులను ఆహ్వానించింది. 29 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 2.55 లక్షల పంచాయతీలు దరఖాస్తు చేసుకున్నాయి. అందులో రాష్ట్ర ప్రభుత్వాలు 2.16 లక్షల పంచాయతీల నమోదు డేటాను ధ్రువీకరించాయి. వాటిని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర పంచాయతీరాజ్ శాఖ అవి సాధించిన పురోగతికి సంబంధించిన సూచికలను నిర్ధారించింది. అందులో రాష్ట్రాల వారీగా టాప్25 పంచాయతీల పేర్లు ప్రకటించింది. అందులో దేశంలోని ఏ పంచాయతీకీ అచీవర్స్ హోదా దక్కలేదు.

**తెలంగాణలో 270 పంచాయతీలు ఏ గ్రేడ్**

గుజరాత్‌లోని 346, తెలంగాణలో 270 పంచాయతీలు ఏ గ్రేడ్ (ఫ్రంట్ రన్నర్) దక్కించుకుని మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి.

దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలోని పంచాయతీలకు ఇంత పెద్ద సంఖ్యలో ఏగ్రేడ్ దక్కలేదు. అలాగే గుజరాత్‌లోని 13,781 పంచాయతీలు, తెలంగాణలోని 10,099 పంచాయతీలు బీగ్రేడ్ (పెర్ఫార్మర్) దక్కించుకున్నాయి. సీగ్రేడ్‌లో (యాస్పిరెంట్) గుజరాత్ నుంచి 491, తెలంగాణ నుంచి 2,390 పంచాయతీలు నిలిచాయి. డీ గ్రేడ్ (బిగినర్)లో గుజరాత్ రాష్ట్రంలోని పంచా యతీలు ఒక్కటీ లేవు. తెలంగాణ నుంచి 9 పంచాయతీలు ఈ గ్రేడ్‌లో నిలిచాయి.

**తెలంగాణలో సుస్థిర అభివృద్ధి సాధించిన మొదటి 10 పంచాయతీలు ఇవే**

కేంద్ర పంచాయితీరాజ్‌శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని బుర్నాపూర్ 84.09 మార్కులతో మొదటి స్థానం సంపాదించగా, కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామ పంచాయితీ 82.79 మార్కులతో రెండో స్థానం సంపాదించింది.

అదే విధంగా నిజామాబాద్‌లోని జక్రాన్‌పల్లి మండలంలోని మునిపల్లి పంచాయితీ 81.29, అదే జిల్లాలోని మోర్తాడ్ మండలంలోని మోర్తాడ్ గ్రామ పంచాయితీ 81.29 మార్కులతో నాల్గో స్థానం సంపాదించాయి.

నిర్మల్ జిల్లాలోని దిలావర్‌పూర్ మండలం గుండంపల్లి 81.28 మార్కులతో 5వ స్థానంలో, మహాబూబాద్ కేసముద్రం మండలం కల్వల 80.82 మార్కులతో 6వ స్థానం, నారయణ పేట జిల్లా కొస్గి మండలంలోని చెన్నారం 80.80 మార్కులతో 7వ స్థానంలో, వరంగల్‌లోని గీసుకొండ మండలంలోని మరియాపురం గ్రామ పంచాయితీ 80.17 మార్కులతో 8వ స్థానం, మంచిర్యాలలోని జన్నారం మండలం దేవుని గూడెం 80.49 మార్కులతో 9వ స్థానం, రాజన్న సిరిసిల్ల చందుర్తి మండలంలోని బండపల్లి 80.41 మార్కులతో 10వ సానం సంపాదించినట్లు తెలిపింది.



## ఔటర్ పరిధిలో హద్దులు నిర్ణయించేందుకు ఎన్ఆర్ఎస్‌సితో హైడ్రా ఒప్పందం

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** నగరంలోని ప్రభుత్వ స్థలాలు, చెరువుల సంరక్షణలో దూకుడుగా వ్యవహరిస్తున్న హైడ్రా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఔటర్‌రింగ్‌రోడ్ పరిధిలో హద్దులు నిర్ణయించేందుకు నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సి)తో ఎంవోయూ కుదుర్చుకుంది. ఈమేరకు శుక్రవారం హైడ్రా కమిషనర్ ఎ.వి రంగనాథ్, ఎన్ఆర్ఎస్‌సీ డైరెక్టర్ డా.ప్రకాష్ చౌహాన్ ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇరు శాఖలకు చెందిన పలువురు అధికారులు కూడా పాల్గొన్నారు. ఓఆర్ఆర్ పరిధిలో ఉన్న భూముల వివరాలు అందరికీ అందుబాటులోకి తీసుకురావడంతోపాటు ఎక్కడ చెరువు ఉంది..? ఆ చెరువు విస్తీర్ణం ఎంత ? కాలువలు, నాలాల పరిస్థితి ఏంటి..? అనే సమాచారంతో పాటు ప్రభుత్వ భూములు, పార్కులకు సంబంధించి సరైన హద్దులతో సమాచారాన్ని సేకరిస్తోంది. ప్రభుత్వ, ప్రజావసరాలకు ఉద్దేశించిన భూముల వివరాలతో పాటు.. చెరువుల హద్దులు అందుబాటులో ఉంటే ఆక్రమణలకు ఆస్కారం లేకుండా ఉంటుందని ఇరువురు ఉన్నతాధికారులు అభిప్రాయ పడ్డారు. చెరువుల ఎఫ్టీఎల్, బఫర్ జోన్లకు సంబంధించి హద్దుల విషయంలో ఎలాంటి అపోహలకు ఆస్కారం లేకుండా సరైన సమాచారం అందించడమే హైడ్రా ముందున్న లక్ష్యమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు.



తునికాకు సేకరణకు వెళ్లి అడవిలో తప్పిపోయిన నలుగురు మహిళలను కాపాడి ఆహారం అందిస్తున్న పోలీసులు

## తునికాకు సేకరణకు అడవికి వెళ్లి తప్పిపోయిన నలుగురు మహిళలు

### రక్షించిన పోలీసులు

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** నిర్మల్ జిల్లా మామడ మండలం కప్పన్ గ్రామానికి చెందిన నలుగురు మహిళలు సమీపంలోని అటవీ ప్రాంతంలో గురువారం తునికాకు సేకరణ కోసం వెళ్లి తప్పిపోయి రాత్రంగా అడవిలోనే వుండిపోగా దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం ఉదయం వారిని రక్షించి కుటుంబ స భ్యులకు అప్పగించారు. వివరాలు ఇలావున్నాయి. కప్పన్ గ్రామానికి చెందిన కొందరు మహిళలు కొన్ని రోజులుగా సమీప అటవీ ప్రాంతంలో తునికాకు సేకరిస్తున్నారు. గురువారం కూడా ఇలాగే వెళ్లారు. అయితే సాయంత్రం వేళ వున్నట్లుండి వర్షం రావడంతో అందరు వేగంగా ఇంటికి వస్తుండగా కొందరు దారితప్పారు. ఇందులో రాధ, లింగవ్వ, లక్ష్మీ, సరోజ అనే మహిళలు రాత్రి అయినా ఇంటికి చేరుకోలేదు. దీంతో వారి కుటుంబీకులు ఆందోళనకు గురై దీనిపై వెంటనే పోలీసులతో పాటు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో శుక్రవారం ఉదయం జిల్లా ఎస్‌పి జానకి షర్మీల డ్రోన్ల సహాయంతో కొందరు పోలీసులతో పాటు అటవీ శాఖ సిబ్బందిని రంగంలో దించి తప్పిపోయిన నలుగురు మహిళల కోసం గాలింపు చే బట్టారు. రెండు గంటల తరువాత నలుగురి ఆచూకిని పోలీసులు కనుగొన్నారు. అనంతరం వా రిని ఒకచోటకు చేర్చి నీరు, ఆహారం అందించి సేదదీర్చారు. తరువాత వారిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీనిపై ఎస్‌పి జానకి షర్మీల మీడియాతో మాట్లాడు తూ డ్రోన్లతో పాటు జిపిఎస్ సాం కేతక సహాయంతో తప్పిపోయిన వారిని గుర్తించామని వారంతా ఆరోగ్యంగా వున్నారని, కుటుంబ సభ్యులకు అప్పగించామని తెలిపారు.

## ఛత్తీస్‌గఢ్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పర్యటన

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఛత్తీస్‌గడ్‌లో పర్యటిస్తున్నారు. గురువారం ప్రపంచపు రెండో అతిపెద్ద బొగ్గుగని గెవరాను సందర్శించిన కిషన్ రెడ్డి.. శుక్రవారం ఎస్ఈసిఎల్ (సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్ లిమిటెడ్) ఆధ్వర్యంలో కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా చేపట్టిన పలు కార్యక్రమాల పనితీరును సమీక్షించారు. ఎస్ఈసిఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధడకన్ కార్యక్రమంలో భాగంగా బాల్యం నుంచే గుండె సమస్యలతో ఇబ్బందులు పడుతున్న చిన్నారులకు ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నారు. ఈ పథకంలో భాగంగా నయా రాయ్‌పూర్‌లో శ్రీసత్యసాయి సంజీవని ఆసుపత్రిలో ఆపరేషన్లు పూర్తయిన చిన్నారులను పరామర్శించారు. సుష్రుత కార్యక్రమంలో భాగంగా ఎస్ఈసిఎల్ పరిధిలోని ప్రాంతాల్లో పేద విద్యార్థులకు నీట్ ప్రవేశ పరీక్షకు శిక్షణ ఇస్తున్నారు. ఈ పథకం ద్వారా శిక్షణ పొంది వైద్యవిద్యను పూర్తిచేసిన యువ డాక్టర్లను కేంద్రమంత్రి కలిసి అభినందించారు. మారుమూల ప్రాంతాల్లోనూ వైద్యసేవలను విస్తృతం చేయడంలో చురుకైన పాత్ర పోషించాలని వారికి కేంద్రమంత్రి సూచించారు. రాష్ట్ర సచివాలయంలో ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయితో కలిసి ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇతర ఉన్నతాధికారులు, కోలిండియా చైర్మన్, ఎస్ఈసిఎల్ సిఎండి కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి ఉన్న సామర్థ్యాలను వివరిస్తూ దీన్ని సద్వినియోగం చేసుకోవడంలో పరస్పర సహకారంతో ముందుకెళ్లాలని కేంద్రమంత్రి సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తన రెండ్రోజుల ఛత్తీస్‌గఢ్ పర్యటన విజయవంతం అయిందన్నారు.

## సమానత్వం కోసం పోరాడిన తత్వవేత్త జ్యోతిరావుపూలే

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** సమానత్వం కోసం పోరాడిన తత్వవేత్త జ్యోతిబాపూలే అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ కొనియాడారు. భారతీయ సామాజిక తత్వవేత్త మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు శుక్రవారం హైదరాబాదులోని అంబర్‌పేట్‌లో జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న జాన్‌వెస్లీ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పూలే ఆశయాలకనుగుణంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. జ్యోతిరావు పూలే 19వ శతాబ్దంలో గొప్ప సంఘసంస్కర్తల్లో అగ్రగణ్యుడని, మహిళా, బీసీ, ఎస్సీ, ఎస్టీల విద్యకు కృషి చేసిన గొప్పవ్యక్తి అని కొనియాడారు. సామాజిక దార్శనికుడిగా, సంఘ సంస్కర్తగా వర్ణవివక్ష వ్యతిరేక పోరాటానికి బాటలు వేసిన మహనీయుడన్నారు. మనుషులంతా అన్ని రంగాల్లో సమానత్వంతో జీవించాలని, ఆధిపత్య విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూ తన జీవితాన్ని ధారపోసిన సామాజిక తత్వవేత్త అని, వివక్ష లేని సమానత్వ సమాజం కోసం జీవితాంతం శ్రమించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమం చేశారని, జనాభా ప్రతిపాదికన ఉద్యోగాలు ఇవ్వాలని బ్రిటిష్ ప్రభుత్వానికి సూచించిన మహనీయుడన్నారు. నేడు దేశంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు పేద, మధ్యతరగతి వారికి విద్య, ఉపాధిని దూరం చేస్తూ కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పాలని చూస్తున్నాయని, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ పబ్బం గడుపుతున్నాయని విమర్శించారు. మతాన్ని రెచ్చగొడుతూ పిల్లలకు విద్యను దూరం చేసే కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. ఏప్రిల్ 11న పూలే జయంతి నుండి బీఆర్ అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 వరకు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మనువాద, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా, సామాజిక న్యాయం కోసం, గ్రామ గ్రామాన, అన్ని బస్తీల్లో ప్రదర్శనలు, సభలు నిర్వహించాలనే సిపిఐఎం రాష్ట్ర కమిటీ నిర్ణయించినట్టు తెలిపారు.

## ప్రభుత్వ జూ.కాలేజీల్లో ద్వితీయ భాషగా సంస్కృతం!

### విద్యార్థులను మాతృభాషకు దూరం చేయొద్దన్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

### అధ్యాపక సంఘాల అభ్యంతరం

### ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సంస్కృతంను సెకండ్ లాంగ్వేజ్‌గా కొనసాగించాలని ఇంటర్ విద్యా శాఖ నిర్ణయించడంతో.. అధ్యాపక సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. సెకండ్ లాంగ్వేజ్‌గా సంస్కృతంను ప్రవేశ పెట్టాలనుకోవడంపై మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులను మాతృభాషకు దూరం చేయొద్దని ప్రభుత్వానికి సూచించారు. మార్కుల కోసం విద్యార్థులను మాతృభాషకు దూరం చేయడం మంచిదికాదని వెంకయ్యనాయుడు అన్నారు. ఇంటర్మీడియట్‌లో ద్వితీయ భాషగా సంస్క ృతం ఉంచాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసి విచారించానన్నారు. మార్కుల దృష్ట్యా ఉంచాలని చూస్తే మాత్రం పునరాలోచన చేయాలని సూచించారు. సంస్క ృతం బోధించడంలో తప్పులేదని, సంస్క ృతిని అందిపుచ్చుకునే దిశగా అమ్మభాష ఆలంబనగా నిలుస్తుందని సామాజిక మాధ్యమమైన ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ స్థాయిలో ద్వితీయ భాషగా సంస్క ృతం అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందన్న వార్తలు విని విచారించాను. మార్కుల దృష్ట్యా ఈ నిర్ణయం అయితే మాత్రం, పునరాలోచన చేయాలని సూచిస్తున్నానని వెంకయ్య నాయుడు ట్వీట్ చేశారు. విద్యార్థులను మన మాతృభాషకు దూరం చేయడం మంచిది కాదు. సంస్క ృతాన్ని బోధించడంలో తప్పు లేదు, అదే సమయంలో మనదైన సంస్క ృతిని అందిపుచ్చుకునే దిశగా అమ్మ భాష ఆలంబనగా నిలుస్తుంది. అందుకే జాతీయ విద్యా విధానం-2020 సైతం మాతృభాషకు ప్రాధాన్యత ఇచ్చింది. ఈ స్ఫూర్తిని అందిపుచ్చుకుని, విద్యార్థులను మాతృభాషకు మరింత చేరువ చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆకాంక్షిస్తున్నాను అని వెంకయ్య నాయుడు ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సెకండ్ లాంగ్వేజ్‌గా సంస్కృతంను కొనసాగించాలని ఇంటర్ విద్య శాఖ నిర్ణయిం చడంపై ఇంటర్ విద్యలోని అధ్యాపక సంఘాలు మండిపడుతున్నాయి. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సెకండ్ లాంగ్వేజ్ సబ్జెక్ట్‌గా సంస్కృతాన్ని ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కనక చంద్రం అధ్వర్యంలో ఇంటర్ విద్య కమిషన్‌కి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం కూడా మాతృభాష అయినా తెలుగును రక్షించుకోవాలని కోరారు.ఇంటర్ విద్య జాయింట్ డైరెక్టర్ ఇచ్చిన సర్క్యులర్ వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ ఇంటర్మీడియట్ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్(టిగ్లా) రాష్ట్ర అధ్యక్షులు మైలారపు జంగయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కె నయీమ్ పాష డిమాండ్ చేశారు. ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్- 475 రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వి శ్రీనివాస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ డిమాండ్ చేశారు.

## కెటిఆర్‌కు దమ్ముంటే ఎంపి పేరు చెప్పాలి

### బిజెపి ఎంపి ధర్మపురి అరవింద్

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** హైదరాబాద్ కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో మాజీ మంత్రి కెటిఆర్‌కు దమ్ముంటే ఆ ఎంపి ఎవరో పేరు చెప్పాలని బిజెపి ఎంపి ధర్మపురి అరవింద్ డిమాండ్ చేశారు. శుక్రవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో అరవింద్ మీడియాతో మాట్లాడారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేసిన ఆరోపణలపై మాట్లాడుతూ బాధ్యతాయుతమైన ప్రతిపక్షంలో ఉంటి అవినీతికి సంబంధించిన విషయాలు తెలిసి కూడా పేర్లు ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు. తప్పులన్నీ కాంగ్రెస్, బిఆర్ఎస్ కలిసి చేసి ఆరోపణలు మాత్రం బిజెపిపై వేస్తున్నారని మండిపడ్డారు. ఐసిఐసిఐ నుంచి రుణాలు తీసుకుంటే ముందు ఆ బ్యాంక్‌పై విచారణ జరగాలన్నారు. ఇదివరకే హెచ్‌సియుకు ఇచ్చిన భూములపై అప్పు ఎలా తెస్తారని నిలదీశారు. ఈ విషయంలో కచ్చితంగా విచారణ జరగాలన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ భూములు యూనివర్సిటీ పేరున చేస్తే ఈ అంశం ముగిసిపోతుందన్నారు. పదేళ్ల అధికారంలో ఉండి కెసిఆర్ ఆ పని చేయలేదని, హెచ్‌సియు భూములపై కెటిఆర్, కవితకు మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అసత్యాల, అబద్ధాల ప్రభుత్వం నడుస్తోందని అరవింద్ విమర్శించారు. ఈ ప్రభుత్వానికి ఆర్థిక క్రమశిక్షణ లేదని, పరిపాలన జీరో అని దుయ్యబట్టారు. ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చడం లేదని, వాటిని నెరవేర్చాలన్న తపన కూడా ఈ ప్రభుత్వానికి లేదన్నారు. ఏడాదిన్నర పాలనలో ప్రజల దృష్టిని డైవర్ట్ చేసేందుకు హైడ్రా, పుష్ప, కులగణన, హెచ్‌సీయూ మీద పడ్డారు తప్పితే హామీలను అమలు చేయాలనే ప్రయత్నం లేదని విమర్శించారు. కేసీఆర్ చేసిన అప్పులపై రేవంత్‌రెడ్డి మాట్లాడినంత మరెవరూ మాట్లాడలేదని, లక్షల కోట్ల అప్పు ఉందని తెలిసినా ఎందుకు అమలుకాని వాగ్దాలు ఇచ్చారని నిలదీశారు. ప్రగతిభవన్‌లో లంకెబిందెలు ఉండవని, ఫామ్‌హౌస్‌లో ఉంటాయని, దమ్ముంటే అక్కడికి పోవాలని సజఎంకు సవాల్ విసిరారు. నాలుగు పుస్తకాలు చదివినా మీకే ఇంత తెలివి ఉంటే 80 వేల పుస్తకాలు చదివిన ఖశ్రీసజఆర్‌కు లంకె బిందెలు ఎక్కడ పెట్టుకోవాలో తెలియదా అని ప్రశ్నించారు.

**కాంగ్రెస్ బిసి వ్యతిరేక పార్టీ: మాజీ ఎంపి బూర నర్సయ్యగౌడ్**

కాంగ్రెస్ పార్టీ నెహ్రూ కాలం నుంచి రాహుల్ గాంధీ వరకు వారి డిఎన్ఏలో బిసి వ్యతిరేక పార్టీగానే మిగిలిందని మాజీ ఎంపి బూర నర్సయ్య గౌడ్ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. బిసి వ్యతిరేకత వల్ల కాంగ్రెస్ పార్టీ దేశం మొత్తంలో తుడుచుకుపెట్టుకుపోయిందన్నారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి బిసిల పట్ల కొంగజపం చేస్తున్నారన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బిసిలపై చేస్తున్న ద్వంద్వ విధానాలను ప్రశ్నిస్తున్నామన్నారు. మహాత్మా పూలే, సావిత్రీబాయి పూలే పేరిట ప్రమాణం చేసి, కామారెడ్డి బిసి డిక్లరేషన్‌ను ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ ఆ హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు.

రాష్ట్రంలోని బిసి జనాభా 52 శాతం ఉండగా, దాన్ని కేవలం 46 శాతంగా చూపించి చట్టబద్ధంగా తక్కువ చూపేందుకు కుట్ర చేశారని అనుమానం కలుగుతుందన్నారు. బిసి గణన వివరాలను ఇప్పటివరకు అధికారికంగా ఎందుకు విడుదల చేయలేదు? కాంగ్రెస్ పార్టీకి నిజమైన నిబద్ధత ఉంటే, గ్రామాల వారీగా కులగణన వివరాలను అధికారికంగా ప్రకటించాలన్నారు. తొలి అసెంబ్లీ సమావేశంలో బిసి సబ్ ప్లాన్‌ను చట్టబద్ధం చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ దానికి కార్యరూపం ఇవ్వలేదన్నారు. ఎంబిసి మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించినా, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. బిసి వ్యక్తిని ప్రధానమంత్రి చేసిన ఘనత భారతీయ జనతా పార్టీకి దక్కుతుందన్నారు. 55 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఒక్కసారి కూడా బిసి వ్యక్తిని ముఖ్యమంత్రిగా నియమించలేదన్నారు. కనీసం ఉప ముఖ్యమంత్రిగా కూడా నియమించలే దన్నారు. బిసిల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే, బిసి వ్యక్తిని ముఖ్యమంత్రిగా చేసి, ఆ తర్వాతే బిసి సంక్షేమంపై మాట్లాడాలని రాహుల్ గాంధీని ప్రశ్నిస్తున్నామన్నారు. కామారెడ్డి బిసి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు.

## అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటు చేయాలి

### బిసిల 42శాతం అమలు కోసం కేంద్రంపై ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలి: ఎమ్మెల్సీ కవిత



సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీని కలిసి మద్దతు తెలపాలని కోరుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అసెంబ్లీ ఆవరణలో జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటుకు మద్దతు తెలిపాలని కోరుతూ శుక్రవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లోని సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ కార్యదర్శి జాన్ వెస్లీని కలిసి మద్దతు కోరారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ బీసీల ఎంపవర్మెంట్ జ్యోతిరావు పూలే అసెంబ్లీ ఆవరణలో విగ్రహం ఏర్పాటు చేయాలని అనేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇటీవలే ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన ధర్నాకు న్యాయవాదులు, వైద్యులు, మహిళలు, యువకులు, మేధావుల నుంచి పెద్ద ఎత్తున మద్దతు ఇచ్చారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో బతుకమ్మను, బోనాలను ప్రత్యేకగా తీసుకువెళ్లడం జరిగిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని జిల్లాల వారీగా కార్యక్రమాలు చేపట్టి ప్రజల మద్దతును కూడగొడుతున్నామని చెప్పారు. అందులో భాగంగానే ఇప్పటివరకు 27 సమావేశాలు చేపట్టడం జరిగిందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీల 42 శాతం అమలు కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని అన్నా రు. ఈ విషయంపై అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధానమంత్రి తో అపాయింట్మెంట్ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవలే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన కుల గణనలో అనేక సందేహాలు ప్రజల్లో ఉన్నాయని తెలిపారు. గతంలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించినప్పుడు బీసీల జనాభా 52శాతం గా ఉందని తేలిందన్నారు.

ఈ ప్రభుత్వం నిర్వహించిన కుల గణనలో బీసీల జనాభా 46శాతం అని ప్రకటించిందన్నారు. సహజంగానే జనాభా పెరుగుతుంది వెల్లడించారు. బీసీల జనాభా తగ్గడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కులాల వారీగా, గ్రామపంచాయతీ వారీగా, పట్టణాల్లో వార్డుల వారీగా డిస్ప్లే చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ కు 50శాతం సీలింగ్ అడ్డంకిగా ఉండేదని. ఇటీవలే కోర్టు తీర్పులతో అది తొలగిపోయిందని వివరించారు. తొమ్మిది రాష్ట్రాల్లో 50శాతం పైగా రిజర్వేషన్లు అమలు జరుగుతున్నాయని, ఈ డబ్లు రిజర్వేషన్ కూడా అమలు జరుగుతుందని తెలిపారు.. ఈ నేపథ్యంలో 50 శాతం సీలింగ్ బీసీ రిజర్వేషన్ రిజర్వేషన్కు అడ్డంకి కాదన్నారు... ఈ సందర్భంగా జాన్‌వెస్లీ సంపూర్ణ మద్దతు తెలిపారు. సంపూర్ణ మద్దతు తెలిపిన జాన్ వెస్లీ.....సందర్భంగా జాన్ వెస్లీ మాట్లా డుతూ భారతదేశంలో అణగారిన వర్గాల కొరకు పూలే పోరాడారు..కుల అసమానతలు మన దగ్గర దేశంలో ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. కేంద్రంలో మనువాదము అధికారంలో కొనసాగుతుందన్నారు.

అసెంబ్లీ లోపూలే విగ్రహ ఏర్పాటుకు సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. కులగణన వివరాలు రాష్ట్రప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. కేంద్రం కులగణనకు వ్యతిరేకమన్నారు. కులగణనపై కేంద్రం మీద ఒత్తిడి తేవాలి. జాగృతి నుండి ఎలాంటి కార్యక్రమాలు తీసుకున్న తమ మద్దతు ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ కవితతో పాటు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, ముఠా జయసింహా, బిఆర్ఎస్ నాయకులు గట్టు రామ చందర్, పి నారాయణ, రూప్‌సింగ్, దత్తాత్రేయ, తెలంగాణ జాగృతి నాయ కులు, సిపిఎం నాయకులు జ్యోతి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగుల కోసం పూలే కృషి చిరస్మరణీయం

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** అణగారిన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు తెచ్చేందుకు జ్యోతిరావు పూలే చేసిన కృషి చిరస్మరణీయం అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. మహాత్ములకు నివాళులు అర్పించ డమంటే వారి జయంతి, వర్ధంతిలను ఘనంగా నిర్వహించుకోవడమే కాదు, వారి ఆశయాలను, ఆకాంక్షలను నెరవేర్చడమనే విషయాన్ని కాంగ్రెస్ పాలకులు గుర్తుంచుకోవాలి అని బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలె జయంతిని పురస్కరించుకుని శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కేంద్ర మంత్రితోపాటు రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ జి.మనోహార్ రెడ్డి, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, కార్యదర్శి డాక్టర్ ప్రకాశ్‌రెడ్డి, కోశాధికారి శాంతకుమార్, అధికార ప్రతినిధి జె.సంగప్ప పూలెచిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పూలే సేవలను స్మరించుకుంటూ బండి సంజయ్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. అణచివేతపై తిరుగుబాటుకు కేరాఫ్ అడ్రస్ బదుగు, బలహీన వర్గాలకు కొండంత ధైర్యం మహాత్మా జ్యోతిరావు పూలె అన్నారు. ఏ సమాజమైతే చదువు పరంగా, ఆర్థికంగా ఎదుగుతుందో అప్పుడే ఆ సమాజం అభివృద్ధి చెందుతుందని ఆశించిడమే కాకుండా అందుకోసం చివరిదాకా కృషి చేసిన మహనీయుడు అన్నారు ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను అభిమానించే జ్యోతిరావు పూలె కుల వివక్షపై అలుపెరగని పోరాటం చేశారని అన్నారు.

## అనువాద సాహితీ పురస్కార దరఖాస్తులకు ఆహ్వానం

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :** నాగభైరవ సాహిత్య పీఠం ఆధ్వర్యంలో 2025 సంవత్సరం అనువాద సాహిత్యానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నాగ భైరవ సాహిత్య పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.జాతీయ కవి డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు పేరుతో ఒంగోల్లో నెలకొల్పిన నాగభైరవ సాహిత్య పీఠం గతంలో ప్రధానం చేసివిధంగానే ఈ సంవత్సరం కూడా నాగ భైరవ సాహితి పురస్కారం కోసం ముద్రిత గ్రంథాలను ఆహ్వానిస్తున్నటుల తెలిపారు. రచయితలు వారి రచలను 10 మే 2025 నాటికి డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ వెంకటసాయి రెసిడెన్సీ ప్లాట్ నెం 202, రామయ్య నగర్ 2వ లైన్,ఒంగోలు అనే చిరునామాకు పంపాలన్నారు. పూర్తి వివరాలకు 98497 99711 అనే మొబైల్ నంబర్‌ను సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## జగిత్యాల జిల్లా కేంద్రంలో ఎసిబి దాడులు

### ఏడు వేల రూపాయల లంచం తీసుకుంటూ పట్టుబడిన సీనియర్ అకౌంటెంట్ రఘుకుమార్

### కరీంనగర్ ఎసిబి కోర్టుకు తరలింపు



**జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త:** జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయంలోని జిల్లా ట్రెజరీ కార్యాలయంలో శుక్రవారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఎసిబి డిఎస్పి రామాణ మూర్తి తెలిపిన కథనం ప్రకారం కోరుట్ల పోలీస్ స్టేషన్లో పోలీస్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న పవన్ కుమార్ తన వేతనం సంబంధించిన సిపిఎస్ సంబంధించిన డబ్బులు తీసుకోవడానికి జిల్లా ట్రెజరీ కార్యాలయం వచ్చాడు. సిపిఎస్ సంబంధించిన డబ్బులు చాలా రోజులైనా తన అకౌంట్లో జమ కావడం లేదు. సిపిఎస్ డబ్బులు విషయమై జిల్లా ట్రెజరీ సీనియర్ అకౌంటెంట్ అరిగే రఘు కుమారులు సంప్రదించగా 7000 రూపాయలు ఇస్తే పని చేసి పెడతానని ఒప్పందం కుదుర్చుకున్నారు. పవన్ కుమార్ సంబంధించిన సిపిఎస్ డబ్బులు ఒక లక్షా నాలుగు వేల రూపాయలు తన అకౌంట్లో జమ అయినాయి. ఒప్పందం ప్రకారం తనకు 7000 ఇవ్వవలసి ఉన్నదని అకౌంటెంట్ రఘుకుమార్ కానిస్టేబుల్ పవన్ కుమాఆర్ కు రోజు ఫోన్ చేసి డబ్బులు కావాలని అడుగుతున్నాడు. దీంతో బాధితుడు పవన్ కుమార్ మార్చి 24వ తేదీన కరీంనగర్ లోని ఏసీబీ అధికారులను సంప్రదించే విషయం మొత్తం తెలిపాడు. ఏసీబీ అధికారులు చెప్పిన విధంగా బాధితుడు పవన్‌కుమార్ అకౌంటెంట్ రఘుకుమార్‌కు ఫోన్‌చేసి శుక్రవారం ఉదయం హనుమాన్ జయంతి సందర్భంగా కొండ గట్టుకు డ్యూటీకి వెళుతున్నానని మధ్యలో జిల్లా ట్రెజరీ కార్యా లయానికి వచ్చి 7000 రూపాయలను ఇస్తానని తెలిపాడు. ఇట్టి విషయం ఏసీబీ అధికారులు తెలపడంతో ఉదయమే కరీంనగర్ నుండి ఏసీబీ అధికారులు జగిత్యాల జిల్లా ట్రెజరీ కార్యాలయానికి చేరుకున్నారు.

ఏసీబీ అధికారులు కెమికల్ పూసి ఇచ్చిన డబ్బులను పవన్ కుమార్ జిల్లా ట్రెజరీ కార్యాలయంలోనికి వెళ్లి సీనియర్ అకౌంటెంట్ రఘు కుమారులకు డబ్బులు ఇచ్చాడు డబ్బులు తీసుకున్న వెంటనే అక్కడే ఉన్న ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా రఘు కుమారును డబ్బులతో సహా పట్టుకున్నారు. విచారించిన అనంతరం అకౌంటెంట్ రఘు కుమార్ ను కరీంనగర్ ఏసీబీ కోర్టుకు తరలించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా లంచాల కోసం డిమాండ్ చేస్తే 91543 88954 కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు. ఈ దాడులలో ఏసిబి ఇన్స్పెక్టర్లు కృష్ణమూర్తి, పున్నం చందర్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అనర్హుల వేట

**వారి ఇళ్లను వెనక్కి తీసుకునే ఆలోచనలో అధికారులు**

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :** ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా రేవంత్ ప్రభుత్వం తొలివిడతలో 71 వేల మందికి ఇళ్లు మంజూరు చేసింది. అయితే వీరిలో అనర్హులు ఎక్కువ మంది ఉన్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో మరోసారి రీవెరిఫికేషన్ చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇచ్చిన మంజూరు పత్రాలను సైతం వెనక్కి తీసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. తెలంగాణలోని ఇండ్లు లేని నిరుపేదల కోసం రేవంత్ సర్కార్ ఇందిరమ్మ ఇండ్ల పథకం తీసుకొచ్చిన సంగతి తెలిసిందే.ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా తొలివిడతలో 71 వేల మందికి ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసింది. అయితే వీరిలో చాలా మంది అనర్హులు ఉన్నట్లు అధికారులకు ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో సర్కార్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఇళ్లు ఉన్నవారి పేర్లు లిస్టులో ఉండటం, వాళ్లు ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించకపోవడంపై అధికారులు ఆరా తీస్తున్నారు. మరోసారి రీవెరిఫికేషన్‌కు అధికారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. అలాగే వారికి ఇచ్చిన ఇంటి మంజూరు పత్రాలను తిరిగి వెనక్కి తీసుకోవాలని కూడా భావిస్తున్నట్లు సమాచారం.కాగా, ఈ పథకాన్ని దశలవారీగా అమలు చేయాలని యోచిస్తున్నారు. మొదటి దశలో సొంత స్థలం ఉన్నవారికి సహాయం అందించడంపై దృష్టి సారించారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్లు కేటాయించనున్నారు. మహిళల పేరుతోనే ఇండ్లు మంజూరు చేస్తారు. దారిద్ర్య రేఖ కింద ఉన్నవారు, రేషన్ కార్డు ఉన్నవారు ఈ పథకానికి అర్హులు. గుడిసెలు, మట్టి గోడలు, తాత్కాలిక ఇళ్లలో నివసించేవారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రజా పాలన, గ్రామ సభల్లో ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. సొంత స్థలం ఉన్న అర్హులైన లబ్దిదారులకు గృహ నిర్మాణం కోసం ఈ పథకం కింద రూ.5 లక్షల ఆర్థిక సహాయం 100 శాతం సబ్సిడీగా అందజేస్తారు. ఈ పథకం కింద నిర్మించే ఇండ్లు కనీసం 400 చదరపు అడుగులు ఉండాలి. ప్రతి ఇంట్లో ఆర్‌సిసి పై కప్పు,మరుగుదొడ్డి తప్పని సరిగా నిర్మించాలి. ఈ పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తామని,గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇది వరకే ప్రకటించారు. లబ్ధిదారుల ఎంపికలో ఎటువంటి అవకతవకలు ఉండవని.. అర్హులైన వారికే ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. ఒకవేళ ఇండ్లు మంజూరు చేసినా వాటిని వెనక్కి తీసుకుంటామన్నారు. అందులో భాగంగానే.. తాజాగా అనర్హులకు ఇచ్చిన ఇండ్లను వెనక్కి తీసుకోవాలని భావిస్తోంది. దశలవారీగా అమలు చేయాలని యోచిస్తున్నారు. మొదటి దశలో సొంత స్థలం ఉన్నవారికి సహాయం అందించడంపై దృష్టి సారించారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్లు కేటాయించనున్నారు. మహిళల పేరుతోనే ఇండ్లు మంజూరు చేస్తారు. దారిద్ర్య రేఖ కింద ఉన్నవారు, రేషన్ కార్డు ఉన్నవారు ఈ పథకానికి అర్హులు. గుడిసెలు, మట్టి గోడలు, తాత్కాలిక ఇళ్లలో నివసించేవారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రజా పాలన, గ్రామ సభల్లో ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. సొంత స్థలం ఉన్న అర్హులైన లబ్ధిదారులకు గృహ నిర్మాణం కోసం ఈ పథకం కింద రూ.5 లక్షల ఆర్థిక సహాయం 100 శాతం సబ్సిడీగా అందజేస్తారు. ఈ పథకం కింద నిర్మించే ఇండ్లు కనీసం 400 చదరపు అడుగులు ఉండాలి. ప్రతి ఇంట్లో ఆర్‌సిసి పైకప్పు, వంటగది, మరుగుదొడ్డి తప్పనిసరిగా నిర్మించాలి. లబ్ధిదారుల ఎంపికలో ఎటువంటి అవకతవకలు ఉండవని.. అర్హులైన వారికే ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. ఒకవేళ ఇండ్లు మంజూరు చేసినా వాటిని వెనక్కి తీసుకుంటామన్నారు. అందులో భాగంగానే.. తాజాగా అనర్హులకు ఇచ్చిన ఇండ్లను వెనక్కి తీసుకోవాలని భావిస్తోంది.



## సన్నబియ్యంతో నిరుపేదల కడుపు నింపుదాం

**పౌర సరఫరాల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

**హైదరాబాద్, ఏప్రిల్ 11,ప్రభాతవార్త:** సన్నబియ్యం సంబరాలతో నిరుపేదలకు పౌష్టికాహారం అందించి కడుపునింపేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు సన్నద్ధం కావాలని నీటిపారుదల,పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్,నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కలిసి గాంధీభవన్ నుంచి సన్నబియ్యం ధాన్యం కొనుగోలు అంశాలపై కాంగ్రెస్ నాయకులు, మండల అధ్యక్షులు బ్లాక్ అధ్యక్షులు కాంగ్రెస్ నాయకులతో జూమ్ సమావేశం నిర్వహించారు. గతంలో దొడ్డుబియ్యం ఇస్తే ఎవ్వరు తినలేదని అన్ని పక్కదారి పట్టాయని అన్నారు. మనం చరిత్రలో నిలిచిపోయేలా సన్నబియ్యం అందించాలని నిర్ణయించామని వివరించారు. బిజెపి, బిఆర్ఎస్ కడుపు మంటటతో మాట్లాడుతున్నారని విమర్శించారు.నేను వివాదం చేయదల్చుకోలేదుకానీ ప్రతిపక్షాలు ఏదో మాట్లాడాలని మాట్లాడుతున్నారని ఆయన అన్నారు.కడుపు నిండా భోజనం పెట్టె కార్యక్రమం నేను ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు.సన్నబియ్యం పై అద్భుతమైన స్పందన ప్రజల నుండి వస్తుందని స్వోత్కర్షలు చెప్పారు. ఎవరో ఒకరు విమర్శలు చేసి దాని సొంటిటి దెబ్బతియ్యవద్దు.మంచి ఫైన్ రైస్ బిఆర్ఎస్ బీజేపీ ఇచ్చారా అని ప్రశ్నించారు. అలాంటి మాట్లాడం కరెక్టు కాదు.2.8 కోట్ల జనాభాకు దొడ్డు బియ్యం ఇస్తూ 10 వేల కోట్లు గతం లో ఖర్చు చేశారని ఆరోపించారు.3.10 కోట్ల మంది లబ్ధిదారులకు సన్నబియ్యం ఇవ్వడానికి 13 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని అన్నారు. గతంలో నాణ్యత సరిగా లేకపోతుండే ఎవరు తినకపోతుండేదని అన్నారు. విప్లవాత్మక మార్పు మా ప్రభుత్వం తీసుకున్నాం అని అన్నారు.గతానికంటే ఖర్చు అధికంగా చేస్తున్నామని తెలిపారు..నిరుపేదల కడుపు నింపడానికి ఖర్చు చేస్తున్నామని అన్నారు. సన్నబియ్యం పథకం జనాల్లోకి ప్రాచుర్యకం కలిగించేలా తీసుకుని వెళ్ళాలి అని నాయకుల కోరుతున్నానని అన్నారు..కాళేశ్వరం కూలిన తర్వాత రికార్డ్ స్థాయి పంట 66.7 లక్షల ఎకరాల్లో వరి ధాన్యం పడిందని ఆయన వివరించారు.10 ఏండ్ల బిఆర్ఎస్ హాయములో పండని పంట కాంగ్రేస్ హాయములో పడింది.రైతు పక్ష పాత ప్రభుత్వం అని చెప్పాడనికి పండిన పంట శాతం నిదర్శనమని అన్నారు.ధాన్యం కొనుగోలు అంశంలో కమిటెడ్ గా ఉన్నాం అని చెప్పారు. సరైన ధర కోసం చర్యలు తీసుకుంటున్నాంమని బోనస్ కోసం నిధులు కూడా కేటాయించామని తెలిపారు. టిపిసిసి చీఫ్ మాట్లాడుతూ ఉగాది రంజాన్ సందర్భంగా సన్నబియ్యం పంపిణీ చేయడం మొదలు పెట్టామని తెలిపారు.

## ఇంధన భద్రతలో బొగ్గు గనులు కీలకం

**కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి**

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** దేశంలో ఇంధన భద్రత కల్పనలో బొగ్గు గనులు కీలకపాత్ర పోషిస్తున్నాయని కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి చెప్పారు. దేశంలోనే అతి పెద్ద బొగ్గు గని గెవరా గనిని కేంద్ర మంత్రి సందర్శించారు. ఆ గనిలో కార్యకలాపాలపై మంత్రికి అధికారులు ప్రజెంటేషన్ రూపంలో వివరించారు. తదుపరి కిషన్‌రెడ్డి స్వయంగా గనిలోకి దిగి బ్లాస్ట్ ఫ్రీ సర్ఫేస్ మైనర్ సాంకేతికత యంత్రాలతో జరుగుతున్న బొగ్గు తవ్వకాలను పరిశీలించారు. యంత్రాల ఆపరేటర్లను అడిగి వాటి పని తీరు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశీయ విద్యుత్ అవసరాల్లో థర్మల్ విద్యుత్ అత్యధికంగా సరఫరా చేస్తోందన్నారు. దేశ వ్యాప్తంగా విద్యుత్ అవసరాలకు సంబంధించి 70 శాతానికి పైగా బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ ఉత్పత్తి తీరుస్తుందన్నారు. తమ ప్రభుత్వం మైనింగ్ కార్యకలాపాల్లో సుస్థిరతకు ప్రాధాన్యమిస్తోందని వెల్లడించారు. కాలపరిమితి విషయంలో ప్రణాళికాబద్దంగా సరైన పద్దతిలో గనులను మూసివేస్తున్నట్లు తెలిపారు. తదుపరి కేంద్ర మంత్రి బొగ్గు గని కార్మికులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

## సామాజిక రుగ్మతలపై పోరాట యోధుడు పూలే

**బిజెపి కార్యాలయంలో ఘనంగా జయంతి వేడుకలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** సంఘ సంస్కర్త, సామాజిక రుగ్మతలపై పోరాట యోధుడు, కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడి, బాలికల విద్య, స్త్రీ హక్కులు, వితంతు పునర్వివాహానికి కృషిచేసిన మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు, బిజెపి ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు, బిజెపి రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి గౌతం రావు , తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో తీసుకు వస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు మహాత్మా జ్యోతిబా పూలే ఆశయాలకు అనుగుణంగా కొనసాగుతున్నాయన్నారు. సామాజిక న్యాయం సూత్రంతో, సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ నినాదంతో మోడీ ప్రభుత్వం అన్ని వర్గాలను ముందుకు తీసుకెళ్లుందన్నారు. బిసిలకు, ఎస్సీ, ఎస్టీకు, పేద అగ్రవర్ణాల వారికి కూడా న్యాయమైన రిజర్వేషన్లు కల్పించిందన్నారు. అభినవ జ్యోతిబాపూలేగా మోడీ కొనియాడబడుతున్నారన్నారు.

## హనుమాన్ జయంతి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

**నేడు మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు, కల్లు దుకాణాలు బంద్**

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** హనుమాన్ జయంతి వేడుకలకు పోలీసులు భారీ ఏర్పాట్లు చేశారు. మంగళవారం నాడు ఈ వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నా హైదరాబాద్‌లో జరిగే ఉత్సవాలే హైలైట్‌గా నిలుస్తాయి. గౌలిగూడలోని రాంమందిర్ నుంచి సికింద్రాబాద్ తాడ్‌బండ్‌లో గల హనుమాన్ దేవాలయం వరకు 12 కిలోమీటర్ల దూరం వరకుసాగే ఊరేగింపులో వేలాది మంది ప్రజలు పాల్గొనడం తెలిసిందే. ఇందుకోసం నగర పోలీసు విభాగం తరపున ఎనిమిది వేల మంది పో లీసులను బందోబస్తు కోసం నియమించారు. ఇదే సమయంలో ఊరేగింపు సాగే మార్గాలలో పరిమిత గంటల పాటు ట్రాఫిక్ ఆంక్షలను విధించారు. గౌలిగూడలో గల రాం మందిర్ నుంచి సికింద్రాబాద్‌లో గల తాడ్‌బంద్ హనుమాన్ దేవాలయం వరకు హనుమాన్ జయంతి విజయ యాత్ర పేరిట ఊరేగింపు నిర్వహిస్తారు. సంఘ్ పరివార్ ఆధ్వర్యంలో సాగే ఈ ఊరేగింపులో ఆయా ప్రాంతాల నుంచి ఇంకొన్ని ఊరేగింపులు కలుస్తుంటాయి.

**ట్రాఫిక్ ఆంక్షలు.. వాహనదారులకు సూచనలు**

కాగా హనుమాన్ జయంతి వేడుకల సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాలలో మంగళవారం ఉదయం 11.30 గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు గంటన్నర నుంచి రెండు గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ప్రధాన ఊరేగింపుతో పాటు కర్మన్‌ఘాట్ నుంచి వచ్చే రెండవ ఊరేగింపు సాగే మార్గాలలో ఈ ట్రాఫిక్ ఆంక్షలు వుంటాయి. ఈ సమయంలో వాహనాలను గంటన్నర నుంచి రెండు గంటల పాటు ఇతర మార్గాల గుండా మళ్లిస్తారు. ఈ సమయంలో ఊరేగింపు సాగే మార్గాలలో ప్రయాణించే వాహనదారులు పోలీసులు సూచించిన మార్గాలలో ప్రయాణించాలని అధికారులు కోరారు.

## సామాజిక న్యాయానికి దిశానిర్దేశం చేసిన మహనీయుడు పూలే

**సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్‌ను సందర్శించిన డిప్యూటీ సీఎం భట్టి**



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 11:** ఈ దేశంలో సామాజిక న్యాయం కోసం పెద్ద ఎత్తున పోరాటం చేసి, ఆ వర్గాలకు దిశా నిర్దేశం చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు కొనియాడారు. శుక్రవారం యూసఫ్ గూడ సమీపంలోని సిడిఎస్ (సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్) కేంద్రంలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులు అర్పించిన అనంతరం డిప్యూటీ సీఎం మీడియాతో మాట్లాడారు. దేశంలోని అనేకమంది వెనుకబడిన వర్గాలు ప్రధానంగా మహిళలకు సామాజిక న్యాయం జరగాలని జ్యోతిరావు పూలే పెద్ద ఎత్తున పోరాటం చేసి ఈ దేశంలో ఆ వర్గాలకు దశా దిశా నిర్దేశం చేశారని డిప్యూటీ సీఎం తెలిపారు. పూలే జయంతి సందర్భంగా అందరం స్మరించుకుంటూ వారు చూపిన మార్గంలో ప్రయాణిస్తూ వారి ఆశయాలు నెరవేర్చడం కోసం కాంగ్రెస్ పార్టీ, ప్రజా ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని తెలియజేశారు. సమాజంలో బడుగు బలహీన వర్గాల కోసం పనిచేయాలన్న ఆలోచన ఉన్న ప్రతి ఒక్కరు పూలే జయంతి సందర్భంగా మరోసారి ఆ వర్గాల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేయాలని కోరారు. బడుగు బలహీనవర్గాలు ఆర్థికంగా నిలదుక్కొని సమాజంలో తలెత్తుకొని ఆత్మగౌరవంతో బతికేందుకు అంతా కృషి చేయాలి అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను పూలే గురువుగా భావించి వారి సిద్ధాంతాలను ఆచరణలో పెట్టారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, సిడిఎస్ ఛైర్మెన్ మల్లేపల్లి లక్ష్మయ్య, సీనియర్ జర్నలిస్టు రామచంద్ర మూర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతర సిడిఎస్ డిప్యూటీ సీఎం పరిశీలించారు. సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ కేంద్రంలో ఉన్న వసతులు, ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాలు తదితర విషయాలను నిర్వాహకులు, అధికారులను అడిగి తెలుసు కున్నారు. సెంటర్ లోని అన్ని ఫ్లోర్లలో తిరిగి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## రజతోత్సవాలకు అనుమతించేలా పోలీసులను ఆదేశించండి

**హైకోర్టులో బిఆర్ఎస్ పిటిషన్, విచారణ 17కు వాయిదా**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 11:** రజతోత్సవ వేడుకలకు అనుమతించేలా పోలీసులను ఆదేశించాలంటూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను హైకోర్టు 17వ తేదీకి వాయిదా వేసింది. హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, వరంగల్ కమిషనర్, కాజీపేట ఏసీపీకి నోటీసులు హైకోర్టు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా ఆదేశించింది. బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించడానికి నిర్ణయించింది. వేడుకలు, సభ నిర్వహించుకోవడానికి అనుమతి ఇవ్వాలని బీఆర్ఎస్ నేతలు వరంగల్ పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు.

వరంగల్ పోలీసులు అనుమతి నిరాకరించడంతో బీఆర్ఎస్ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు వేడుకలు, సభ నిర్వహించుకునేలా అనుమతి ఇచ్చేందుకు పోలీసులకు ఆదేశాలు జారీ చేయాలని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది కోర్టును కోరారు. కౌంటర్ దాఖలు చేయడానికి సమయం కావాలని హోంశాఖ తరఫు న్యాయవాది కోర్టును కోరారు.

సభకు ఏర్పాట్లు చేసుకోవడానికి బీఆర్ఎస్ శ్రేణులకు సమయం కావాలి కదా అని హోంశాఖ న్యాయవాదిని హైకోర్టు ప్రశ్నించింది. శాంతిభద్రతల సమస్య, ఇంటిలిజెన్స్ రిపోర్టును పరిగణలోకి తీసుకొని అనుమతి ఇవ్వాల్సి ఉంటుందని, దీనికి సంబంధించిన వివరాలు సేకరించడానికి సమయం పడుతుందని హోంశాఖ న్యాయవాది కోర్టుకు తెలిపారు. 21వ తేదీ వరకు సమయం ఇవ్వాలని కోరగా దానికి నిరాకరించిన హైకోర్టు 17వ తేదీ వరకు సమయం ఇచ్చి కౌంటర్ దాఖలు చేయాలని హోంశాఖ న్యాయవాదిని ఆదేశించింది.

## బిఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ సభకు పట్నం అవినాష్‌రెడ్డి రూ.25 లక్షల విరాళం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 11:** బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే రజోతోత్సవ సంబురం సభకు పార్టీ రంగారెడ్డి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పట్నం అవినాష్ రెడ్డి తన వంతు సహకారాన్ని అందిస్తున్నారు. ఇందులో భాగంగా తన వంతుగా పార్టీ కోసం రూ.25 లక్షల చెక్కును ఆయన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావుకు అందించారు. ఈ సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అవినాష్ రెడ్డిని అభినందించారు. పార్టీ కార్యకర్తగా కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ కేటీఆర్, హరీష్‌రావు, సబిత ఇంద్రారెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి తదితరులతో కలిసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అవినాష్ రెడ్డి అన్నారు.

## సైబర్ క్రైం పోలీసులకు పట్టుబడిన ఇద్దరు కేటుగాళ్లు

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** పెట్టుబడుల పేరిట అమాయకుల నుంచి లక్షలాది రూపాయలను వసూలు చేసి వారిని మోసం చేస్తున్న ఇద్దరు సైబర్ నేరగాళ్ల ను సిటీ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. ఇద్దరు నేరగాళ్లలో ఒకడు ఢిల్లీ వాసి కాగా మరొకడు సంగారెడ్డి జిల్లా వాసి. దీనికి సంబంధించిన వివరాలను డిసిపి కవిత శుక్రవారం మీడియాకు వెల్లడించారు. మొదటి ఘటనలో హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తిని ఢిల్లీకి చెందిన నీరజ్ (31) అనే నేరగాడు పెట్టుబడుల పేరిట ఆరు ల క్షల 16 వేల 918 రూపాయలు వసూలు చేసి మోసం చేశాడు. ఈ మోసగాడు దేశ వ్యాప్తంగా 88 మందిని ఇలా మోసం చేసిన కేసుల్లో నిందితుడుగా వున్నాడు. చి న్న మొత్తాలను పెట్టుబడులుగా స్వీకరించి మొదట్లో చిన్నపాటి లాభాలను అందజేసి, పెద్ద మొత్తంలో డబ్బులు రాగానే బిచాణా ఎత్తేయడం ఇతని స్టైల్. హైదరాబాద్ కు చెందిన ఓ బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సైబర్ క్రైం పోలీసులు నిందితుడిని గుర్తించి అరెస్టు చేశారు. నిందితుడిని జైలుకు తరలించి అతని వద్ద నుంచి ఎనిమిది సెల్‌ఫోన్లతో పాటు ఒక లాప్‌టాప్, మూడు పాస్ బుక్కులు ఇంకొన్ని వస్తువులను జప్తు చేశారు.

కాగా మరో ఘటనలో సంగారెడ్డి జిల్లా సదాశివపేటకు చెందిన దర్జి ఉమామహేశ్వర్ (32) హైదరాబాద్‌కు చెందిన ఓ చిరు వ్యాపారిని పెట్టుబడుల స్కాం ద్వారా 10 లక్షల 58 వేల 330 రూపాయలను మోసం చేశాడు. ఇతను కూడా మొదట్లో కొంత లాభాల పేరిట కొంత అందించి ఆ తరువాత బోర్డు తిప్పేసేవాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సైబర్ క్రైం పోలీ సులు నిందితుడిని శుక్రవారం నాడు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. నిందితుడి వద్ద రెండు సెల్‌ఫోన్లతో పాటు మూడు డెబిట్ కార్డులు, ఇంకొన్ని వస్తువులను జప్తు చేశారు. నిందితుడిపై ఇంకొన్ని కేసులున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. రెండు ఘటనల్లోనూ నేరగాళ్ల సోషల్ మీడియా, వెబ్‌సైట్ల ద్వారా డబ్బులను వసూ లు చేసేవారు. ఈ తరహా మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని డిసిపి కవిత కోరారు.

## బిసిల ఆరాధ్య దైవం మహాత్మా జ్యోతిరావుపూలే

**బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

**గుడిమల్కాపూర్‌లో జయంతి వేడుకలు**

**సావనీర్‌ను ఆవిష్కరించిన బిసి కమిషన్ ఛైర్మన్ నిరంజన్, బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్**



సావనీర్‌ను ఆవిష్కరించిన బిసి కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్, బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్

**హైదరాబాద్ (మెహిదీపట్నం), ఏప్రిల్ 11, ప్రభాతవార్త :** బీసీల ఆరాధ్య దైవం...బీసీల హక్కుల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిబా పూలే అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. మహాత్మ జ్యోతిబాపూలే నూట తొంబై ఎనిమిదవ జయంతి సందర్భంగా కార్వాన్ బి.సి ఐక్యవేదిక ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్ శారద నగర్ చౌరస్తా లోని మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహం వద్ద ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాల్గొని మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... సమాజంలోని బీసీలకే కాకుండా అందరికీ స్ఫూర్తిగా నిలిచే వ్యక్తి మహాత్మ జ్యోతిబాపూలే అని కొనియాడారు. ఆయన సమాజం కోసం చేసిన మంచి పనులను దృష్టిలో ఉంచుకొని ఆయన మార్గదర్శనంలో మనమంతా నడవాలని సూచించారు సామాజిక న్యాయం కోసం జ్యోతిబాపూలే చేసిన సేవలు మరువలేని అని అన్నారు. బీసీల ఆరాధ్య దైవం అయినటువంటి మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహం తెలంగాణ అసెంబ్లీలో ప్రతిష్టించాలని తాము డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈరోజు జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి అసెంబ్లీలో కాకుండా ట్యాంక్‌బండ్ వద్ద జ్యోతిబాపూలే విగ్రహం ప్రతిష్టిస్తామని తెలపడంతో పాటు స్థల పరిశీలన చేయడం హర్షించదగ్గ విషయమని, తాము ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు కవిత తెలిపారు. అసెంబ్లీలో మాత్రం జ్యోతిబాపూలే విగ్రహం ప్రతిష్టించే వరకు తమ బిఆర్ఎస్ పార్టీ విశ్రమించేది లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ నిర్ణయించడం కూడా సరైనది అయినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం అఖిలపక్షంతో కలిసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి బీసీ బిల్లు అమలయ్యేలా చర్యలు చేపట్టాల్సి న అవసరం ఉందన్నారు. బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సావనీర్ ను బీసీ కమిషన్ ఛైర్మన్ జి నిరంజన్, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ లు బీసీ ఐక్యవేదిక ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. స్థానిక ఎమ్మెల్యే కౌసర్ మోహిద్దీన్ కార్యక్రమంలో పాల్గొని మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఠాకూర్ అమర్ సింగ్, ఠాగూర్ జీవన్ సింగ్, ఉస్మాన్ బిన్, దేవర శ్రీనివాస్, అనిల్ చారి, నాగారం వేణు గౌడ్, ముత్యాల భాస్కర్, దేవర వంశీ కార్వాన్ బీసీ ఐక్య వేదిక ప్రతినిధులు బండారి శ్రీనివాస్, మల్లికార్జున్ అడిగి, కొల్లూరి అనిల్ కుమార్, జింక కృష్ణ సలహాదారులు నర్సింగ్ దాస్, చీమల శంకర్ పంబి శ్రీనివాస్, సోమని వెంకటేష్, నర్సింగ్ రావు ప్రవీణ్ యాదవ్ లు పాల్గొన్నారు

## నెక్లెస్‌రోడ్‌లో పూలే విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 11:** నెక్లెస్ రోడ్ ఐమాక్స్ సమీపంలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు.సీఎంతో పాటు స్థలపరిశీలనకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, బీసీ సంఘాల నేతలు జాజుల శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు. స్థలం సర్వే చేసి పూర్తిస్థాయి ప్రణాళికలతో నివేదికను అందించాలని అధికారులను సిఎం ఆదేశించారు. భవిష్యత్‌లో ట్రాఫిక్ తదితర సమస్యలు తలెత్తకుండా జాగ్ర త్తలు తీసుకుని డిజైనింగ్ చేయాలని అధికారులకు సిఎం సూచించారు.

## 21న సిడబ్ల్యుసి సమావేశం

**హైదరాబాద్,ఏప్రిల్ 11,ప్రభాతవార్త:** గోదావరి నదిలో నీటి లభ్యతపై ఈనెల 21న కేంద్రజలసంఘం సమావేశం నిర్వహిస్తోన్నది. హైడ్రోలాజీ డైరెక్టర్ 2023 జూన్ 26న గోదావరి దాని ఉప బేసిన్‌లో నీటి లభ్యతపై జిఆర్ఎంబికి పంపిన లేకపై సమావేశం జరుగుతోందని జలశక్తి మంత్రిత్వశాఖ తెలిపింది. సిడబ్ల్యుసి ఛైర్మన్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంకు తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రతినిధులు పాల్గొనాలని చీఫ్ ఇంజనీర్ సంజయ్ కుమార్ గంగావర్ తెలిపారు.

## 15 నుంచి టెట్ దరఖాస్తుల స్వీకరణ

**నెలాఖరు వరకు దరఖాస్తులకు అవకాశం**

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మరోసారి టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)కి ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ నెల 15 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్టు ప్రకటించింది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను పాఠశాల విద్య డైరక్టర్, టెట్-2025 ఛైర్‌పర్సన్ ఈవి నరసింహారెడ్డి శుక్రవారం విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఈ నెల 15 నుంచి 30 వరకు స్వీకరించనూన్నరు. పేపర్-1, పేపర్-2కి రూ.750గా పరీక్ష ఫీజును నిర్ణయించారు. రెండు పేపర్లు రాయాలనుకునే వారు రూ. 1000 ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. జూన్ 15 నుంచి 30 వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సిబిటి) విధానంలో పరీక్షలను నిర్వహించనున్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లలో పరీక్షలను నిర్వహించనున్నారు.

## కూతుర్ని చంపిన తల్లికి ఉరిశిక్ష

**సూర్యాపేట జిల్లా కోర్టు సంచలన తీర్పు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 11:** సూర్యపేట జిల్లా కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తన కూతుర్ని హత్య చేసిన కేసులో తల్లికి ఉరిశిక్ష విధించింది. ఈ ఘటన 2021 ఏప్రిల్ మోతె మండలంలోని మేకలపాటి తండాలో జరిగింది. నిందితురాలైన తల్లి, మానసిక స్థితి సరిగా లేని తన కూతుర్ని హత్య చేసినట్లు కోర్టు విచారణలో తేలింది. కేసు వివరాలు, సాక్ష్యాలు, న్యాయవాదుల వాదనల ఆధారంగా జిల్లా కోర్టు ఈ కఠిన తీర్పును వెలువరించింది.

## సచివాలయంలో మరో నకిలీ ఉద్యోగి పట్టివేత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 11:** తెలంగాణ సచివాలయంలో మరో నకిలీ ఉద్యోగిని పోలీసులు పట్టుకున్నారు. ఇప్పటికే పలువురు ఉద్యోగుల పేరుతో సచివాలయంలోకి వెళ్లడానికి ప్రయత్నించగా వారిని పోలీసుల తనిఖీల్లో పట్టుకున్నారు. తాజాగా శుక్రవారం సమీర్ అనే వ్యక్తి ఆన్ గౌట్ డ్యూటీ ఇన్ సెక్రటేరియట్ అంటూ వాహనంపై రాసి ఉన్న వాహనంతో లోపలికి వెళ్లడానికి ప్రయత్నించారు. అయితే పోలీసులు వాహన తనిఖీల్లో భాగంగా ఆయనను ప్రశ్నించడంతో అసలు విషయం బయటపడింది. పోలీసులు వివరాలు రాబట్టడానికి ప్రయత్నించడంతో తాను ఉద్యోగిని కాదని సమీర్ పోలీసులు ముందు ఒప్పుకున్నారు. తాను సచివాలయంలో ఎవరికైనా పనులు చేసే బ్రోకరి తరహాలో పనులు చేయిస్తున్నానని తెలిపారు.దీంతో పోలీసులు సైఫాబాద్ పోలీసులకు అప్పగించి అతనిపై కేసు నమోదు చేశారు. అతని వాహనాన్ని సీజ్ చేశారు.

## ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం

**నిందితుడికి 25 యేళ్ల జైలు శిక్ష**



శ్రీనివాస్

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** ఎనిమిదేళ్ల మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి నాంపల్లి కోర్టు 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ సంచల న తీర్పు ఇచ్చింది. శుక్రవారం నాడు ఈ తీర్పు వెలువడింది. వివరాలు ఇలావున్నాయి, రాజ్‌భవన్ సమీపంలోని బిఎస్ మక్తాలో వుండే 40ఏళ్ల గుట్ల శ్రీనివాస్ అనే వ్యక్తి హైస్ కీపింగ్ చేస్తుండేవాడు. 2023 ఫిబ్రవరి నెలలో తన ఇంటి సమీపంలోనే వుండే బాలికకు సెల్‌ఫోన్ ఆశచూపి ఇంట్లోకి తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో బాలిక తీవ్రంగా అనారోగ్యానికి గురికాగా విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం బాలికకు ఉస్మాని యా ఆసుపత్రిలో వైద్యం అందించడంతో కోలుకుంది. కాగా ఈ కేసులో బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడి పై ఫోక్సో చట్టంతో పాటు ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు చేసి జైలుకు తరలించారు. అనంతరం ఈ కేసులో బాలిక వాంగ్మూలంతో పాటు పోలీసుల ఛార్జిషీట్ బలం గా వుండడంతో కోర్టులో వాదనలు జరిగాయి . ఇరుపక్షాల వాదనలు విన్న తరువాత శుక్రవారం నాడు నాంపల్లి 12వ అదనపు సెషన్ జడ్జి అనిత నిందితుడు శ్రీనివాస్‌కు 25 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు ఐ దు వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసులో సైఫాబాద్ ఎసిపి సంజయ్ కుమార్ నిందితుడికి కఠిన శిక్ష పడడంలో కీలకంగా వ్యవహరించగా అదనపు పిపిగా రాంరెడ్డి వాదనలు వినిపించారు.

# 'షష్టి పూర్తి' చూడండి.. రవితేజ

నటకిరీటి డా.రాజేంద్రప్రసాద్, జాతీయ ఉత్తమ నటి అర్చన కాంబినేషన్‌లో రూపేష్, ఆకాంక్ష సింగ్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం షష్టి పూర్తి. పవన్ ప్రభ దర్శకత్వంలో మా ఆయి ప్రొడక్షన్స్ పతాకంపై రూపేష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మేస్ట్రో ఇళయరాజా ఈ చిత్రానికి సంగీత దర్శకుడు. ఇందులో తొలిపాటను ఆస్కార్ విన్నర్ కీరవాణి రచించగా ఇటీవల విడుదల చేశారు. సంచలన సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ విడుదల చేసిన ఈ పాటకు అద్భుతమైన రెస్పాన్స్ లభించింది. రెండో పాటను మాస్ మహారాజా రవితేజ ఆవిష్కరించి, యూనిట్‌కి బెస్ట్ విషెస్ చెప్పారు. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ, మా రాజేంద్రప్రసాద్ అన్నయ్య షష్టి పూర్తి చూడండి..



డెఫినెట్‌గా బావుంటుంది. మంచి ఫీల్ గుడ్ సినిమా అవుతుందనిపిస్తోంది. దర్శక నిర్మాతలకు, ఆర్టిస్టులకు అందరికీ ఆల్ ది బెస్ట్ అని చెప్పారు. ఇరు కనులు కనులు కలిసి మురిసె మొదటి చూపులో తొలి పిలుపు తగిలి మెరుపు మెరిసే మనసు నింగిలో అంటూ రెహమాన్ రాసిన ఈ పాటను ఎస్పీ చరణ్, విభావరి ఆలపించారు. ఆ విశేషాలను దర్శకుడు పవన్ ప్రభ తెలియజేస్తూ సినిమాలో చాలా అందమైన యుగళ గీతం ఇది. ఇళయరాజా బాణీ ఇవ్వగానే నాకు సాగర సంగమంలో మోనమేలనోయి పాటలాంటి గొప్ప పాట అవుతుందనే అనుభూతి కలిగింది. ఈ ట్యూన్‌కి రెహమాన్ శరవేగంతో సాహిత్యం సమకూర్చారు. ఇళయరాజా ఒక్క కరక్షన్ కూడా చెప్పకుండా ఓకే చెప్పేశారు. ఎస్పీ చరణ్, విభావరితో ఈ పాట పాడించారు. అసలు ట్యూన్ వినగానే నాదీ, రూపేష్ మొహాలు వెలిగి పోయాయి. ఇక మొత్తం పాట రికార్డు అయ్యాక మా మొహాల్లో వెన్నెల కురిసినంత ఆనందం. అసలు ఈ పాట రికార్డింగ్ కూడా చాలా లవ్లీగా, లైవ్లీగా జరిగింది. సింగర్స్ ఎవరిదారిన వాళ్ళు వచ్చి పాడి వెళ్లిపోకుండా ఇద్దరూ పక్క పక్కన నిలబడి ఓ ఫీల్‌తో ఈ డ్యూయట్‌ని ఆలపించారు. కథలో సమ్మిళితమైన ఈ పాట, ఈ సినిమాకే కొత్త అందాన్ని, అనుభూతిని తీసుకొచ్చింది. ఈ పాట చిత్రీకరణని రాజమండ్రిలో ఈశ్వర్ నృత్య దర్శకత్వంలో తీశాం. మంచి ఎండల్లో అందరూ కష్టపడి, ఇష్టపడి ఈ పాట బాగా రావడానికి సహకరించారు. ముఖ్యంగా మా ఛాయాగ్రాహకుడు రామ్ రెడ్డి. మామూలుగానే గోదావరి అందంగా ఉంటుంది. ఇక తోట తరణి కళా దర్శకత్వ నైపుణ్యం వల్ల ఈ పాటలో గోదావరి రెట్టింపు అందంతో కనిపిస్తుంది. మా హీరో హీరోయిన్లు రూపేష్,ఆకాంక్ష సింగ్‌లపై ఈ పాటను చిత్రీకరించాం" అన్నారు. రాజేంద్ర ప్రసాద్, అర్చన, రూపేష్, ఆకాంక్షా సింగ్, కాంతార ఫేమ్ అచ్యుత్ కుమార్, సంజయ్ స్వరూప్, తెనాలి శకుంతల, ఆనంద చక్రపాణి, రాజ్ తిరందాసు, మురళీధర్ గౌడ్, చలాకి చంటి, బలగం సంజయ్, అనుపమ స్వాతి, రుహీనా, అనిల్, కెపె పాల్ రాము, మహి రెడ్డి, శ్వేతా, లత, ప్రవీణ్ కుమార్, శ్రీధర్ రెడ్డి, అంబరీష్ అప్పాజీ ఇందులో ప్రధాన తారాగణం. షష్టిపూర్తి చిత్రానికి కాస్ట్యూమ్ డిజైనర్: అయేషా మరియం, పబ్లిసిటీ డిజైనర్: అనిల్ భాను, పీఆర్వో: పులగం చిన్నారాయణ, మార్కెటింగ్: టాక్ స్కూప్.

# 'సోదరా' ట్రైలర్ రిలీజ్

వైవిధ్యమైన సినిమాలు, ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసే సినిమాల్లో నటిస్తూ హీరోగా తనకంటూ ప్రేక్షకుల్లో ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న కథానాయకుడు సంపూర్ణేష్ బాబు.. ఈ సారి అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో, అన్నదమ్ముల అనుబంధాన్ని ఆవిష్కరిస్తున్న సోదరా సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ చిత్రంలో సంపూర్ణేష్ బాబుతో పాటు సంజోష్ కూడా ముఖ్యపాత్రలో నటిస్తున్నాడు. సంపూర్ణేష్ బాబు, సంజోష్, ప్రాచీబంసాల్, ఆరతి గుప్తా హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం సోదరా. మోహన్ మేనంపల్లి దర్శకుడు. చిత్రీకరణ పూర్తిచేసుకుని, నిర్మాణానంతర పనులను శరవేగంగా జరుపుకుంటోన్న ఈ చిత్రం ఏప్రిల్ 25న ఈ వేసవిలో ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడానికి థియేటర్స్‌ల్లో విడుదల కాబోతుంది. కాగా ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ చిత్రం ట్రైలర్‌ను ప్రముఖ దర్శకుడు సాయి రాజేష్, కల్ట్ నిర్మాత ఎస్‌కేఎన్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేసి విడుదల చేశారు. ఈ సందర్భంగా సాయి రాజేష్ మాట్లాడుతూ, ఎస్‌కేఎన్ స్పీచ్ విన్న తరువాత ఎమోషన్ అయ్యాను. ఎస్‌కేఎన్ మంచి మనసు నాకు తెలుసు. ఈ సినిమాను ఎంకరైజ్ చేయడానికి తాను ఓ షోను ఏర్పాటు చేస్తానని చెప్పడం నిజంగా గొప్ప విషయం. ఈ సినిమా అందరికి మంచి విజయం అందించాలి. నాకు సంపూ ఉన్న అనుబంధం ప్రత్యేకమైనది. సంపూతో నేను సినిమా తీసి 13 ఏళ్లు అయ్యింది. హృదయ కాలేయం సూపర్‌హిట్ తరువాత సంపూ నన్ను ఆర్థికంగా చాలా ఆదుకున్నాడు.నాకు ఓ కారు, ఇల్లును తాను పెద్ద మొత్తంలో అడ్వాన్స్ కట్టి ఇప్పించాడు. నాకు సంపూ ఎప్పుడూ తోడుగా ఉన్నాడు. సినిమా ఎన్నో మ్యాజిక్కులు చేస్తుంది. సంపూను చూస్తే ఎంతో గర్వంగా అనిపిస్తుంది. తాను సంపాదించుకున్న డబ్బులో అందరికి సహాయం చేస్తుంటాడు. సంపూ నా దృష్టిలో స్టార్. ఏ రోజుకైనా మా ఇద్దరం ఒకరికొకరం ఉంటాం. ఈ సినిమా సంపూ కెరీర్‌లో మంచి విజయం సాధించాలి అన్నారు. ఎస్‌కేఎన్ మాట్లాడుతూ, చిన్న సినిమాను ప్రమోషన్ చేయడానికి వచ్చిన మీడియాకు థ్యాంక్స్. నాకు సంపూ అంటే చాలా ఇష్టం. అందుకే ఈ ఫంక్షన్‌కు వచ్చాను. సంపూకు సాయిరాజేష్ అంటే చాలా ఇష్టం. అందరూ చేస్తున్న ప్రయత్నం విజయవంతం కావాలి అన్నారు. బాబు మోహన్ మాట్లాడుతూ, ఈ సినిమాను ఓ పిక్నిక్‌లా చేశాం. మంచి కుటుంబ అనుబంధాలతో ఈ సినిమా ఉంటుంది. అందరూ తప్పకుండా చూడాల్సిన సినిమా ఇది. చక్కని ఫ్యామిలీ ఎంటర్ టైనర్ ఇది. ఈ సినిమాను అందరూ ఆదరించాలని కోరుకుంటున్నాను. నేను ఇంతకు ముందు ఎన్ని పాత్రలు చేసినా, అన్ని కామెడీ పాత్రలు ఒకదానికొకటి సంబంధం ఉండదు. సోదరాలో కూడా నా పాత్ర ఏడిపిస్తుంది. అందరి హృదయాలకు హత్తుకుంటుంది. చక్కని, కథ, కథనాలతో, మంచి నటులతో చేసిన సినిమా చూసి అందరూ ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నాను అన్నారు. సంపూర్ణేష్ బాబు మాట్లాడుతూ, ఈ వేడుక చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది. నన్ను ఈ స్థాయిలో నిలబెట్టిన సాయి రాజేష్ ఈ వేడుకకు రావడం హ్యాపీగా ఉంది. అప్‌డేట్ అయిన తమ్ముడు, అమాయకుడైన అన్న మధ్య జరిగే స్వచ్ఛమైన కథ సోదరా. ఇప్పటి వరకు ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్ కంటెంట్‌కు మంచి స్పందన వచ్చింది. ఇది నేను రియల్‌లైఫ్‌లో ఎలా ఉంటానో అలాంటి పాత్ర ఇది. అందరూ ఈ సినిమాను ఆదరించి మా అందరికి మంచి విజయమందిస్తారని కోరుకుంటున్నాను అన్నారు. హీరో సంజోష్ మాట్లాడుతూ, ఓ సినిమా కష్టపడి తీసిన సినిమాకు ఎస్‌కేఎన్, సాయి రాజేష్ సపోర్ట్ చేయడం ఎంతో హ్యాపీ. పల్లెటూరికి వెళ్లి ఓ కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ములను కలిసి వచ్చిన ఫీలింగ్ కలుగుతుంది.




అన్నదమ్ముల బంధం విలువ చెప్పేసినిమా ఇది. తప్పకుండా అందరికి నచ్చుతుంది. బాబు మోహన్ లాంటి సీనియర్ నటుడుతో పనిచేయడం ఎంతో మంచి ఎక్స్‌పీరియన్స్. కథతో స్టార్‌లను క్రియేట్ చేస్తుంటాడు సాయిరాజేష్. ఆ స్టార్ సంపూ. ఆయనతో పనిచేయడం ఎంతో హ్యాపీగా ఉంది. భవిష్యత్‌లో కూడా సంపూ అన్నతో పనిచేయాలని వుంది.

# ప్రతిష్టాత్మక చిత్రం 'హరి హర వీరమల్లు'

ఈ సంవత్సరం విడుదల కానున్న భారీ భారతీయ చిత్రాలలో హరి హర వీరమల్లు ఒకటి. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. సినీ అభిమానులంతా ఈ చిత్రం కోసం వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నారు. చిత్ర నిర్మాణం తుదిదశకు చేరుకుంది. ప్రస్తుతం రీరికార్డింగ్, డబ్బింగ్ మరియు వీఎఫ్ఎక్స్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రతి ఫ్రేమ్‌ను జాగ్రత్తగా రూపొందిస్తున్నారు, ప్రతి సౌండ్‌ను చక్కగా ట్యూన్ చేస్తున్నారు మరియు విజువల్ ఎఫెక్ట్స్ పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. చిత్ర బృందం ఎక్కడా రాజీ పడకుండా, ప్రపంచం మెచ్చే గొప్ప చిత్రంగా మలచడానికి కృషి చేస్తోంది. ఈ వేసవిలో వెండితెరపై మునుపెన్నడూ చూడని అద్భుతమైన అనుభూతిని ప్రేక్షకులకు అందించడానికి చిత్ర బృందం సిద్ధమవుతోంది. దర్శకుడు ఎ.ఎం. జ్యోతి కృష్ణ గత ఏడు నెలలుగా అవిశ్రాంతంగా పనిచేస్తున్నారు. ఎడిటింగ్ మరియు విఎఫ్ఎక్స్ మొదలుకొని మిగిలిన షూటింగ్‌ను పూర్తి చేయడం వరకు ప్రతి విభాగాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని అనుకున్న సమయానికి ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేలా చేయడంలో జ్యోతి కృష్ణ పాత్ర కీలకం. చారిత్రాత్మక యోధుడు వీరమల్లు పాత్రలో పవన్ కళ్యాణ్ కనువిందు చేయనున్నారు. అగ్ని లాంటి ఆవేశం, న్యాయం చేయాలనే ఆలోచన ఉన్న యోధుడిగా.. మునుపెన్నడూ చూడని సరికొత్త



అవతార్‌లో పవర్ స్టార్ కనిపించ నున్నారు. మొఘల్ రాజుల నుండి కోహినూర్ వజ్రాన్ని దొంగి లించడంతో పాటు, ప్రేక్షకుల మనసు దోచుకోవడానికి ఆయన సిద్ధమవుతున్నారు. ఇది కేవలం కథ కాదు.. ఇది ఒక విప్లవం. న్యాయంకోసం యుద్ధం చేయనున్న వీరమల్లు, మే 9వ తేదీన థియేటర్లలో అడుగు పెట్టనున్నారు. హరి హర వీరమల్లు చిత్రం మే 9న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది. ప్రేక్షకుల్లో నెలకొన్న భారీ అంచనాల నేపథ్యంలో ఈ చిత్రం సంచలన వసూళ్లు రాబడుతుంది అనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి క్రిష్ జాగర్లమూడి, ఎ.ఎం. జ్యోతి కృష్ణ దర్శకులు. కరోనా మహమ్మారి, పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రయాణం కారణంగా చిత్రీకరణ ఆలస్యమైనప్పటికీ, చిత్ర దర్శకత్వ బాధ్యతలు తీసుకున్న ఎ.ఎం.జ్యోతి కృష్ణ, ఎక్కడా రాజీ పడకుండా వేగంగా హరి హర వీరమల్లు సినిమాని పూర్తి చేస్తున్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నారు. కొల్లగొట్టినాదిరో గీతాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# గ్రాండ్ స్కేల్‌లో 'ఓదెల 2' నిర్మించాం..

తమన్నా భాటియా హైలీ యాంటిసిపేటెడ్ మూవీ ఓదెల 2లో నెవర్ బిఫోర్ క్యారెక్టర్‌లో అలరించడానికి సిద్ధంగా వున్నారు. సూపర్ నాచురల్ థ్రిల్లర్ ఓదెల రైల్వే స్టేషన్‌కి సీక్వెల్ ఇది. సంపత్ నంది సూపర్ విజన్‌లో అశోక్ తేజ దర్శకత్వంలో, మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్‌పై డి మధు నిర్మించిన ఈ చిత్రం ప్రమోషనల్ కంటెంట్‌తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. తమన్నా నాగ సాధువుగా, మిస్టరీ ఎనర్జీతో కూడిన పాత్రలో కనిపించనున్నారు. హెబ్బా పటేల్, వశిష్ట ఎన్ సింహా ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా టీజర్ ట్రైలర్ అంచనాలని నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్ళింది. ఈ వేసవిలో బిగ్గెస్ట్ ఎట్రాక్షన్‌లలో ఒకటిగా ఏప్రిల్ 17న ఓదెల2 థియేటర్స్‌లో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత డి మధు విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు. **ఓదెల 2 ప్రాజెక్ట్ ఎలా మొదలైయింది?** ఓదెల ఫస్ట్ పార్ట్ నేను సంపత్ నందిగారికి తెలియకుండానే చూశాను. చూసి చాలా ఎక్సైట్ అయ్యాను. అనుకోకుండా సంపత్ నందిగారే ఓదెల2 కథని నాతో చెప్పడం జరిగింది. నాకు కంటెంట్ చాలా నచ్చింది. అలా ప్రాజెక్ట్ మొదలైంది. **మీరు సినిమాల్లోకి రావడానికి స్ఫూర్తి?** నాకు చిన్నప్పటి నుంచి సినిమా లంటే ఫ్యాషన్ ఉంది. కమర్షియల్ గా కాకుండా సినిమాపై పాషన్ తోనే ఇండస్ట్రీలోకి వచ్చాను. **సంపత్ నందితో మీ కొలాబరేషన్ ఎలా ఉంది?** సంపత్ నందితో నాకు మంచి వేవ్ లెంత్ కుదిరింది. భవిష్యత్తులో ఆయనతో మరిన్ని ప్రాజెక్ట్స్ చేయాలని ఉంది. ఒక మంచి ప్రాజెక్ట్ రావాలంటే ఒక మంచి అండర్ స్టాండింగ్ ఉండాలి. అలాంటి అండర్ స్టాండింగ్ నాకు సంపత్ నందిగారికి మధ్య ఉంది. **తమన్నా క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది?** తమన్నా అద్భుతమైన పెర్ఫార్మన్స్ ఇచ్చారు. ఫస్ట్ లుక్ తోనే ఆ క్యారెక్టర్ ఎక్కడికో వెళ్లి పోయింది. ఈ కథ విషయంలో తమన్నా చాలా ఎక్సైట్ అయ్యారు. చాలా హార్డ్ వర్క్ చేశారు. ఏప్రిల్ మే ఎండల్లో చెప్పులు లేకుండా షూటింగ్ చేశారు. కరెక్ట్ టైంలో కరెక్ట్ కథ ఆమె దగ్గరకు వెళ్లిందని నేను నమ్ముతున్నాను.



నిర్మాత డి మధు

**ప్రమోషనన్స్‌ని చాలా డిఫరెంట్ ప్లాన్ చేయడానికి కారణం?** నాకు మొదటి నుంచి ఏదైనా వెరైటీగా చేయాలని ఉంటుంది. కాశీలో ఈ సినిమాని లాంచ్ చేశాం. అలాగే మహా కుంభమేళాలో టీజర్‌ని లాంచ్ చేసాం. చాలామంది అది రిస్క్‌తో కూడుకున్న వర్క్ ఏమో అనుకున్నారు. అయితే ఎక్కడైతే రిస్క్ ఉంటుందో అక్కడే సక్సెస్ ఉంటుందని ఉంటుందని నా అభిప్రాయం. నేను సినిమాలపై పాషన్ తో ఇండస్ట్రీలోకి వచ్చాను. మంచి కథలు కంటెంట్ ఉన్న సినిమాలను సెలెక్టెడ్‌గా చేయాలనేదే నా ప్రయత్నం. **మీరు కథ వైపు నుంచి ఏవైనా సజెషన్స్ ఇస్తారా?** కచ్చితంగా కథ గురించి మాట్లాడుకుంటాం. చాలా డిస్కషన్స్ జరుగుతాయి. అలాంటిడిస్కషన్ జరిగాయి కాబట్టే ఈ సినిమా అంతా గ్రాండ్‌గా వచ్చింది. తప్పకుండా నేను సెట్స్‌కి వెళ్తాను. సినిమా అవుట్ పుట్ విషయంలో ఎక్కడ రాజీపడకుండా సినిమాని గ్రాండ్ స్కేల్‌లో నిర్మించడం జరిగింది. **సూపర్ నేచురల్ పవర్స్ ఉన్నాయని మీరు నమ్ముతారా?** నమ్మాము కాబట్టే సినిమా తీశాం( నవ్వుతూ) ఈ సినిమా కథ లాజికల్‌గా ఉంటుంది. ప్రతి దానికి ఒక ఆధారంతోనే చూపించడం జరిగింది. ఇందులో చాలా థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉన్నాయి. అవన్నీ కూడా ఆడియన్స్‌ని చాలా సర్ప్రైజ్ చేస్తాయి. **మ్యూజిక్ గురించి?** అజినీస్ లోక్నాథ్ ఈ జోనర్‌కి పర్ఫెక్ట్ మ్యూజిక్ డైరెక్టర్. చాలా అద్భుతమైనటువంటి మ్యూజిక్ ఇచ్చారు. బ్యాగ్రౌండ్ స్కోరు చాలా పవర్ ఫుల్‌గా ఉంటుంది. సౌందర్ రాజన్ చాలా అద్భుతమైనటువంటి విజువల్స్ ఇచ్చారు. **ఈ సినిమాలో చాలామంది యాక్టర్స్ ఉన్నారు కదా.. మీకు ఎవరి పర్ఫార్మెన్స్ బాగా నచ్చింది?** ఈ కథలో ప్రతి పాత్రకి ఇంపార్టెన్స్ ఉంటుంది. తమన్నా ఎక్స్రార్డినరీ పెర్ఫార్మర్. వశిష్ట క్యారెక్టర్ కూడా చాలా బాగుంటుంది. ఆ రెండు క్యారెక్టర్స్ మధ్య టగ్ అఫ్ వార్ లా ఉంటుంది. అలాగే మురళీ శర్మ, శ్రీకాంత్ అయ్యంగార్ హెబ్బా.. ఈ పాత్రలన్నీ కూడా చాలా బాగుంటాయి. ప్రేక్షకులు పాత్రలతో లీనం అయిపోతారు. **గ్రాఫిక్స్ ఎలా ఉండబోతున్నాయి?** ఇందులో గ్రాఫిక్స్‌కి చాలా ఇంపార్టెన్స్ ఉంది. పంచభూతాల కాన్సెప్ట్‌ని గ్రాఫిక్స్‌లో చూపించడం జరిగింది. ఆడియన్స్ ఎంజాయ్ చేస్తారు. ప్రేక్షకులకు మంచి సినిమా ఇవ్వాలి ఒక మంచి సక్సెస్‌ని అందుకోవాలని పాషన్‌తో చేసాం.


# ఓటిటిలోకి 'తల్లి మనసు'

మాతృ ప్రేమకు ఏదీ సాటి రాదు. ఆమె మన సంతా బిడ్డల చుట్టూనే పరిభ్రమిస్తూ ఉంటుంది. అలాంటి ఓ తల్లి తపన, భావోద్వేగాలను ఆవిష్కరిస్తూ రూపొందించిన "తల్లి మనసు" చిత్రం ఇటీవల థియేటర్లలో విడుదలైన సంగతి తెలిసిందే. రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రధారులుగా ముత్యాల మూవీ మేకర్స్ పతాకంపై సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిషోర్ తొలిసారి నిర్మాతగా మారి, నిర్మించిన చిత్రమిది. పూర్వాశ్రమంలో దర్శకత్వ శాఖలో పనిచేసి, అనుభవం గడించిన వి.శ్రీనివాస్ (సిప్పీ) దర్శకుడిగా పరిచయమయ్యారు. కాగా థియేటర్ ప్రేక్షకుల చేత ప్రశంసలు అందుకున్న ఈ చిత్రం ఇప్పుడు అమెజాన్ ప్రైమ్ ఓటీటీలో ఈ నెల 14న విడుదల కానుంది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాత ముత్యాల అనంత కిషోర్ తెలియజేస్తూ, అమెజాన్ ప్రైమ్ ఓటీటీలో ఈ చిత్రం మరింత ఎక్కువ మంది కుటుంబ ప్రేక్షకులకు ఈ చిత్రం చేరువయ్యి, మంచి ఆదరణ చూరగొంటుందన్న నమ్మకం ఉందని అన్నారు. చిత్ర సమర్పకులు ముత్యాల సుబ్బయ్య మాట్లాడుతూ, చాలాకాలం తర్వాత ఓ మంచి చిత్రాన్ని చూశామని ప్రేక్షకులు చెప్పడం తమ యూనిట్‌కు ఎంతో ఆనందాన్ని కలిగించిందని, ఇప్పుడు ఓటీటీ ప్లాట్ ఫారం ద్వారా మిగతా ప్రేక్షకులకు దగ్గరై, తాము ఏదైతే చిత్రం గురించి ఆశించామో ఆ లక్ష్యం నెరవేరుతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.



# డైమండ్ లాంటి గ్లామర్ డోస్ నేహా శెట్టి

తెలుగు తెరపై ఆకట్టుకునే అందంతో పాటు స్టైల్ స్టేట్‌మెంట్‌ను మిక్స్ చేస్తూ దూసుకుపోతున్న నేహాశెట్టి తన లేటెస్ట్ ఫొటోషూట్‌తో మరోసారి సోషల్ మీడియాను షేక్ చేసింది. డ్రీమ్‌లా కనిపించే ఓ వైట్ లెహంగా లుక్‌లో నేహ చేసిన అటిట్యూడ్ పాస్.. ఫ్యాషన్ వలయంలో ఉన్నవారిని ఆకట్టుకుంది. ఈ లుక్‌లో ఆమె ఐ వాక్డ్ అవుట్ ఆఫ్ ఎ డ్రీమ్ బట్ మేక్ ఇట్ ఫ్యాషన్త్ అని క్యాప్షన్ పెట్టింది. వైట్ లెహంగాలో నేహ షెట్టీ రాయలుక్‌లో బ్యూటీఫుల్ అనే కామెంట్స్ వస్తున్నాయి. ఈ లుక్‌లో ఆమె ఫోటోలపై నెటిజన్ల నుంచి భారీస్పందన వచ్చింది. స్పెషల్‌గా ఆమె క్యారిజ్మా, మేకప్, జ్యుయెలరీ అన్ని బ్యూటిఫుల్‌గా బ్యాలెన్స్ అయ్యాయి. ప్రత్యేకించి ఆమె ఇచ్చిన ఐ ఎక్స్‌ప్రెషన్స్ ఈ ఫొటోలకు ఎనలేని గ్రేస్ తెచ్చాయి. నెహ షెట్టీ కెరీర్ విషయానికి వస్తే.. ఆమె మొదటిగా కన్నడ సినిమాల ద్వారా సినీ ప్రపంచంలోకి అడుగు పెట్టింది. తరువాత తెలుగు ఇండస్ట్రీలో డీజే టిల్లు వంటి సినిమాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆమె



గ్లామర్‌తో పాటు ప్రొఫెషనల్ పెర్ఫార్మెన్స్ కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. రూల్స్ రంజన్, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి వంటి సినిమా ల్లోనూ నెహ నటనకు మంచి మార్కులు వచ్చాయి. ఇక నెహ ఫొటోషూట్ల గురించి ప్రత్యేకంగా మాట్లాడుకోవాల్సిందే.

# 'కృష్ణ లీల' టైటిల్ లాంచ్

యంగ్ ట్యాలెంటెడ్ దేవన్ హీరోగా ఆయన స్వీయ దర్శకత్వంలో ఓ సూపర్ నేచురల్ లవ్ స్టోరీ రూపొందుతోంది. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్‌గా నటిస్తోంది. బేబీ వైష్ణవి సమర్పణలో మహాసేన్ విజువల్స్ బ్యానర్‌పై జ్యోత్స్న జి చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి కథ మాటలు అనిల్ కిరణ్ కుమార్ జి అందించారు. ఈ సినిమాకి కృష్ణ లీల అనే బ్యాటీఫుల్ టైటిల్ ఖరారు చేశారు. తిరిగొచ్చిన కాలం అనేది ట్యాగ్ లైన్. ఈ సినిమా టైటిల్, మోషన్ పోస్టర్ లాంచ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథులుగా హీరో నిఖిల్, బ్రహ్మశ్రీ ఎల్ వీ గంగాధర్ శాస్త్రి, డిఓపి చోటా కె నాయుడు హాజరయ్యారు. టైటిల్ లాంచ్ ప్రెస్‌మీట్‌లో హీరో నిఖిల్ మాట్లాడుతూ, దేవన్ చాలా పాషన్ ఉన్న యాక్టర్ డైరెక్టర్. హ్యాపీడేస్‌కి ముందు నేను కూడా ఒక మంచి అవకాశం కోసం పతన పడేవాడిని, దేవుడి దయవల్ల నాకు హ్యాపీ డేస్ దొరికింది. అదే దేవుడి దయవల్ల తనకి కృష్ణ లీలతో పెద్ద హిట్ రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. మోషన్ పోస్టరు నాకు చాలా నచ్చింది. ఇందులో దేవ్ డిఫరెంట్ సేడ్స్ నాకు చాలా నచ్చాయి. టీమ్ అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్. అందరూ ఈ టీంని సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను అన్నారు. బ్రహ్మశ్రీ ఎల్వీ గంగాధర్ శాస్త్రి మాట్లాడుతూ, జై శ్రీకృష్ణ, దేవన్ చాలా పాజిటివ్ పర్సన్. తనని చూడగానే చాలా పాజిటివ్ వైబ్ వచ్చింది. నిరంతరం ప్రయత్నంలో ఉన్న వాడే ఎప్పటికైనా ఘనవిజయం సాధిస్తాడు. దేవన్ కూడా అలాంటి ఘన విజయం ఈ సినిమాతో సాధిస్తాడనే నమ్మకం ఉంది. ఈ సినిమా రచయిత అనిల్ చాలా సంస్కారవంతులు. కృష్ణ లీల చాలా అద్భుతమైన టైటిల్ అన్నారు. డిఓపి చోటా కె నాయుడు మాట్లాడుతూ, ఈ సినిమా కథనాకు చాలా నచ్చింది. నిర్మాతలు చాలా పాషన్‌తో ఈ కథని చేస్తున్నారు. టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్. నిఖిల్ ఈవెంట్‌కి రావడం చాలా ఆనందంగా ఉంది. తన లాంటి యంగ్ స్టార్ ఇలాంటి అప్ కమింగ్ యంగ్ స్టార్స్‌ని సపోర్ట్ చేయడం చాలా మంది



పరిణామం అన్నారు. హీరో, డైరెక్టర్ దేవన్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ముందుగా నన్ను కన్న మా అమ్మానాన్నలకి కృతజ్ఞతలు. నాకు సినిమా జీవితాన్ని ఇచ్చిన మా నిర్మాతలకు ధన్యవాదాలు. వారికి లైఫ్ లాంగ్ రుణపడి ఉంటాను. ఆయనతోకలవడానికి చాలా ప్రయత్నాలు చేశారు. ఫైనల్‌గా ఆయనని కలిసి ఈసినిమా కథ చెప్పాను అన్నారు.



# వయసు పెరిగినా తరగని అందం కోసం..

సాధారణంగా ఎదుటివారి మొహం చూసి వాళ్ల వయసును అంచనా వేయచ్చు. అయితే అన్ని సందర్భాల్లోనూ ఇది సాధ్యం కాకపోవచ్చు. కొంత మంది వయసు పెరిగినా సరే.. నవ యవ్వనంగా కనిపిస్తుం టారు. తీరా వాళ్ల అసలు వయసేంటో తెలుసుకొని ఆశ్చర్యపోవడం మన వంతవుతుంది. చైనా బ్యూటీస్ ఇదే కోవకు చెందుతారు. వయసుతో పాటు అందమూ పెంచుకుంటూ పోతున్నా ఈ ముద్దుగుమ్మల సౌందర్య వెనుక.. ప్రాచీన కాలం నాటి సౌందర్య పద్ధతులున్నాయట! మరి, అవేంటో మనమూ తెలుసుకుందాం రండి..,. ముత్యాల్ని మనం జ్యుయలరీలో భాగంగానే చూస్తాం.. కానీ చైనా మహిళలు వీటిని సౌందర్య పోషణలో భాగం చేసుకుంటారట! చర్మాన్ని మెరిపించే గుణాలు వీటిలో ఉండడమే ఇందుకు కారణం. ముత్యాల్ని మెత్తగా పొడి చేసుకుని.. ఆ పొడిని ఫేస్‌ప్యాక్స్‌లో ఉపయో గించడం, ఫేషియర్స్‌లో భాగం చేసుకోవడం.. వంటివి చేస్తుంటారట! ఇక ఈ



పొడితో ఉండే అమైనో ఆమ్లాలు, ఖనిజాలు కొలాజెన్ ఉత్పత్తిని ప్రేరేపించి.. చర్మ కాంతిని పెంచడంలో సహకరిస్తాయి. అంతేకాదు.. చర్మానికి సాగే గుణాన్ని అందించి.. ముడతలు, గీతలు పెంచడంలో సహకరిస్తాయి. అంతేకాదు.. చర్మానికి సాగే గుణాన్ని అందించి.. ముడతలు, గీతలు ఏర్పడకుండా చేసే గుణాలూ ఈ పొడిలో పుష్కలంగా లభిస్తాయంటున్నారు నిపుణులు. అయితే మన దగ్గర కూడా కొంతమంది ముత్యపు పొడిని ఫేషియల్స్‌లో భాగంగా వాడడం చూస్తుంటాం. కానీ చైనా యువతుల మాదిరిగా ఇతర బ్యూటీ ట్రీట్‌మెంట్లలోనూ దీన్ని వాడడం వల్ల సమన్వంగా మెరిసిపోవచ్చని సౌందర్య నిపుణులు సలహా ఇస్తున్నారు.

బియ్యం కడిగిన నీటిని మనలో చాలామంది బయటపడేస్తుంటారు. కొంతమంది మాత్రం తమ సౌందర్య పోషణలో భాగం చేసుకుంటుంటారు. కానీ చైనా మహిళలు మాత్రం వీటిని సౌందర్య పోషణలో భాగంగా వాడుతుంటారట! యుక్త వయసు నుంచే వారికి ఇదో అలవాటుగా మారిపోతుందని అక్కడి సౌందర్య నిపుణులు చెబుతున్నారు. వీటితో రోజూ ముఖాన్ని శుభ్రం చేసుకోవడం, టోనర్‌గా ఉపయోగించడం.. వంటివి చేస్తుంటారట! ఈ నీళ్ల చర్మంలో పిహెచ్ స్థాయుల్ని బ్యాలన్స్ చేసి.. చర్మ రంధ్రాల్ని బిగుతుగా మార్చుతాయి. అలాగే చర్మానికి మెరుపునూ అందిస్తాయి. తద్వారా నవయవ్వనంగా కనిపించవచ్చు.

ఈ రోజుల్లో చాలామంది తమ అందాన్ని ద్విగుణీకృతం చేసుకోవడానికి కొన్ని రకాల టూల్స్‌ని ఉపయోగిస్తున్నారు. గువాషా, జేడ్ రోలర్.. అందులో కొన్ని! అయితే నిజానికి ఇవి చైనీయులు రూపొందించినవే! వాళ్లు ప్రాచీన కాలం నుంచే వీటిని తమ సౌందర్య పోషణలో భాగంగా ఉపయోగిస్తున్నారని అక్కడి నిపుణులు చెబుతున్నారు. జేడ్/క్వార్ట్జ్.. వంటి సహజసిద్ధమైన స్టోన్స్‌తో తయారయ్యే ఈ టూల్స్‌తో చార్మనికి మర్దన చేసుకోవడం వల్ల.. చర్మానికి రక్తప్రసరణ మెరుగుపడు తుంది. తద్వారా ముఖంపై మొటిమలు, మచ్చలు తొలగిపోతాయి.

## సమస్యను పెంచుకోరాదు!

**వివాహబంధాన్ని పదికాలాల పాటు కాపాడు కునే బాధ్యత దంపతులిద్దరిదీ, కానీ కొందరు చిన్నచిన్న విభేదాలనూ పెద్ద సమస్యలుగా చేసుకుంటారు. వాటిని పరిష్కరించుకోవాలిగానీ పెద్దది చేసుకోకూడదు అంటున్నారు నిపుణులు.** దంపతుల మధ్య ఏర్పడే చిలిపి తగాదాలు కొన్నిసార్లు పెద్దవవుతాయి. అటువంటి సంభాషణలో వచ్చే మార్పును ఇరువురిలో ఏ ఒక్కరు గుర్తించినా దాన్ని అక్కడితో ఆపేయాలి. ఎదుటివారు కొనసాగిస్తున్నా కూడా నిశ్శబ్దంగా ఉంటే చాలు. లేదంటే ఆ చిలిపి తగాదా చివరకు చిలికి చిలికి గాలివానలా మారే ప్రమాదం ఉంది. ఇది భార్యాభర్తలమధ్య తాత్కాలి కంగా దూరాన్ని పెంచుతుంది. ఏ మాట మాట్లా డితే భాగస్వామి ట్రిగ్గర్ అవుతున్నారో గుర్తించాలి. మరో సారి వాటిని మాట్లాడకుండా ఉండటానికి ఎదుటివారు ప్రయత్నిస్తే చాలు. దంప తుల మధ్య సంభాషణ నిత్యం సంతోషంగా సాగు తుంది. ఫిర్యా దులకు **స్పందించొద్దు...** వైవాహిక బంధంలో భార్యాభర్తల మధ్య వచ్చే కొన్ని సమస్యలకు చుట్టుపక్కలవాళ్లు కారణమవుతుంటారు. ఎదు టివారు చెప్పే ఫిర్యాదులను పరిగణలోకి తీసు కొని భాగస్వామితో కొందరు విభేదాలు పెంచు కుంటారు.

ఇరువురిమధ్య మూడో వ్యక్తికి స్థానమివ్వ కుండా ప్రతి విషయాన్ని దంపతులు మాత్రమే చర్చించు కుంటే సమస్య ఉండదు. అలాగే ఒకరిపై మరొకరికి భరోసా ఉండాలి. అప్పుడే ఇతరుల వల్ల సమస్య లొచ్చే అవకాశం తగ్గుతుంది.

**అవమానించొద్దు....** ఒకరినొకరు విమర్శించుకొని మాటలతో అవమానించకోకూడదు. దీనివల్ల ఎదుటివారి మనసు గాయపడుతుందని గుర్తు పెట్టుకోవాలి. అలాగే గతంలో జరిగిన విషయాలను చెప్పుతూ మాట్లాడే అలవాటును కూడా మానుకోవాలి.

అవతలివాళ్ల వల్ల నష్టం జరిగి ఉండొచ్చు. అలాగని జరిగినవాటిని ఏళ్ల గడుస్తున్నా మనసులో మోస్తూ ఉంటే అది మానసిక అనారోగ్యానికి దారి తీస్తుంది. అంతేకాదు.

ఈ పద్ధతిని మానుకోకపోతే భార్యాభర్తల్లో ఒకరిపై మరొకరికి ప్రతికూల భావన పెరుగుతుంది. ఇగో వద్దు.,... దంపత్తులల్లో తప్పు ఎవరిదైనా ఒకరి నొకరు క్షమించు కోవడం అలవాటు చేసుకోవాలి.

---

## ఆరోగ్య భాగ్యం

# పెరి ఆనల్ ట్యూబర్ క్యులోసిస్ - ఆసన క్షయ (2)



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

**రిస్క్ ఫ్యాక్టర్స్ :** సిఫిఫలిస్, క్లామిడియా వంటి సుఖవ్యాధులున్నప్పుడు రేడియేషన్ థెరపీ, డయాబెటిస్, చర్మవ్యాధి, మితిమీరిన మసాలా రేడియేషన్ థిరపీ , డయాబెటిస్, చర్మవ్యాధి. మితిమీరిన మసాలా ఆహారం తీసుకోవడం, ధూమపానం, సెడెంటరీ జీవనశైలి, హైపర్లిపిడెమియా, మద్యపానం, హెచ్ఐవి ఎయిడ్స్ ఉన్నవారు మలద్వారం వద్ద శస్త్ర చికిత్స చేయుంచుకున్నవారు, అపరిశుభ్రత, ఆల్కహాలిక్స్‌లో వచ్చే అవకాశం ఎక్కువ ఉంటుంది.

**వ్యాధి నిర్ధారణ :** రక్తపరీక్షలు, మూంటాక్స్ టెస్ట్, పర్ క్యుటేనియస్ ట్రాన్స్ పెరినీయల్ సోనోగ్రఫీ, పిస్టులా గ్రామ్ ఎలీసా టెస్ట్, నీడిల్ ఆస్పిరేషన్ సైటాలజీ , కల్చర్, బయాప్సీ, ఆసిన్ ఫాస్ట్ బాసిల్లై టెస్ట్, కోలనో స్కోపీ, పిపిడి టెస్ట్ సిటిస్కాన్, హెచ్ఐవి ఆంటీబాడీటెస్ట్ ద్వార వ్యాధి నిర్ధారణ చేయవచ్చు.

**జాగ్రత్తలు -చికిత్స:** ఆసన క్షయ నిర్ధారణ, చికిత్స ద్వారా కొంత వరకు కష్టమేనని చెప్పవచ్చు. ఆసన ప్రాంతాన్ని శుభ్రంగా పొడిగా ఉంచి ఆసనపరిశుభ్రతని పాటించాలి. అధిక ఫైబర్ ఉన్న ఆహారం తీసుకోవడం, హైడ్రేట్‌గా ఉండడం ద్వారా ప్రేగు కదలికల సమయంలో ఒత్తిడిని నివారించాలి. ఏదైనా అసన అంటువ్యాధులు, గడ్డలు, ప్రేవుల వ్యాధులుంటే తగిన చికిత్స అందించాలి. సురక్షితమైన సెక్స్ ప్రాక్టీసుచేయాలి. లేకపోతే లైంగిక వ్యాధులు ఆసన ఫిస్టులాస్‌కి దారి తీయవచ్చు. ఎక్కువ సేపు కూర్చోవడం మానుకోవాలి. ఇది ఆసన ప్రాంతంపై ఒత్తిడిని పెంచుతుంది. ఫిస్టులా అభివృద్ధికి దోహదం చేస్తుంది. స్నిట్జ్ స్నానం మంచిది. శారీరక పరీక్ష, ఫిస్టులా పొడిగింపు ఎంతవరకు ఉంది. స్పిరక్టర్ కండరాలు ఎలా పనిచేస్తాయి. అనిప్రోక్టోస్కోపీ ఆనల్ అల్ట్రా సౌండ్, ఆనల్ ఎండోసోనోగ్రఫీ ద్వారా కనుగొనవచ్చు. మల విసర్జన చేసేటప్పుడు ముక్కడం, టాయిలెట్ సీట్‌పై ఎక్కువ సేపు కూర్చోవద్దు. అడ్వాన్డ్ ఫ్లాప్ విధానం పాటించాలి. జీవన శైలిలో మార్పులు, అనారోగ్యాన్ని తీవ్రతరం చేసే ఆహారాలకి దూరంగా ఉండడం ముఖ్యమైనవి.

స్రావాలున్నవారు ఆసనం దగ్గర ప్యాడ్ ధరించాలి. అనారోగ్యాన్ని తీవ్రతరం చేసే ఆహారాలకి దూరంగా ఉండడం అన్ని విధాలా ముఖ్యమైనది. స్పైసీ ఆయిల్ ఫుడ్ తినరాదు. సమతుల్య ఆహారం ,ఫైబర్ ఉన్నవి తినాలి. డీ హైడ్రేషన్ లేకుండా తగిన నీరు త్రాగాలి. మలబద్ధకం లేకుండా చూసుకోవాలి.

6 నెలలు ఆంటి ట్యూబర్ క్యులిర్ చికిత్స తీసుకోవాలి. అవసరమైతే ఫిస్టులెక్టమీ శస్త్రచికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. ఫిస్టులా /సైనస్ మళ్లీ తిరగబెట్టకుండా తగిన పోషకాహారం తీసుకోవాలి. సరైన జాగ్రత్తలు పాటించడమే అన్ని విధాలా మంచిది చీము, మ్యూకస్‌స్రావాలు చేరకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాల్సి ఉంటుంది.

**చికిత్స : కాల్కేరియాఫ్లోర్ :** వీరి ఆసనం దగ్గర దురద, నొప్పిగా ఉండడం వల్ల రాత్రి మెలకువ రావడం, ఆసనంలో పుండ్లు, ఫిస్టులా ఏర్పడడం. ఫిషర్స్ ఏర్పడడం, మలబద్ధకం, నడునొప్పి, పొత్తికడుపు ఉబ్బరం వంటి లక్షణాలున్న వారికిది మంచి మందు .

**కాల్కేరియా సల్ఫ్ :** నీళ్ల విరేచనాలు, ఫిస్టులా ఆసనం ప్రక్కనే ఏర్పడడం, చీము,రక్తం జీరతో స్రావాలు వచ్చేవారికి, జ్వరం, దగ్గు ఉన్నవారికిది మంచి మందు.

**గ్రాఫైటిస్ :** వీరి ఆసనంలోని జిగురు పొరలు ఆర్చుకొని పోవడం వల్ల మలబద్ధకం ఉండి కత్తితో చీల్చినట్టు బాధతో, విపరీతమైన దుర,నొప్పి ృతో ఆసనంలో పక్కన పుండ్లు వారికిది మంచి మందు.

**సైలీషియా :** వీరిలో మలవిసర్జన సక్రమంగా కాదు. ఆసనంలో పుండ్లు ఫిస్టులా, మొలలు, ఆకలి తక్కువుగా ఉండడం, గజ్జలో మాంస గ్రంథుల వాపు, అజీర్ణం, దాహం ఎక్కువగా ఉండేవారికిది మంచి మందు.

**హైపార్ సల్ఫ్ :** చీము, రక్తం దుర్వాసనతో స్రావాలు వచ్చేవారికి, తరచు జలుబు, జ్వరం ఉంది బరువు తగ్గేవారికిది మంచి మందు.

ఇవేగాక వ్యాధి లక్షణ ాల్ని బట్టి (సియోనియా, కాష్టికం, హైడ్రాస్టీసిస్, కాల్కేరియా ఫాస్, కాలీ అయోడ్ మందుల్ని వైద్యపర్యవేక్షణలో వాడుకోవాల్సి ఉంటుంది.

---

# ద్రాక్షలో రకాలు

మార్కెట్లో ద్రాక్ష పండ్ల సీజన్ నడుస్తున్నది. ఎవరైనా ఈ పండ్లను ఇష్టంగా తింటారు. మన దగ్గర ఆకుపచ్చ, నల్ల ద్రాక్ష రెండు రకాలు లభిస్తాయి. అయితే ద్రాక్ష పండ్లలో వేటి రుచి వాటిదే. నల్లద్రాక్షలో యాంటి ఆక్సిడెంట్లు పుష్కలం. ముఖ్యంగా రెస్‌వెరట్రాల్ అనే యాంటి ఆక్సిడెంట్‌కు ఇవి గనులు. ఇది యాంటి ఇన్‌ఫ్లమేటరీ, క్యాన్సర్‌వ్యతిరేక ప్రభావాలను కలిగి ఉంటుంది. నల్లద్రాక్షలో ఫైబర్, విటమిన్ సి, కె ఎక్కువగా ఉంటాయి. సహజ చక్కెర అయిన ఫ్రక్టోజ్ కూడా ఉంటుంది. వీటిలో పుష్కలంగా ఉండే యాంటి ఆక్సిడెంట్లు మన శరీర కణాలు దెబ్బతినకుండా కాపాడతాయి. డయాబెటిస్, అల్జీమర్స్, గుండె జబ్బులు, పార్కిన్సన్ తదితర వ్యాధుల ముప్పును తగ్గిస్తాయి. గుండె, మెదడుకు రక్షణగా ఒక పొరను రెస్‌వెరట్రాల్ ఏర్పరుస్తుంది. నల్ల, ద్రాక్ష తొక్కలో ఉండే రెస్‌వెరట్రాల్‌కు వయసు మీద పడటాన్ని తగ్గించే లక్షణాలు ఉంటాయని పరిశోధకులు



చెబుతున్నారు. ఇక విరివిగా కనిపించే ఆకుపచ్చ ద్రాక్షలో విటమిన్ కె, పొటాషియం, ఫైబర్ పుష్కలం. యాంటి ఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. వీటిలోనూ యాంటి ఇన్‌ఫ్లమేటరీ, యాంటి కాన్సర్ లక్షణాలు ఉంటాయి. ఆకుపచ్చ ద్రాక్షలో ఉండే గ్లూకోజ్, ఫ్రక్టోజ్ అనే కార్బోహైడ్రేట్లు శరీరానికి శక్తిని ఇస్తాయి. తొక్కలో ఉండే రెస్‌వెరట్రాల్ శరీర జీవక్రియలను మెరుగుపరుస్తుంది. ఓ అధ్యయనం ప్రకారం ఆకుపచ్చ ద్రాక్షలు బరువును ఆరోగ్యకరంగా ఉంచడంలో దోహదపడతాయి. అధిక రక్తపోటు నిర్వహణలోనూ సమర్థంగా పనిచేస్తాయని నిపుణుల మాట. ద్రాక్షలు నల్లవైనా, ఆకుపచ్చవైనా రెండూ విటమన్లు, మినరల్స్, ఇతర పోషకాలకు గనులే. ఆరోగ్య అందించేవే.

---

# డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా పార్యానగర్, నల్లవల్లి గ్రామాల్లో కదిలిన ప్రజానీకం

**- ఎంఎస్‌డబ్ల్యూ భూసేకరణకు వ్యతిరేకంగా 1187 మంది వినతి పత్రాలు**



డంపింగ్ నిర్మాణానికి వ్యతిరేకంగా వినతిపత్రాలు సమర్పించిన గ్రామస్తులు


**మెదక్ (గుమ్మడిదల) ఏప్రిల్ 11 ప్రభాతవార్త:** గుమ్మడిదల మండలం ప్యారానగర్ గ్రామంలో గుర్తించబడిన 152 ఎకరాల ప్రభుత్వ భూమిని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయదలచిన సాలిడ్ వేస్టు మేనేజ్మెంట్‌కు బదలాయింపు చేయడాన్ని నల్లవల్లి, ప్యారానగర్ గ్రామస్థులు స్వచ్ఛందంగా వ్యతిరేకతను తెలుపడానికి గుమ్మడిదల మండల తహశీల్దార్‌కు వ్యతిరేకంగా వినతి పత్రాలను సమర్పించడానికి భారీ సంఖ్యలో ప్రజలు మండల కేంద్రానికి శుక్రవారం చేరుకున్నారు. ముందుగానే పరిస్థితిని తెలుసుకొని ఆర్డీవో తహశీల్దార్ కార్యాలయానికి చేరుకోగా జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు, డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ, గుమ్మడిదల, జిన్నారం, ఎస్‌లు భారీ బలగాలతో మండల కేంద్రానికి చేరుకొని మండల కార్యాలయాన్ని తమ ఆధీనంలో ఉంచుకొని పరిస్థితులను చక్కబెట్టారు. ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షించారు. గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామ పంచాయతీ ప్యారా నగర్ గ్రామంలోని భూమి బదలాయింపును సాలిడ్ వేస్టు మేనేజ్మెంట్ ఏర్పాటుకు చేయడాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానాలు శుక్రవారం ఒక్క రోజే 1187 వ్యతిరేక వినతి పత్రాలు తహశీల్దార్ కార్యాలయంలో సమర్పించారు. చుట్టుపక్కల ఉన్న అన్ని గ్రామ పంచాయతీలు గుమ్మడిదల్ల, కొత్తపల్లి, మంబాపూర్, కొంతపల్లి, దోమడుగు, అన్నారం, వరన్న గూడెం, కానుకుంట, వీరారెడ్డిపల్లి, రామిరెడ్డి బావి, నాగిరెడ్డి గూడెం, అనంతారం, నల్లవల్లి ఆమ్లెట్ గ్రామం ప్యారానగర్, కొత్తపల్లి ఆమ్లెట్ గ్రామం లక్ష్మాపూర్ గ్రామ పంచాయతీలు సాలిడ్ వేస్టు మెనేజ్మెంట్‌కు వ్యతిరేకంగా తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా జేపీసీ నాయకులు చిమ్ముల జైపాల్ రెడ్డి, చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, తాజా మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్‌లు మాట్లాడుతూ మున్సిపల్ సాలిడ్ వేస్టు మేనేజ్మెంట్ ఏర్పాటుకు ముందస్తుగా 2006 నాటి పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ అనుమతులు తీసుకోవాల్సి ఉండగా, ఎటువంటి అనుమతులు తీసుకోబడలేదని, రెవెన్యూ రికార్డుల ప్రకారం ప్యారానగర్ మ్యాప్ ప్రకారం బిలా దాక్ష భూములు లేవని, ఇటీవల కాలంలో అటవి భూములను ఆక్రమించికొని రెవెన్యూ రికార్డులు తమకు అనుకూలంగా సృష్టించుకున్నారని, ప్రతిపాదిత పాలిడ్ వేస్టు మేనేజ్మెంట్ అటవీ భూమిలో ఉందన్నారు. అటవీ ప్రాంతాన్ని కాలుష్యం చేయకుండా అటవీ ప్రాంతం అనేక రకాల జీవరాశులకు సహజ నివాసంగా ఉందని, ఈ 152 ఎకరాల మొత్తం భూమి నర్సాపూర్ రాయరావు చెరువు, కొండాపూర్ ఊర చెరువు, ఇతర గ్రామాల చెరువులకు పరివాహక ప్రాంతంగా ఉన్నదని, నీటి పారుదల శాఖ వారిచేత గుర్తించడం జరిగిందని, చెరువు కాలుష్యం వల్ల మత్స్య సంపద పూర్తిగా అంతరించి పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ చేరువులపై ఆధారపడిన మత్స్యకారుల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని,

ఈ చెరువు నీటి సరఫరా ద్వారా వివిధ రకాల కూరగాయలు, చిరుధాన్యాలు, తృణ దాన్యాలు, వరి పంటలు పండుతాయని, అలాగే పశువులు, మేకలు, గొర్రెల పెంపకం కూడా ప్రధానంగా ఆధార పడి ఉందన్నారు. అందువల్ల వేస్టు మేనేజ్‌మెంట్ ఏర్పాటు వలన చెరువులు, కుంటలు కలుషిత మయ్యే ప్రమాదం ఉందన్నారు.

---

# వైద్య వృత్తిని నైతిక విలువలతో నిర్వహించాలి

**కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ డాక్టర్ పివి.నందకుమార్ రెడ్డి**



**సికింద్రాబాద్, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:** పవిత్రమైన వైద్య వృత్తిని నైతిక విలువలతో నిర్వహించాలని కాలోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ డాక్టర్ పివి.నందకుమార్ రెడ్డి అన్నారు. గాంధీ మెడికల్ కాలేజ్ 2019 బ్యాచ్ గ్రాడ్యుయేషన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ పివి.నందకుమార్ రెడ్డి హాజరయ్యారు. పలు విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్‌తో పాటు ఎంబిబిఎస్ పూర్తి చేసిన 2019 బ్యాచ్ వైద్య విద్యార్థులకు డాక్టర్ పట్టాలను అందజేసి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులు ఎంతో నమ్మకంతో వైద్యుల వద్దకు వస్తారని, వారితో ప్రేమగా వ్యవహరించాలని, ఆప్యాయంగా మాట్లాడాలని సూచించారు. 1973 బ్యాచ్‌లో గాంధీ మెడికల్ కాలేజీలో తాను కూడా చదువుకున్నానని, ఈరోజు వైస్ ఛాన్సలర్ హోదాలో ముఖ్య అతిథిగా పాల్గొనడం ఆనందంగా ఉన్నదని అన్నారు. వైద్య విద్యార్థులు పరిశోధన చేయడానికి ముందుకు వస్తే తమ యూనివర్సిటీ ద్వారా వారికి తగిన నిధులను అందించి ప్రోత్సహిస్తామన్నారు. హైదరాబాద్‌లో ఉన్న హెల్త్ యూనివర్సిటీ బ్రాంచు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. డిఎంఈ డాక్టర్ ఎ.నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకమైన గాంధీ మెడికల్ కళాశాల ఖ్యాతిని నూతన డాక్టర్లు మరింత పెంచే విధంగా నడుచుకోవాలని సూచించారు. వైద్య విద్య అభ్యసిస్తున్న వారికి గతంతో పోలిస్తే ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నదన్నారు. దానిని ఉపయోగించుకుని మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఆదిలాబాద్ జిల్లా, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వైద్యరంగం అభివృద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు. మారుమూల అటవీ ప్రాంతమైన ఆదిలాబాద్ ప్రజలు వైద్యం కోసం పట్టణానికి రావాల్సి వచ్చేదని అన్నారు. 33 జిల్లాలలో 33 వైద్య కళాశాలలు ఏర్పాటు చేసిన కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా కరోనా రెండు దశల్లో గాంధీ ఆసుపత్రిలో లక్షలాదిమందికి వైద్యం అందించి పునర్జన్మ ప్రసాదించారని, అందుకు పనిచేసిన వైద్యులు సిబ్బందిని అభినందిస్తున్నామని అన్నారు. గాంధీ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ కే. ఇందిరా మాట్లాడుతూ 2019 బ్యాచ్ ఎంబిబిఎస్ పూర్తి చేసుకున్న 245 మంది విద్యార్థుల్లో 97 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. మొదటిసారిగా తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ ద్వారా తమ కళాశాలకు చెందిన డాక్టర్ దుర్గం కావ్య గోల్డ్ మెడల్ సాధించడం అభినందనీయమన్నారు. గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిహెచ్.ఎన్. రాజకుమారి మాట్లాడుతూ వైద్యరంగంలో వస్తున్న తాజా మార్పులను నూతన డాక్టర్లు ఎప్పటికప్పుడు తెలుసుకో వాలన్నారు. ఈ రంగంలో సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. గాంధీ వైద్య కళాశాల ప్రతిష్టను మరింత చేసే విధంగా వైద్య సేవ అందించాలని ఆమె సూచించారు. అనంతరం నూతన డాక్టర్ల చేత ఆమె ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల హెచ్ఓడిలు డాక్టర్ బి వాల్యా, డాక్టర్ రాజారామ్,

డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ మురళీధర్, గాంధీ అలుమ్ని అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ లింగమూర్తి ఎంపిహెచ్ ఈఓ వేణుగోపాల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

---

# పరమాత్మని ఆరాధించి మోక్షమొందాలి!

## కాషాయంతో కళ కళ లాడిన శుకబ్రహ్మాశ్రమం

**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 11 ప్రభాతవార్త** అనంతమైన పరమాత్మని ఆరాధించి మోక్షం పొందాలని శ్రీనివాస మంగాపురంలోని వశిష్టాశ్రమాధిపతి స్వస్వరూపానందగిరి స్వామి పిలుపు నిచ్చారు. తిరుపతిజిల్లా శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్న జీవనది స్వర్ణముఖి వడ్డున వెలసిన శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో బుధవారం ఆశ్రమ 75వ వార్షికోత్సవం ఆశ్రమ వ్యవస్థాపకులు విద్యాప్రకాశానందస్వామి 112వ జన్మదిన వేడుకలు, 27వ ఆరాధనోత్సవాలకు దేశ నలు మూలల నుంచి మఠాధి పతులు, పీఠాధిపతులు కదలి వచ్చారు. శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి ఆశ్రమం వరకు కాషాయంతో శ్రీకాళహస్తి దివ్యక్షేత్రం కళ కళ లాడింది. ఆశ్రమ పీఠాధిపతి సంపూర్ణానందగిరి స్వామి పర్యవేక్షణలో ఆరాధనోత్సవాల కార్యక్రమాలు సాగుతున్నాయి. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలకు విస్తృత స్థాయి ఏర్పాట్లు చేసినట్లు పీఠాధిపతి వివరించారు. శ్రీకాళహస్తిలోని శుకబ్రహ్మాశ్రమం వద్ద విచ్చేసినపీఠాధిపతులు, మఠాధిపతులు, రాజకీయ నాయకులు, భక్తులకు ఆశ్రమంలో ఇటీవలే బాధ్యతలు అప్పగించిన విద్యాస్వరూపానందగిరి స్వామి సాదరంగా స్వాగతం పలికారు. కాషాయం కండువాలతో సత్కరించారు. ఇక్కడి కార్యక్రమాలకు దేశ నలుమూలల నుంచి పాతికమంది పీఠాధిపతులు హాజరయ్యారు. వారికి విద్యాస్వరూపానందగిరి స్వామి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాప్రకాశానందగిరి స్వామి లేకుండా పాతికేళ్లుగా ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. గీతా మకరందం ప్రపంచానికి అందించి పండిత పామరులను తన ప్రసంగాలతో ఆకట్టుకున్న విద్యాప్రకాశానందగిరి స్వామి ఆశయసాధనకు కృషి చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఆశ్రమం బాధ్యతను పరిపూర్ణానందగిరి స్వామి పర్యవేక్షిస్తున్నారని వివరించారు. శుకబ్రహ్మా శ్రమంలో నిర్వహిస్తున్న వార్షికోత్సవాలకు దేశ నలుమూలల నుంచి పాతికమంది పీఠాధిపతులు హాజరయ్యారు. వారికి యతి పూజలు నిర్వహించారు. కాళ్ళు కడిగి సంప్రదాయం మేరకు పాదసేవ చేసారు. తరువాత వారి నుంచి ఆశీర్వదాలు అందుకున్నారు.

ఈ పూజలను ఆర్‌డిఓ కె యస్ రామారావు సతీసమేతంగా నిర్వహించారు. పీఠాధిపతి సంపూర్ణానందగిరి స్వామి వ్యాఖ్యాతగా పాదపూజలు జరిగాయి. పాద పూజలు జరిపారు. ఆశ్రమం అతిథులతో కళ కళ లాడింది. వారికి ఎలాంటి లోటు రాకుండా సేవకులు సేవలందించారు. భోజన వసతులు, బస వసతులను చక్కగా ఏర్పాటు చేసారు. మొదటి రోజు కార్యక్రమాల్లో భాగంగా ఆశ్రమ వ్యవస్థాపకులు పాలరాతి విగ్రహానికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

---

# టిటిడి ఎస్వీ గోశాలపై దుష్ప్రచారం!



**ఆ గోశాల తిరుపతిలో కాదని టిటిడి ప్రకటన**

**తిరుమల,ఏప్రిల్ 11ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానం తిరుపతిలో నిర్వహిస్తున్న ఎస్వీ గోశాలలో వందలాది ఆవులు మృతిచెందాయని వైసిపి నేత, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి చేసిన ఆరోపణలు వాస్తవం కాదని, గోశాలలో ఆవులు ఆరోగ్యంగానే ఉన్నాయని టిటిడి ప్రకటించింది. కొంతమంది సామాజిక మాధ్యమాల్లో కావాలనే పనిగట్టుకుని టిటిడిపై. కూటమి ప్రభుత్వ పాలనపై వదంతులు సృష్టిస్తున్నారని టిటిడి ప్రకటించింది. మృతి చెందిన ఆవుల ఫోటోలు టిటిడి గోశాలకు చెందినవి కాదని స్పష్టం చేసింది. కొందరు కావాలనే వేరే ఎక్కడో చనిపోయిన గోవుల ఫోటోలను టిటిడి గోశాలకు చెందిన గోవులంటూ ప్రచారం చేయడం భక్తుల మనోభావాలు దెబ్బతీయడమేనన్నారు. దీన్ని టిటిడి తీవ్రంగా ఖండించింది. ఇలాంటి వదంతులు నమ్మొద్దని అధికారిక ప్రకటన శుక్రవారం విడుదల చేసింది. తిరుపతికి చెందిన వైసిపి నేత, మాజీ ఎంఎల్ఎ ,మాజీ టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తిరుపతిలోని ఎస్వీ గోశాలలో 3నెలల్లో వంద గోవులు మృతి చెందాయని చెప్పడం వాస్తవమెంద అనేది ఇప్పుడు దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. వందకుపైగా ఆవులు మృతి చెందినా దాచిపెట్టారని ఆరోపించారు. అత్యంత పవిత్రంగా కొనసాగుతున్న ఎస్వీ గోశాలలో పరిస్థితి దారుణంగా తయారైందని మండిపడ్డారు. మా పాలకమండలి పాలనలో దాతల ద్వారా ఇతర రాష్ట్రాల నుండి దాదాపు 550 గోవులను తీసుకురావడం జరిగిందన్నారు. ఆ ఆవులు ఇచ్చే 15వేల లీటర్ల పాలను నిత్యం స్వామివారి అన్నప్రసాదం కోసం వినియోగించామని తెలిపారు. ఇప్పుడు పాలు కూడా 5వేల లీటర్లు తిరుమలకు రావడం లేదని మరో సంచలన వ్యాఖ్యలు చేశారు. మరీ దీనిపై టిటిడి అధికారులు చర్యలకు సిద్దమవుతున్నారనేది సమాచారం. టిటిడి మాజీఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి దుష్ప్రచారం పై టిటిడి బోర్డు సభ్యుడు, బిజెపి నేత భానుప్రకాశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా నోటికి వచ్చినట్లు మాట్లాడటం తగదన్నారు. అబద్దపు ఆరోపణలు చేయడంకాదని, గోశాల పరిశీలనకు రావాలని కరుణాకర్‌రెడ్డికి భానుప్రకాశ్‌రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం మీడియాప్రతినిధుల సమక్షంలో సవాల్ విసిరారు.

# ఐపిఎల్‌లో 200 ప్లస్ ఛేజింగ్




## మ్యాచ్‌లలో నయా ట్రెండ్

**న్యూఢిల్లీ:** ఐపిఎల్ 18వ సీజన్‌లో ఒక కొత్త ట్రెండ్ కనిపిస్తోంది. ఈ ట్రెండే జట్ల విజయాలకు కారణమవుతోంది. లీగ్‌లో ఆడుతున్న 10 జట్లు కొత్త ఫార్ములానే అనుసరిస్తున్నాయి. ఈ ట్రెండ్ 200 కంటే ఎక్కువ పరుగులు చేసి దాన్ని డిఫెండ్ చేసుకోవడం లేదా ఛేజ్ చేయడంతో ముడిపడి ఉంది. ఈ ఐపిఎల్-2025లో ఇప్పటి వరకూ జరిగిన 23 మ్యాచ్‌లను చూస్తే వీటిలో 10 మ్యాచ్‌ల ఫలితాలు ఇదే ఫార్ములాపై ఆధారపడి ఉన్నాయి. ఇప్పటివరకు 10మ్యాచ్‌లలో జట్లు మొదట బ్యాటింగ్ చేస్తూ 200 కంటే ఎక్కువ పరుగులు చేశాయి. వాటిలో 9 సార్లు ఆ టోటల్‌ను డిఫెండ్ చేసుకున్నాయి. అంటే, 200 ప్లస్ పరుగులు చేసి దాన్ని డిఫెండ్ చేసుకొని గెలవాలనే ట్రెండ్‌ను జట్లు ఫాలో అవుతున్నాయి. అయితే 10 మ్యాచ్‌లలో ఒకసారి మాత్రం ఈ ట్రెండ్‌ను బ్రేక్ చేసిన జట్టు విజయం సాధించింది. అంటే 200 ప్లస్ టార్గెట్‌ను ఛేజ్ చేసింది. ఈ సీజనులో తొలి మ్యాచ్ మార్చి 23న సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరిగింది. హైదరాబాద్ మొదట బ్యాటింగ్ చేస్తూ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 286 పరుగులు చేసింది. ఆ తర్వాత దాన్ని డిఫెండ్ చేసుకొని విజయం సాధించింది. రాజస్థాన్ జట్టు 287 పరుగుల టార్గెట్‌ను ఛేజ్ చేస్తూ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 242 పరుగులు మాత్రమే చేయగలిగింది.

అలాగే 24న లక్నో సూపర్ జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో 200 ప్లస్ టార్గెట్ ఛేజ్ అయింది. లక్నో మొదట బ్యాటింగ్ చేస్తూ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. బదులుగా ఢిల్లీ 19.3 ఓవర్లలోనే 9 వికెట్ల నష్టానికి 211 పరు గులు చేసింది. 25న 200 ప్లస్ టోటల్ ఉన్న మూడో మ్యాచ్‌కూడా జరిగింది.

గుజరాత్ టైటాన్స్‌తో ఢీకొన్న పంజాబ్ కింగ్స్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. బదులుగా గుజరాత్ 232 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఇక ఈ నెల 3న 200 ప్లస్ రన్స్‌ఉన్న నాలుగో మ్యాచ్ జరిగింది. హైదరాబాద్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో కోల్‌కతా 80 పరుగుల తేడాతో విజయం సాధించింది. నైట్ రైడర్స్ మొదట బ్యాటింగ్ చేస్తూ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 200 పరుగులు చేసింది. బదులుగా దాన్ని డిఫెండ్ చేస్తూ సన్ రైజర్స్ 120 పరుగులకే కట్టడి చేసింది. 4వ తేదీన లక్నో సూపర్ జెయింట్స్, ముంబై ఇండియన్స్ మధ్య జరిగిన మ్యాచ్ కూడా 200 ప్లస్ టోటల్ డిఫెండ్ అవ్వడానికి సాక్ష్యంగా నిలిచింది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన లక్నో 8 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. బదులుగా ముంబై 191 పరుగులు మాత్రమే చేయగలిగింది. 5న రాజస్థాన్ రాయల్స్ పంజాబ్ కింగ్స్‌పై 205 పరుగులు చేసి దాన్ని డిఫెండ్ చేసుకొని గెలిచింది.

7న రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు కూడా ముంబై ఇండియన్స్‌పై 222 పరుగుల టార్గెట్‌ను డిఫెండ్ చేసింది. 8న లక్నో సూపర్ జెయింట్స్ కోల్‌కతా నైట్ రైడర్స్‌పై 238 పరుగులు డిఫెండ్ చేసింది. అదే రోజు పంజాబ్ కింగ్స్ చెన్నై సూపర్ కింగ్స్‌పై 219 పరుగులు డిఫెండ్ చేసింది. ఏప్రిల్ 9న గుజరాత్ టైటాన్స్ రాజస్థాన్ రాయల్స్‌పై 218 పరుగుల టార్గెట్‌ను డిఫెండ్ చేస్తూ విజయం సాధించింది.


## బిల్లీ జీన్ కింగ్ కప్‌లో.. మూడో మ్యాచ్‌లోనూ
# నెగ్గిన రష్మిక
### హాంకాంగ్‌పై 2-1తో గెలుపు
### అంతిక-ప్రార్థన ద్వయం ఓటమి




**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక బిల్లీ జీన్ కింగ్ కప్ మహిళల టీమ్ టెన్నిస్ టోర్నీలో హైదరాబాదీ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక వరుస విజయాలతో అదరగొడుతోంది. ఆసియా ఓసియానియా గ్రూప్-1లో భాగంగా పుణేలో హాంకాంగ్‌తో జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌లో భారత్ జట్టు 2-1తో గెలుపొందింది. ఈ టోర్నీలో భారత్‌కు ఇది రెండో విజయంగా నమోదైంది. హాంకాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ సింగిల్స్‌లో ఒక మార్పు చేసింది. న్యూజిలాండ్, థాయ్‌లాండ్ జట్లతో జరిగిన మ్యాచ్‌లో బరిలోకి దిగిన హైదరాబాద్ ప్లేయర్ యామలపల్లి సహజ స్థానంలో గుజరాత్‌కు చెందిన వైదేహి చౌదరికి అవకాశం ఇచ్చారు. తొలి మ్యాచ్‌లో పోటీపడ్డ వైదేహి 2 గంటల 3 నిముషాల్లో 7-6 (10/8), 6-1తో హో చింగ్ వు పై గెలిచి భారత్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించింది.

ఇక రెండో మ్యాచ్‌లో బరిలోకి దిగిన రష్మిక 7-6 (8/6), 2-6, 6-3తో హాంగ్ యి కోడీవోంగ్‌ను ఓడించి భారత్‌కు 2-0తో విజయాన్ని ఖరారు చేసింది. 2 గంటల 27 నిముషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక ఎనిమిది ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తొలి సర్వీస్‌ను నాలుగు సార్లు కోల్పోయిన రష్మిక, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో, థాయ్‌లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో కూడా రష్మిక సింగిల్స్ విభాగంలో వరుస విజయాలను అందుకుంది. ఇక ఫలితం తేలకపోవడంతో నామమాత్రమైన మూడో మ్యాచ్‌లో భారత్‌కు చెందిన అంకిత రైనా-ప్రార్థన తొబారే జోడీ పోరాడినా చివరకు విజయానికి దూరమైంది. 2 గంటల 2 నిముషాల పాటు జరిగిన డబుల్స్ మ్యాచ్‌లో అంకిత-ప్రార్థన ద్వయం 7-6 (7/2), 3-6, 11-13తో సూపర్ టైబ్రేక్‌లో యుడైస్ చోంగ్-హాంగ్‌యికోడీ వోంగ్ జంట చేతిలో ఓటమిపాలైంది.

## ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టోర్నీలో.. క్వార్టర్ ఫైనల్లోకి
# ఇండో అమెరికన్ ద్వయం



**న్యూఢిల్లీ:** మోంటెకార్లో ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నమెంట్‌లో క్వార్టర్ ఫైనల్లోకి ఇండోఅమెరికన్ ద్వయం దూసుకెళ్లింది. భారత్ టెన్నిస్ డబుల్స్ ప్లేయర్ రోహన్ బోపన్న, అమెరికా రైజింగ్ స్టార్ బెన్ షెల్టన్ జోడీ ప్రిక్వార్టర్స్ ఫైనల్లో ఇటలీకి చెందిన మూడో సీడ్ సిమోన్ బొలెలీ-ఆంద్రియా వాహాసోరి జోడీకి షాక్ ఇచ్చింది. 96 నిముషాల పాటు జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో బోపన్న-షెల్టన్ జంట 2-6, 7-6 (7/4), 10-7తో సూపర్ టైబ్రేక్‌లో బొలెలీ- వావాసోరి జోడీని బోల్తా కొట్టించింది. మూడు ఏస్‌లు సంధించిన బోపన్న-షెల్టన్ ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను మూడు సార్లు కోల్పోయిన ఈ ఇండో అమెరికన్ జంట ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేసింది. క్వార్టర్ ఫైనల్లో ఫ్రాన్స్‌కు చెందిన మాన్యుయెల్ గినార్డ్-మొనాకోకు చెందిన రొమైన్ అర్నియోడో ద్వయంతో బోపన్న-షెల్టన్ జంట తలపడుతుంది. ఈ ఏడాది ఏడో టోర్నీలో ఆడుతున్న బోపన్న డబుల్స్ విభాగంలో ప్రస్తుతం మోంటెకార్లో ఓపెన్‌లో, దోహా ఓపెన్‌లో మాత్రమే క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాడు.

## బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో..
# పోరాడి ఓడిన సింధు

**న్యూఢిల్లీ:** ఆసియా ఛాంపియన్‌షిప్-2025లో భారత స్టార్ షట్లర్ పివి సింధుకు నిరాశ ఎదురైంది. తొలి మ్యాచ్‌లో నెగ్గిన సింధుకు హోరా హోరీగా సాగిన రెండో రౌండ్‌లో పరాజయం ఎదురైంది. ఆమె జపాన్‌కు చెందిన యమగుచి చేతిలో 12-21, 21-16, 16-21 తేడాతో ఓడింది. తాజా ఓటమితో సింధు ఆసియా ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్ నుంచి నిష్క్రమించింది. మ్యాచ్ విషయానికి వస్తే జపాన్‌కు చెందిన యమగుచితో సింధు రెండో రౌండ్‌లో ఢీ కొట్టింది. ఈమ్యాచ్‌లో తొలి నుంచి ఆధిపత్యం ప్రదర్శించి యమగుచి సింధుపై మొదటి సెట్‌లో భారీ తేడా 12-21తో నెగ్గింది. ఇక రెండో సెట్‌లో సింధు కమ్ బ్యాక్ ఇచ్చింది. ప్రత్యర్థికి సవాల్ విసురుతూ చురుగ్గా ఆడింది. ఫలితంగా రెండో సెట్‌ను సింధు 21-16తో దక్కించుకుంది. దీంతో ఫలితం కోసం మూడో సెట్ ఆడాల్సి వచ్చింది.

ఈ డూ ఆర్ డై సెట్‌లో సింధు ప్రత్యర్థికి గట్టిగానే బదులిచ్చింది. హోరాహోరీగా సాగిన ఈ సెట్‌లో సింధు ఆఖర్లో పట్టు కోల్పోయింది. చివర్లో యమగుచి 16-24 తేడాతో నెగ్గి మ్యాచ్ సొంతం చేసుకుంది. దీంతో సింధు టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈ విధంగానే గత నాలుగు టోర్నమెంట్‌ల్లో సింధు రెండోరౌండ్ దాటకపోవడం గమనార్హం. కాగా సింధు ఓటమితో ఆసియా ఛాంపియన్‌షిప్‌లో భారత్ బ్యాడ్మింటన్ సింగిల్స్ పోరాటం



ముగిసింది. ఇక పురుషుల సింగిల్స్ విభాగంలో కిరణ్ జార్జ్, ప్రియాన్షు రజావత్ కూడా రెండో రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టారు. జపాన్ సీడ్ కొడయ్ నరకొను ఎదుర్కొన్న ప్రియాన్షు 14-21, 17-21 వరుస సెట్లలో ఓడిపోయాడు. అదేవిధంగా కుల్వంత్‌తో ఢీ కొట్టిన కిరణ్ 21-19,13-21,16-21 తేడాతోపరాజయం పాలయ్యాడు. ఇక మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత జోడీ ధ్రువ్ కపిల-తానిషా క్రాస్టో క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించారు. రెండో రౌండ్లో ఈ జోడీ చైనీస్ తైపీకి చెందిన యేహాంగ్-వీ నికోల్ గొంజాలెస్ చాన్‌ను ఢీ కొట్టింది. ఈ రౌండ్‌లో భారత్ జోడీ 12-21 21-16 21-18తో నెగ్గి క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది.

# చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్‌గా ధోనీ
### ఐపిఎల్ టోర్నీకి రుతురాజ్ గుడ్ బై



**న్యూఢిల్లీ:**న ఐపిఎల్-2025, 18వ సీజనులో చెన్నై సూపర్ కింగ్స్‌కు ఇప్పటి నుండి మిగిలిన మ్యాచ్‌ల్లో ఎంఎస్ ధోని కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ విషయాన్ని చెన్నై యాజమాన్యం అధికారికంగా ప్రకటించింది. ప్రస్తుత కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ గాయం కారణంగా ఐపిఎల్‌కు దూరం కావడంతో సూపర్ కింగ్స్ మేనేజ్‌మెంట్ ఈ నిర్ణయం తీసుకుంది. రుతురాజ్ మోచేతికి గాయం కావడంతో ఐపిఎల్ నుంచి పూర్తిగా తప్పుకున్నాడు. కాగా, ఈ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ప్రదర్శన పేలవంగా ఉన్న విషయం తెలిసిందే. తొలి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై గెలిచిన చెన్నై ఆ తర్వాత వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో ఓటమి పాలైంది. మరి ఇప్పుడు ధోని కెప్టెన్సీ తీసుకున్న తర్వాత అయినా చెన్నై సూపర్ కింగ్స్ జాతకం మారుతుందో లేదో చూడాలి. అయితే ఉన్నపళంగా రుతురాజ్ గాయపడటం కూడా అనుమానాలకు తావిస్తోంది. గతంలో ఇలాగే రవీంద్ర జడేజాకు కెప్టెన్సీ ఇచ్చి చెన్నై వరుసగా ఓడిపోతున్న క్రమంలో అతన్ని తప్పించి మళ్లీ ధోనికే కెప్టెన్సీని ఫ్రాంచైజీ యాజమాన్యం కట్టబెట్టింది. ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితి ఉండటంతో సేమ్ సీన్ రిపీట్ అయిందా? నిజంగానే రుతురాజ్ గాయపడ్డాడా? లేదా అతన్ని బలవంతంగా తప్పించారా? అనే డౌట్స్ క్రికెట్ అభిమానుల నుంచి వ్యక్తం అవుతున్నాయి.

# వాణిజ్యం

# ఈక్విటీల్లోకి ఎంఎఫ్ పెట్టుబడులు డౌన్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:** అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి ప్రపంచ ఈక్విటీ మార్కెట్లతో పాటు మన మార్కెట్లూ తీవ్ర ఒడుదుడుకులు ఎదుర్కొంటున్నాయి. ఈ ప్రభావం మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులపైనా పడింది. వరుసగా మూడో నెలలో కూడా ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లోకి పెట్టుబడులు తగ్గుముఖం పట్టాయి. మార్చి నెలలో ఈ మొత్తం 14 శాతం క్షీణించి రూ.25,082 కోట్లుగా నమోదయ్యాయి. మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్.. యాంఫీ సంబంధిత గణాంకాలను విడుదల చేసింది. ఈ ఏడాది జనవరిలో నెలలో ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్స్‌లోకి రూ.39,688 కోట్లు పెట్టుబడులు రాగా.. ఫిబ్రవరిలో ఆ మొత్తం రూ.29,303 కోట్లుగా నమోదైంది. మార్చి నెలలో మరింత క్షీణించి రూ.25,082 కోట్లకు చేరింది. డిసెంబర్‌లో ఈ మొత్తం రూ.41,156 కోట్లుగా ఉండడం విశేషం. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ కేటగిరీలోనే ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్‌లోకి మార్చి నెలలో అత్యధికంగా రూ.5,165 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. సెక్టోరల్/ థీమాటిక్ ఫండ్స్‌లోకి ఫిబ్రవరిలో రూ.5,711 కోట్లు పెట్టుబడులు రాగా, మార్చిలో కేవలం రూ.735కోట్లు మాత్రమే వచ్చాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ మ్యూచువల్ ఫండ్స్‌లోకి మాత్రం పెట్టుబడులు స్థిరంగా కొనసాగుతున్నాయి. మిడ్‌క్యాప్స్‌లోకి రూ.3,439 కోట్లు, స్మాల్‌క్యాప్స్‌లోకి రూ.4,092 కోట్లు చొప్పున పెట్టు బడులు వచ్చాయి. అంతకుముందు నెలలో మిడ్‌క్యాప్స్‌లోకి రూ.3,406 కోట్లు, స్మాల్‌క్యాప్స్‌లోకి రూ.3,722 కోట్లతో పోలిస్తే ఈ మొత్తం పెరగడం విశేషం. లార్జ్ క్యాప్ ఫండ్స్‌లోకి పెట్టుబడులు ఫిబ్రవరిలో రూ.2,866 కోట్లతో పోలిస్తే రూ.2,479 కోట్లకు తగ్గాయి. గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో ఫిబ్రవరి నెలలో రూ.1,980 కోట్లు రాగా, మార్చి నెలలో రూ.77 కోట్లు తరలిపోయాయి. డెట్ మ్యూచువల్ ఫండ్స్ కేటగిరీ విషయానికొస్తే, మార్చి నెలలో ఏకంగా రూ.2.02 లక్షల కోట్ల పెట్టుబడులు వెనక్కి మళ్లాయి. ఫిబ్రవరిలో రూ.6,525 కోట్లు ఇన్‌ఫ్లోలు నమోదయ్యాయి. మొత్తంగా చూసినప్పుడు ఫిబ్రవరిలో మ్యూచువల్ ఫండ్స్ ఇండస్ట్రీ ఫిబ్రవరిలో రూ.40వేల కోట్ల ఇన్‌ఫ్లోను చూడగా, మార్చి నెలలో నికరంగా రూ.1.64 లక్షల కోట్ల పెట్టుబడులు తరలిపోయాయి. పెద్ద మొత్తంలో పెట్టుబడులు తరలిపోయినప్పటికీ, మ్యూచువల్ ఫండ్స్ ఇండస్ట్రీ నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ (ఎయుఎం) అంతకుముందు నెలతో పోలిస్తే మార్చి నెలలో రూ.64.53 లక్షల కోట్ల నుంచి రూ.65.7లక్షల కోట్లకు పెరగడం గమనార్హం.




# సూచీలు రయ్..రయ్..

**ముంబై, ఏప్రిల్ 11:** ప్రపంచ దేశాలపై విధించిన టారిఫ్‌లకు 90రోజుల పాటు బ్రేక్ వేస్తున్నట్లు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో మన మార్కెట్లు శుక్రవారం దూసుకెళ్లాయి. అమెరికా, చైనా మధ్య ఓవైపు సుంకాల పోరు కొనసాగుతున్నా మన మార్కెట్లు మాత్రం దాదాపు రూ.7.72 లక్షల కోట్లు పెరిగి రూ.401.54 లక్షల కోట్లకు చేరింది. ఆసియా, జపాన్ మార్కెట్లు నష్టాలు చవిచూడగా.. షాంఘై, హాంకాంగ్ మార్కెట్లు లాభాల్లో ముగియడం గమనార్హం. ట్రంప్ విరామ ప్రకటనతో మరుసటి రోజే మన సూచీలు దూసుకెళ్లాల్సి ఉన్నా, మహవీర్ జయంతి కారణంగా మార్కెట్లు పనిచేయలేదు. దీంతో శుక్రవారం అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు ఉన్నప్పటికీ సూచీలు లాభాల్లో ప్రారంభం అయ్యాయి. ఇంట్రాడేలో 75,467.33 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 1310.11 పాయింట్ల లాభంతో 75,157.26 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 429.40 పాయింట్ల లాభంతో 22,828.55 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ రూ.86.05గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టీసీఎస్, ఏషియన్ పెయింట్స్ షేర్లు మినహా మిగిలిన అన్ని షేర్లూ లాభాల్లో ముగిశాయి. టాటా స్టీల్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, రిలయన్స్ షేర్లు రాణించాయి. ఫార్మా, మెటల్ స్టాక్స్ ప్రధానంగా రాణించాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్‌బ్యారెల్ 63.65 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం దూసుకెళుతోంది. ఔన్సు 3248 డాలర్ల వద్ద కొనసాగుతోంది. భారత్ సహా 75 దేశాలపై విధించిన టారిఫ్‌లను ట్రంప్ 90 రోజుల పాటు నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించడం మన మార్కెట్లకు ఊరటనిచ్చింది. వాణిజ్య యుద్ధ భయాల నేపథ్యంలో ఈ ప్రకటన మార్కెట్లకు కొత్త ఉత్సాహాన్నిచ్చింది. సెన్సెక్స్ 1300 పాయింట్ల మేర లాభపడగా.. నిఫ్టీ మళ్లీ 22,800 స్థాయిని దాటింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ

భారీ లాభాల్లో ముగియడం గమనార్హం. అన్ని రంగాల షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో ప్రధాన సూచీలు బలంగా పుంజుకొన్నాయి. ఈ క్రమంలో



# పసిడి ధరలు పైపైకి

**ముంబై, ఏప్రిల్ 11:** దేశంలో బంగారం ధరలు భారీగా పెరిగిపోతున్నాయి. గురువారం గరిష్టంగా రూ.2940 పెరిగిన గోల్డ్ ధర, శుక్రవారం రూ.2020 పెరిగి ఒక్కసారిగా షాకిచ్చింది. దీంతో దేశంలోని ప్రధాన నగరాల్లో కూడా పసిడి ధరలలో మార్పులు జరిగాయి. హైదరాబాద్, విజయవాడలో 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.87,450 వద్ద, 24 క్యారెట్ల బంగారం ధర రూ.95,400 వద్ద నిలిచాయి. చెన్నైలో కూడా బంగారం ధరలు వరుసగా రూ.1850, రూ.2020 పెరిగింది. దీంతో ఇక్కడ 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి రేటు రూ.87,450 వద్ద, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.95,400 వద్ద ఉంది. దేశ రాజధాని నగరంలో పసిడి ధరలు 10 గ్రాముల 22 క్యారెట్లకు రూ.87,600, 10 గ్రాముల 24 క్యారెట్లకు రూ.95,550 వద్ద ఉన్నాయి. అదేవిధంగా వెండి ధరలు కూడా కొంత పెరుగుదలవైపు అడుగులు వేశాయి. శుక్రవారం కేజీ సిల్వర్ రేటు రూ.1,08,000కు చేరింది. హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో వెండి ధరలు ఒకే విధంగా ఉన్నప్పటికీ, ఢిల్లీలో మాత్రం కేజీ వెండి ధర రూ.97,100 వద్ద ఉంది.



# నేను సైతం రెండు సార్లు ఫైన్ కట్టా': నితిన్ గడ్కరీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:** భారతదేశంలో ట్రాఫిక్ రూల్స్ కఠినంగా మారుతున్నాయి. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించిన ఎవరికైనా జరిమానా తప్పదు అని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. నేను కూడా ముంబైలో రెండు సార్లు ఫైన్ కట్టానని రైజింగ్ భారత్ సమ్మిట్ 2025 కార్యక్రమంలో వెల్లడించాయి. ఇప్పుడు హైవేల మీద అత్యాధునిక కెమెరాలు, సెన్సార్లు ఉన్నాయి. ఎవరూ తప్పించుకోలేదు. మిమ్మల్ని ఎవరూ రక్షించలేరు. కెమరా ఫోటో తీస్తుంది. జరిమానా తప్పకుండా కట్టాల్సిందే. కఠినమైన ట్రాఫిక్ చలాన్లపై అడిగిన ప్రశ్నకు సమాధానంగా జరిమానాలు ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో ప్రవేశపెట్టలేదు. చట్టానికి కట్టుబడి ఉండటానికి తీసుకొచ్చాము. జరిమానాలు పెరిగాయని ప్రజలు అంటున్నారు. అలాంటప్పుడు నిబంధనలను ఉల్లంఘించకుండా ఉండే సరిపోతుందని గడ్కరీ అన్నారు. ప్రభుత్వం 2019లో మోటారు వాహన చట్టాన్ని సవరించింది. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించడం, రవాణా నియమాల ఉల్లంఘనలు పెరగడం వల్ల రోడ్లు ప్రమాదాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. కాబట్టి ట్రాఫిక్ ఉల్లంఘనలు తగ్గించడానికి ప్రధాన మార్గం అధిక జరిమానాలు విధించడమే. 2019లో రోడ్డు ప్రమాదం వల్ల మరణించినవారి సంఖ్య సుమారు 1.59 లక్షలు, ఈ సంఖ్య 2022 నాటికి 1.68 లక్షలకు చేరింది. కాబట్టి నియమాలను మరింత కఠినతరం చేయకపోతే, మరణాల సంఖ్య నానాటికి గణనీయంగా పెరిగిపోతుందని గడ్కరీ తెలిపారు. గత సంవత్సరం ట్రాఫిక్ ఉల్లంఘనలను పర్యవేక్షించడానికి, జరిమానాలు విధించడానికి కృత్రిమ మేధస్సుతో పాటు, ఇతర సాంకేతిక టెక్నాలజీని ఉపయోగించాలని గడ్కరీ పేర్కొన్నారు. ఇవన్నీ ఎప్పటికప్పుడు రూల్స్ అతిక్రమించిన వారిని గుర్తించ డంలో సహాయపడతాయి. తద్వారా దేశంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.



# గూగుల్‌లో మళ్లీ లేఆఫ్‌లు..

**వాషింగ్టన్, ఏప్రిల్ 11:** టెక్ దిగ్గజం గూగుల్ మరోమారు లేఆఫ్‌ల ప్రక్రియ చేపట్టింది. తమ ప్లాట్‌ఫామ్, డివైజ్ యూనిట్లలో పనిచేసే వందల మంది ఉద్యోగులను తొలగించింది. ఆండ్రాయిడ్ సాఫ్ట్‌వేర్, పిక్సెల్ ఫోన్లు, క్రోమ్ బ్రౌజర్లలో పనిచేసే ఉద్యోగులపై ఈ వేటు పడినట్లు తెలుస్తోంది. అయితే కచ్చితంగా ఎంతమందిని తొలగించాలన్న విషయంపై మాత్రం స్పష్టత లేదు. కాగా కంపెనీ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో భాగంగా గత రెండేళ్లలో గూగుల్ అనేక మందిని విధుల నుంచి తప్పించింది. గతేడాది డిసెంబరులో మేనేజర్, డైరెక్టర్లు, వైస్ ప్రెసిడెంట్ హోదాల్లో పనిచేస్తున్న వారిలో 10 శాతం మందికి లేఆఫ్‌లు ప్రకటించింది. ఇక ఈ యేడాది ఫిబ్రవరిలో హెచ్‌ఆర్ విభాగం, క్లౌడ్ ఆర్గనైజేషన్‌లో కొంతమందిని తొలగించింది. ఖర్చు తగ్గింపులో భాగంగా కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. గూగుల్‌లో 20శాతం మంది మరింత సమర్థంగా పనిచేయాలని గూగుల్ సిఇఒ సుందర్ పిచాయ్ 2022లో వెల్లడించారు. ఆ మరుసటి యేడాదే 12వేల మంది ఉద్యోగులను గూగుల్ తొలగించింది. ఓపెన్ ఎఐ వంటి సంస్థలు సెర్చింజిన్‌ను తీసుకొసునతండడంతో గూగుల్‌కు గట్టిపోటీ తప్పదని విశ్లేషకులు భావిస్తున్న వేళ ఈ తొలగింపులు చేపట్టడం విశేషం. ఇక అమెరికాలో విదేశీ నిపుణులపై ట్రంప్ కఠిన నిబంధనలు అమలు చేస్తున్న సమయంలో ఈ లేఆఫ్ వార్తలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.




# టెస్లా నుంచి కొత్త 'సైబర్‌ట్రక్'

**వాషింగ్టన్, ఏప్రిల్ 11:** ప్రముఖ అమెరికా ఎలక్ట్రిక్ కార్ల దిగ్గజం టెస్లా యుఎస్‌లో కొత్త సైబర్‌ట్రక్ వెర్షన్‌ను విడుదల చేసింది. దీని ప్రారంభ ధరను 69,990 అమెరికన్ డాలర్లుగా నిర్ణయించింది. ఇది ప్రస్తుతం అందుబాటులో ఉన్న మూడు సైబర్‌ట్రక్ మోడళ్లలో చౌకైనదిగా కంపెనీ పేర్కొంది. కొత్త సైబర్ ట్రక్ వేరియంట్‌కు సంబంధించిన రేంజ్, టోవింగ్ సామర్థ్యం, యాక్సిలరేషన్ వంటి స్పెసిఫికేషన్లపై వివరాలు వెల్లడించలేదు. అమెరికాలో 69,990 డాలర్ల ధరతో ఎంట్రీ లెవల్ సైబర్‌ట్రక్ యుఎస్ మార్కెట్లో ఆదరణ పొందుతున్న ఫోర్డ్ ఎఫ్-150 లైటనింగ్, రివియన్ ఆర్1 టి వంటి ఇతర ఎలక్ట్రిక్ మోడళ్లతో పోటీ పడుతుందని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. స్టెయిన్‌లెస్ స్టీల్ ఎక్సోస్కెలెటన్, ఆర్మర్డ్ గ్లాస్, అధునాతన డ్రైవర్ అసిస్టెన్స్ సామర్థ్యాలు సైబర్ ట్రక్‌లో ఉన్నాయని కంపెనీ తెలిపింది. 'ఇవి' విభాగంలో టెస్లా ఆధిపత్యాన్ని కొనసాగించడానికి కంపెనీ కొంత కాలంగా ఒత్తిడిని ఎదుర్కొంటోంది. దీనికి తోడు ఆర్థిక అనిశినచతి, ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ హెచ్చుతగ్గులుండడం వాహన తయారీదారులు ధరలకు సంబంధించి పునరాలోచనలో పడేలా చేశాయి. ఈ నేపథ్యంలో టెస్లా తీసుకున్న నిర్ణయం వినియోగదారులు మరింత సరసమైన ధరలకు కార్లను కొనుగోలు చేసేలా ప్రోత్సహిస్తుందని కొందరు అభిప్రాయపడుతున్నారు.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.